


మోహన స్మృతి

కామ్రేడ్ విశ్వవరం మోహన్‌రెడ్డి

మిత్రుల జ్ఞాపకాల సంకలనం

మోహన స్మృతి

కామ్రేడ్ విశ్వవరం మోహన్‌రెడ్డి
మిత్రుల జ్ఞాపకాల సంకలనం



సంపాదకుడు

సిద్ధార్థ

మోహన్‌రెడ్డి మిత్రులు

మోహన్ స్మృతి

కామ్రేడ్ విశ్వవరం మోహన్‌రెడ్డి
మిత్రుల జ్ఞాపకాల సంకలనం

సంపాదకులు : సిద్ధార్థ

ప్రచురణ సంఖ్య : 1

ప్రతులు : 500

మొదటిముద్రణ : ఆగస్టు 2019

ప్రచురణ : మోహన్‌రెడ్డి మిత్రులు

కవర్ డిజైన్ : గిరిధర్

ముద్రణ :
శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ

ప్రతులకు :
సిద్ధార్థ, నెం. 301, మిత్రాటవర్స్,
డొంకరోడ్డు, పోరంకి.
విజయవాడ – 521137

మాట్లాడటం కోసం : 9247575436

ఇందులో...

ముందుమాట

- మోహన్‌రెడ్డి మిత్రులు

విశ్వవరం మోహన్‌రెడ్డి కన్నుమూసిన రెండేళ్ళకి ఈ పుస్తకం తేగలుగుతున్నాం. ఆగష్టు 18, 2017 వేకువజామున మోహన్ తుది శ్వాస తీసుకోగా, రెండురోజుల తర్వాత ఆగస్టు 20న, ఆయన ఉద్యమ సహచరులు నలుగురు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. సామాజిక మార్పు కోసం, ప్రజల విముక్తి కోసం జీవిత పర్యంతం కృషిచేసిన ఆ కామ్రేడ్ స్మృతిలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. వివిధ రంగాల్లో విస్తరించి వున్న మోహన్ స్నేహితుల్ని కదిలించి 'మోహన్‌రెడ్డి మిత్రులు' (Friends of Mohan Reddy) పేరుతో వెంటనే సంస్మరణ సభలు జరపాలని, రెండు పుస్తకాలు ప్రచురించాలని నిర్ణయం తీసుకున్నారు. దీని కోసం మళ్ళీ హైదరాబాద్‌లోనే ఆగస్ట్ 23న మోహన్‌రెడ్డి మిత్రుల విస్తృత సమావేశం జరిగింది.

మోహన్ బాల్యస్నేహితులు, జె.ఎన్.యు.లో కలిసి చదువుకున్న మిత్రులు, విప్లవోద్యమ సహచరులు, స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తున్న ఆయన మిత్రులు దాదాపు 25మంది ఆ సమావేశానికి హాజరయ్యారు. మోహన్ సంస్మరణ సభల నిర్వహణ కోసం సన్నాహకంగా జరిపిన ఆ సమావేశమే ఒక సంస్మరణ సభగా మారిపోయింది. హైదరాబాదు, విజయవాడ, సూర్యాపేటలలో సంస్మరణసభలు నిర్వహించాలని, మోహన్ మిత్రులతో జ్ఞాపకాలు రాయించి ఒక స్మృతి సంకలనాన్ని వెలువరించాలని, తర్వాత మోహన్ రచనలను సేకరించి మరో సంకలనం తీసుకురావాలని ఆ సమావేశం నిర్ణయించింది.

నిర్ణయించిన విధంగా మూడు సంస్మరణ సభలూ విజయవంతంగా జరిగాయి. మోహన్ మిత్రులు, సహచరులు ఈ సమావేశాల్లో ఎంతో ఉద్వేగంలో

మోహన్‌తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ మాట్లాడారు. ఆ స్పందన చూసాక మోహన్‌తో స్మృతుల సంకలనాన్ని మూడు నెలల కాలంలోనే తేవాలని, ఆయన రచనల సంకలనాన్ని మొదటి వర్ధంతి నాటికి విడుదల చేయాలని అనుకున్నాం. కాని మిత్రులు తమ రచనలు అందచేయటంలో జరిగిన అసాధారణ జాప్యం కారణంగా ఎట్టకేలకు రెండేళ్ళ తర్వాత తీసుకురాగలుగుతున్నాం. ఆయన రచనలను సేకరించే కార్యక్రమం ఇంకా జరుగుతూనే వుంది.

తెలంగాణా సాయుధపోరాటం ఉధృతంగా సాగిన జిల్లాలో, గ్రామంలో కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టి పెరిగిన మోహన్‌రెడ్డి చిన్న వయస్సులోనే కమ్యూనిస్టుగా రూపొందాడు. నక్సల్బరీ, శ్రీకాకుళ సాయుధపోరాటాల ఉత్తేజంతో విప్లవోద్యమంలో పనిచేయటం ప్రారంభించాడు. తెలుగునాట విప్లవవిద్యార్థి ఉద్యమం వైతాళికులలో ఆయన ఒకడు. కోదాడలోనే కాక, ఢిల్లీ జె.ఎన్.యు.లో కూడా ఆయన విప్లవ విద్యార్థి సంఘాన్ని నిర్మించాడు. తర్వాత నూతన అవగాహనతో మావోయిజం వెలుగులో జాతివిముక్తి పోరాటాన్ని, విప్లవ పార్టీ నిర్మాణాన్ని చేపట్టాడు.

మోహన్ ఏ రంగంలో పనిచేసినా ప్రజలకు సేవచేయటమే లక్ష్యంగా, తనదైన శైలిలో ఎంతో నిబద్ధతతో పనిచేసాడు. ఆ రంగాలన్నిటిలోనూ తనదైన ముద్రనీ, ప్రభావాన్ని పడవేయగల్గాడు. ప్రజలతో మమేకమై, వాళ్ళ విశ్వాసాన్ని, అభిమానాన్ని పొందగలిగాడు. చివరి వరకూ తాను నమ్మిన విలువలను పాటించాడు.

ఈ సంకలనంలో దాదాపు 20మంది మోహన్ మిత్రులు, సహచరులు, కుటుంబసభ్యులు రాసిన రచనలున్నాయి. 'ఒక ప్రజామేధావి నిష్క్రమణ', మోహన్ కనుమరుగైన సందర్భంగా సంస్మరణసభల కోసం రాసిన కరపత్రం. మోహన్ జీవితరేఖల్నీ, ఆయన ఉద్యమ ప్రస్థానాన్నీ అది క్లుప్తంగా వివరిస్తుంది. 'చరిత్రలో మోహన్‌రెడ్డి స్థానం' ఆయన సైద్ధాంతిక అవగాహననూ, సామాజికమార్పుకు ఆయన చేసిన దోహదాన్ని విశ్లేషిస్తుంది. మిగిలిన రచనలన్నీ ప్రధానంగా మోహన్‌తో ఆ రచయితలకున్న జ్ఞాపకాలు. మోహన్ తన స్నేహితులపైనా,

సహచరులమీదా ఎంత గాఢమైన ప్రభావాన్ని పడవేసాడో, ఎంత ఆత్మీయమైన సంబంధాలను కలిగి వున్నాడో, ఎంత అసాధారణమైన మేధస్సుతో పనిచేసాడో ఈ జ్ఞాపకాలు తెలియచేస్తాయి. అదే సమయంలో మోహన్ వ్యక్తిత్వంలోని పరిమితులు, పనితీరులోని లోపాలను కూడా విమర్శనాత్మకంగా ఎత్తిచూపుతాయి.

మిత్రులందరి సహకారంతో, దొరికినంతవరకూ మోహన్ రచనలను సేకరించి త్వరలోనే రెండవ పుస్తకాన్ని కూడా ప్రచురిస్తాము. ఈ రెండు పుస్తకాలు చరిత్ర రచనకే కాకుండా, చరిత్ర నిర్మాణానికి కూడా దోహదం చేస్తాయని మేము నమ్ముతున్నాం. తాను గాఢంగా ప్రేమించే జాతి జనుల్ని, వారి విముక్తి లక్ష్యాన్ని వదిలిపెట్టి శాశ్వతంగా దూరమైన మా ఆప్తమిత్రుడికి జోహార్లర్పిస్తూ, మేం పనిచేసే అన్ని రంగాలలోను ప్రజల ప్రయోజనాలను, సామాజిక మార్పునూ ఎత్తిపడతామని హామీ ఇస్తున్నాం.

పరిచయం

చరిత్రలో మోహన్‌రెడ్డి స్థానం

– సంపాదకుడు

ఇది మోహన్‌రెడ్డి కథ. విశ్వవరం మోహనరెడ్డి మిత్రులు తమ జ్ఞాపకాలతో చెప్పిన జీవితకథ. 1964–2017 మధ్యకాలంలో తెలుగు సమాజంలో జీవించిన మోహన్‌రెడ్డి ఎవరు? ప్రజామేధావా? పర్యావరణవేత్తా? రాజకీయ అర్థశాస్త్రవేత్తా? కమ్యూనిస్టు విప్లవకారుడా? బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆ అసాధారణ మేధావిలో ఇవన్నీ వున్నాయి.

వీర తెలంగాణా సాయుధ పోరాట నేపథ్యం గల కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించిన మోహన్‌రెడ్డి హైస్కూల్‌దశలోనే రాజకీయ జీవితం ప్రారంభించాడు. నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటాల ఉత్తేజంతో విప్లవవిద్యార్థి ఉద్యమంలో పాల్గొన్నాడు. రాష్ట్రవ్యాపిత విప్లవవిద్యార్థి సంఘాలేవీ ఏర్పడకముందే కోదాడ కళాశాలలో చదువుకుంటూ తనమిత్రులతో కలిసి పి.ఎస్.యు.ని ఏర్పాటుచేసి విప్లవవిద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాడు. ఆవిధంగా మోహన్, తెలుగునాట విప్లవ విద్యార్థి ఉద్యమ వైతాళికులలో ఒకడు. అంతేకాకుండా జె.ఎన్.యు.లో పరిశోధన చేసే రోజుల్లో కూడా పి.ఎస్.ఎఫ్. అనే విద్యార్థి సంఘాన్ని ప్రారంభించి నాయకత్వం వహించాడు.

భారత ఉపఖండంలోని సామాజిక–ఆర్థిక నిర్మాణంలో వస్తున్న మార్పుల్ని గమనించి మోహన్‌రెడ్డి భారత విప్లవానికి నూతన పంథాని అన్వేషించాడు. అర్థవలస–అర్థభూస్వామ్య సమాజమనే సాంప్రదాయ ఎమ్.ఎల్ అవగాహనకు కాలం చెల్లిందని, ఇండియా ఒక నయావలస అని, సామ్రాజ్యవాదానికి,

ఉపఖండంలోని వివిధ జాతులకు మధ్యవున్న వైరుధ్యమే ప్రధానవైరుధ్యమని సూత్రీకరించాడు. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించటానికి దేశవ్యాపితంగా జాతివిముక్తి పోరాటాలను కార్మిక వర్గ పార్టీ నిర్మించి విప్లవాన్ని విజయవంతం చేయాలని, తర్వాత వివిధజాతుల రిపబ్లిక్‌ల ఐచ్ఛిక సమాఖ్యగా ఇండియాను పునర్నిర్మించి సోషలిజం, కమ్యూనిజం దిశగా పురోగమించాలని పేర్కొన్నాడు. ఈక్రమంలో తన తండ్రి నుంచి సంక్రమించిన చంద్రపుల్లారెడ్డి నాయకత్వంలోని పార్టీతో వున్న అనుబంధాన్ని తెంచుకుని, ఈ నూతన అవగాహనను రూపొందించిన సి.ఆర్.సి., సి.పి.ఐ.(ఎమ్.ఎల్)లో చేరి, ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖకు నాయకత్వం వహించాడు. ఈ నూతన అవగాహనతో అనంతపురం జిల్లాలోని కదిరిప్రాంతంలో విప్లవోద్యమాన్ని నిర్మించాడు.

తర్వాత కాలంలో ఈ అవగాహనను మోహన్ మరింత అభివృద్ధి చేసాడు. కులాలన్నీ తెగలని, కమ్యూనిస్టుపార్టీ ఈ కులాలను నిర్మూలిస్తూ జాతిని నిర్మించాలని చెప్పాడు. దళితుల్ని, అణగారిన ప్రజల్ని పునాదిగా చేసుకుని సామ్రాజ్యవాద వ్యతిరేక కుల నిర్మూలనా జాతివిముక్తి పోరాటాన్ని నిర్మించటమే నూతన ప్రజాస్వామిక విప్లవమని సూత్రీకరించాడు. ఈ పోరాటంలో భాగంగానే మగపెత్తనంపై దాడిచేస్తూ స్త్రీ విముక్తి ఉద్యమాన్ని నిర్మించాలని పేర్కొన్నాడు. మతతత్త్వానికి వ్యతిరేకంగా పోరాడి జాతి పునర్జీవనం కోసం కృషిచేయాలని చెప్పాడు.

మావోయిజం వెలుగులో మోహన్ ప్రతి సమస్యనీ లోతుగా అధ్యయనం చేసి సాంప్రదాయక అవగాహనలలోని పరిమితుల్ని ఛేదిస్తూ నూతన దృక్కోణాలను రూపొందించటానికి కృషిచేసాడు. ఈ క్రమంలో ప్రజల్ని ఉత్తేజపరిచే శక్తివంతమైన నినాదాల్ని రూపొందించేవాడు. విప్లవం ప్రజల జన్మహక్కని చాటేవాడు. స్త్రీలకు తమ శరీరాలపై సార్వభౌమాధికార హక్కు వుందని, అది అనుల్లంఘనీయమని చెప్పాడు. రష్యన్ బొల్షివిక్ పార్టీ నేత కొల్లంటాయ్ రాసిన 'మూడుతరాల' నవలిక తెలుగులో వెలువడినపుడు స్త్రీ–పురుష సంబంధాలమీద, లైంగికత మీద చర్చ నడిచింది. ఈ సమస్యమీద మా మధ్య జరిగిన చర్చలో మోహన్ ఎంతో

ప్రతిభావంతంగా మార్క్సిస్టు అవగాహనను ప్రకటించాడు. Not free Sex, freeing of Sexuality మన అవగాహన కావాలని చెప్పాడు.

పార్టీ నుండి బయటకు వచ్చాక కూడా మోహన్, బ్రతుకు తెరువు కోసం స్వచ్ఛంద సంస్థలలో పనిచేస్తూ కూడా తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ప్రకృతి, పర్యావరణం, వ్యవసాయానికి సంబంధించి అనేక ప్రయోగాలు చేసాడు. ఈ క్రమంలోనే ఈ సమస్యలమీద నూతన అవగాహనని రూపొందించటానికి కృషిచేసాడు. గ్రీన్‌రివల్యూషన్ ఫలితంగా దేశం ఎడారీకరణకు గురయిందని, వర్షాలు అడవులకు వలసపోయాయని, రైతుల ఆత్మహత్యలన్నీ 'క్లైమేట్ ఛేంజ్ డెత్' లేనని (తల్లక్రిందులైన వాతావరణవల్ల జరుగుతున్న మరణాలేనని) సూత్రీకరించాడు. హరితహారాల వలన ఉపయోగం వుండదని, కొండలచుట్టూ దట్టమైన అడవులను పెంచితే వర్షాలు తిరిగివస్తాయిని చెప్పేవాడు. వాననీటిని ఒడిసిపట్టుకోవటం ద్వారా కరువుప్రాంతాల్లో కూడ పంటలు పండించవచ్చుని పేర్కొన్నాడు. భూమికి నీటిని తాపించు అనే నినాదాన్ని తీసుకువచ్చాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ చేపట్టి మెట్టభూముల్లో లోతైన కందకాలు తవ్వి, సేంద్రియసేద్యం చేపడితే కరువు కాలంలోను ఆరుతడిపంటలకు ఢోకా వుండదని నిరూపించాడు.

ప్రకటించుకున్న ప్రాపంచిక దృక్పథానికి, జీవిస్తున్న తీరుకీ మధ్య అతి తక్కువ వైరుధ్యం సాధించిన అతి కొద్దిమంది కమ్యూనిస్టులలో మోహన్ ఒకడు. సొంత ఆస్తి పెంచుకోవటానికి వెంపర్లాడకుండా, వస్తు వ్యామోహాన్ని దరిచేరనీయకుండా, సాదాసీదా జీవితాన్ని గడిపి ఒక ఉదాహరణగా నిలిచిపోయాడు. పార్టీలో వున్నా, బయటవున్నా కడదాకా కమ్యూనిస్టుగా జీవించాడు. నిజమైన సామాజిక మార్పునీ, విప్లవాన్ని కోరుకునేవారందరికీ అతను స్ఫూర్తినిస్తాడు.

భవిష్యత్తు అతన్ని ధృవీకరిస్తుంది. చరిత్రలో అతని స్థానాన్ని పదిలం చేస్తుంది.

ఒక ప్రజామేధావి నిష్క్రమణ

ఆగస్ట్ 18వ తేదీ వేకువ జామున తెలుగు జాతీయ సమాజం, తనను గాఢంగా ప్రేమించి, తన విముక్తి కోసం తపించిన ఒక విలక్షణ మేధావిని కోల్పోయింది. 63 సం॥ల క్రితం ఆనాటి హైదరాబాద్ రాష్ట్రంలోని నల్గొండజిల్లా, సూర్యాపేట తాలూకా, ఆత్మకూరు గ్రామంలో జన్మించిన విశ్వవరం మోహనరెడ్డి సికింద్రాబాద్ అపోలో ఆస్పత్రిలో చివరి శ్వాస తీసుకున్నాడు. బ్రెయిన్ స్ట్రోక్ ఆ ప్రజామేధావి జీవితాన్ని చిదిమివేసింది. కృత్రిమ శ్వాసతో అపోలో వైద్యులు అతన్ని రెండు రోజులు బ్రతికించగా, దాన్ని అవకాశంగా తీసుకుని 'జీవన్ దాన్ ట్రస్ట్'కి అవయవాలను ఇవ్వాలని కొందరు మిత్రులం ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. అలాగే మృతదేహాన్ని వైద్య పరిశోధనల కోసం అప్పగించటానికి చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. దానితో అతని దేహాన్ని ఆత్మకూరుకు తరలించి, ప్రజల దర్శనం తర్వాత ఎర్రగుడ్డ కప్పి అంతిమసంస్కారం చేసారు.

భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని విరమించిన మూడు సం॥లకి, 1954లో ఆ పోరాటానికి గుండెకాయ అనదగిన నల్గొండ జిల్లాలో మోహన్ కళ్ళు తెరిచాడు. అతని బాల్యం నాటికి నల్గొండ జిల్లా పల్లెల్లో ఆ పోరాట గాధలు వినిపిస్తూనే వున్నాయి. 50 సం॥లక్రితం భారత ఉపఖండ వినీలాకాశం మీద మెరిసిన 'వసంత మేఘ ఘర్జన' సాయుధ విప్లవాన్ని మళ్ళీ ఎజెండా మీదకు తెచ్చేనాటికి మోహన్‌కు 13 ఏళ్ళు. అప్పటికే అతనిది కమ్యూనిస్టు కుటుంబం. తండ్రి సత్తిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలోని సి.పి.ఐ(ఎమ్.ఎల్)లో పని చేసేవాడు. 10వ తరగతి వరకు ఆత్మకూరులో చదివిన మోహన్, ఇంటర్మీడియట్ సూర్యాపేటలోను, డిగ్రీ కోదాడలోను చదివాడు. తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తత్త్వశాస్త్రంలో ఎమ్.ఎ. చేసాడు. విద్యార్థి దశలోనే

ప్రతిభావంతుడిగా గుర్తింపు తెచ్చుకున్న మోహన్, ఉస్మానియాలో గోల్డ్‌మెడల్ అందుకున్నాడు.

నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటాల ఉత్తేజంతో ఆవిర్భవించిన విప్లవ విద్యార్థి సంస్థ, పి.డి.ఎస్.యు.లో మోహన్ చేరాడు. నల్గొండ జిల్లాలోను, హైదరాబాదులోను పి.డి.యస్.యు. కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. కోదాడలో డిగ్రీ చేసే రోజుల్లోనే మోహన్ విద్యార్థి నాయకుడిగా ఎదిగాడు. ఆ రోజుల్లో గ్రామాల నుండి వచ్చిన విద్యార్థులు కోదాడలో రూములు అద్దెకు తీసుకుని చదువుకుంటూ వుండేవారు. వాళ్ళంతా కిరోసిన్ స్టవ్‌ల మీద వంట చేసుకునేవారు. కిరోసిన్ కొరత వలన ఒకరోజు విద్యార్థులకు వంట చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. మోహన్ విద్యార్థులకి నాయకత్వం వహించి ఈ సమస్యని పరిష్కరించాడు. తాను డిగ్రీ చేస్తున్న కె.ఆర్.ఆర్. మెమోరియల్ కళాశాల విద్యార్థి సంఘానికి జరిగిన ఎన్నికల్లో మోహన్ సైన్స్ విభాగం నుండి కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సాగిన విద్యార్థి పోరాటాల్లోనూ మోహన్ ముందున్నాడు. సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థుల సమస్యల మీద హైదరాబాదులో జరిగిన ఆందోళనలో పాల్గొన్న మోహన్, పోలీసుల దాడి నుండి తప్పించుకునేందుకు పరిగెత్తి గోడదూకి చెయ్యి విరగ్గొట్టుకున్నాడు.

1978లో ఎమ్.ఫిల్. చేయటానికి మోహన్ ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జె.ఎన్.యు.)లో చేరాడు. ప్రగతిశీల భావజాలానికి కేంద్రంగా వున్న జె.ఎన్.యు.లో వివిధ మార్క్సిస్టు ధోరణుల మధ్య భావజాల ఘర్షణ జరుగుతుండేది. ఈ సంఘర్షణలో మోహన్ చురుగ్గా పాల్గొనటమే కాక ప్రగతిశీల విద్యార్థుల సంఘటన (పి.ఎస్.ఎఫ్.)కు నాయకత్వం వహించాడు. నేపాల్‌కు చెందిన బాబూరామ్ భట్టారాయ్, జె.ఎన్.యు.లో మోహన్ సమకాలికుడు. భట్టారాయ్ జె.ఎన్.యు.లో రీసెర్చ్ స్కాలర్‌గా వుంటూనే భారతదేశంలోని నేపాలీ విద్యార్థుల కోసం ఒక సంఘాన్ని నిర్మించి నాయకత్వం వహించాడు. మోహన్, భట్టారాయ్‌లు అనేక సమస్యల మీద కలిసి పనిచేసారు. తర్వాత కాలంలో భట్టారాయ్, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అగ్రనాయకుడిగా ఎదిగి,

ఆ దేశంలో దశాబ్ద కాలంపాటు సాగిన ప్రజాయుద్ధంలో చురుగ్గా పాల్గొని, ప్రజాయుద్ధ విరమణ తర్వాత పార్లమెంటరీ రాజకీయాల్లో సైతం ప్రముఖ పాత్ర వహించాడు.

జె.ఎన్.యు. మోహన్ జీవితాన్ని మార్చేసింది. అక్కడ వుండగానే మెహన్‌కి 'మాస్‌లైన్' పత్రిక బృందంతో పరిచయం ఏర్పడింది. సి.పి.ఐ.(ఎమ్.ఎల్) సి.ఆర్.సి. నాయకులైన టి.జి.జాకబ్, కె. మురళీధరన్ (సన్నీ) కలిసి జె.ఎన్.యు. పక్కనే వున్న మునిర్కా గ్రామం నుంచి 'మాస్‌లైన్'ను వెలువరించేవారు. ఆ కాలంలో సి.ఆర్.సి. భారతదేశ మావోయిస్టు ఉద్యమంలో ప్రాధాన్యత కలిగిన సిద్ధాంత, రాజకీయ కృషి చేయటమే కాక సాంప్రదాయక ఎమ్.ఎల్. వైఖరుల నుండి విడగొట్టుకుని, భారత విప్లవానికి ఒక నూతన పంథాను రూపొందించింది. భారతదేశం అర్ధవలస – అర్ధభూస్వామ్య దేశం, ఫ్యూడలిజానికి, అశేష ప్రజానీకానికి మధ్య వున్న వైరుధ్యమే ఇక్కడ ప్రధాన వైరుధ్యం, దీన్ని పరిష్కరించటానికి సాగే నూతన ప్రజాస్వామిక విప్లవానికి వ్యవసాయక విప్లవం ఇరుసు – ఇదీ సాధారణ ఎమ్.ఎల్. పంథా. దీనికి భిన్నంగా సి.ఆర్.సి., భారతదేశం ఒక నయావలసదేశమని, సామ్రాజ్యవాదానికి, భారత ఉపఖండంలోని వివిధ జాతులకు మధ్య వున్న వైరుధ్యమే ప్రధాన వైరుధ్యమని, ఈ వైరుధ్యాన్ని పరిష్కరించటానికి సాగే నూతన ప్రజాస్వామిక విప్లవం సామ్రాజ్యవాద వ్యతిరేక జాతుల విముక్తి పోరాటాల రూపంలో వుంటుందని, ఇంకా కుల నిర్మూలనా పోరాటం, స్త్రీ విముక్తి పోరాటాలు కూడా విప్లవానికి ఎంతో ప్రాధాన్యత కలిగిన పోరాటాలని పేర్కొంది. ఎర్ర విప్లవానికి ప్రతిగా పచ్చ విప్లవం (గ్రీన్ రివల్యూషన్) సాగుతోందని, దీని ఫలితంగా దేశంలోని అనేక ప్రాంతాలలో అర్ధభూస్వామ్య సంబంధాలు క్షీణిస్తూ, ఒక ప్రత్యేక తరహా పెట్టుబడిదారీ సంబంధాలు రూపొందుతున్నాయని సి.ఆర్.సి. విశ్లేషించింది. అప్పటికే సాంప్రదాయక ఎమ్.ఎల్. అవగాహన పట్ల అసంతృప్తితో వున్న మోహన్ సి.ఆర్.సి. నూతన పంథాని ఆమోదించాడు.

ఇంతే కాకుండా కె. వేణు నాయకత్వంలోని సి.ఆర్.సి.కి ఇంకా అనేక

విశిష్టతలున్నాయి. 1976 సెప్టెంబరులో మావో కన్ను మూసాక, చైనాలో రివిజనిస్టులు అధికారంలోకి వచ్చి సాంస్కృతిక విప్లవాన్ని ముగించి, పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించారు. భారతదేశంలో దాదాపు అన్ని ఎమ్.ఎల్. పార్టీలు ఈ పరిణామాన్ని వెంటనే అర్థం చేసుకోలేక గందరగోళానికి గురయ్యాయి. చాలాకాలం పాటు చైనాను సోషలిస్టు దేశంగా భావిస్తూ, అక్కడ అధికారాన్ని కైవసం చేసుకున్న పెట్టుబడిదారీ మార్గీయులను సమర్థిస్తూ వచ్చాయి. చైనా నూతన పాలకులు, మావో రూపొందించాడంటూ మూడు ప్రపంచాల విభజన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువస్తే దాన్ని కూడా సమర్థించి, ఆ సిద్ధాంతానికి అనుగుణంగా ఎత్తుగడలను రూపొందించుకోవటం ప్రారంభించాయి. దీనికి భిన్నంగా సి.ఆర్.సి. చైనా ఇంకెంత మాత్రం సోషలిస్టు దేశం కాదని, మూడు ప్రపంచాల విభజన సిద్ధాంతం, వర్గ సామరస్య, విప్లవ ప్రతీఘాతక సిద్ధాంతమని, మావో పేరుతో చైనా రివిజనిస్టులే ఈ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారని విస్పష్టంగా ప్రకటించింది. అతేకాకుండా తనలాంటి వైఖరే తీసుకున్న రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ, అమెరికా, పెరూ కమ్యూనిస్టు పార్టీ తదితర పార్టీలతో కలిసి ఒక అంతర్జాతీయ కమ్యూనిస్టు నిర్మాణాన్ని– విప్లవ అంతర్జాతీయతా ఉద్యమం (ఆర్.ఐ.ఎమ్) – స్థాపించింది. మావో ఆలోచనా విధానం స్థానంలో మావోయిజాన్ని తన ప్రాపంచిక దృక్పథంగా ప్రకటించిన భారతదేశంలోని మొదటి విప్లవ పార్టీ కూడా సి.ఆర్.సి.నే. ఇదంతా సహజంగానే మోహన్‌కి ఎంతో ఉత్తేజాన్ని కల్గించింది.

జె.ఎన్.యు.లో ఎమ్.ఫిల్ థీసిస్ పూర్తి చేసాడో లేదో తెలియదు కాని, మోహన్ పూర్తికాలం విప్లవ కార్యకర్తగా ఆంధ్రాకు తిరిగి వచ్చాడు. జె.ఎన్.యు. లో తన సహాధ్యాయి, సన్నిహిత మిత్రుడు, నాగార్జునా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర అధ్యాపకుడూ అయిన సుబ్రమణ్యం క్వార్టర్స్‌లో వుంటూ తన కృషి ప్రారంభించాడు. కొన్నాళ్ళు అధ్యయనం మీద కేంద్రీకరించి కొన్ని అవగాహనా పత్రాలను రూపొందించాడు. తర్వాత అనంతపురం జిల్లాలోని కదిరి ప్రాంతానికి వెళ్ళి అక్కడ సి.ఆర్.సి. నాయకత్వంలో విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేశాడు.

మోహన్, నాగార్జునా యూనివర్శిటీలో వున్న కాలంలోనే దళిత ఎన్.ఎమ్.ఆర్. కార్మికులను సమీకరించి విశ్వవిద్యాలయ యాజమాన్యం ప్రదర్శించిన కుల వివక్షకు వ్యతిరేకంగా మిలిటెంట్ దళిత పోరాటాన్ని నిర్మించాడు. ఈ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న సుబ్రమణ్యాన్ని విశ్వవిద్యాలయ యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఈ సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా అనేక నెలలపాటు ఉద్యమం సాగింది. గుంటూరు జిల్లాలోనే కాకుండా, కోస్తాంధ్రలోని అనేక జిల్లాల్లో ఈ ఉద్యమం ప్రభావాన్ని పడేసింది. కారంచేడు హత్యాకాండ తర్వాత కోస్తాంధ్ర ప్రాంతంలో ప్రారంభమైన నూతన దళిత చైతన్యం, దళిత ఆత్మగౌరవ ఉద్యమంలో ఇది ఒక భాగం. ఈ ఉద్యమ క్రమంలోనే మోహన్, కులనిర్మూలనా జాతివిముక్తి పోరాటం అనే అవగాహనను అభివృద్ధి చేసాడు.

తర్వాతకాలంలో మోహన్ కదిరి గ్రామీణ ప్రాంతంలో పూర్తికాలం వుంటూ తదేకదీక్షతో విప్లవోద్యమాన్ని నిర్మించటానికి కృషి చేసాడు. తన వర్గాన్ని, కులాన్నీ వదులుకుని పీడితవర్గంతో, అణగారిన కులాలతో పూర్తిగా మమేకమయ్యాడు. దళిత కులానికి చెందిన గ్రామీణ శ్రామిక మహిళను పెళ్ళి చేసుకున్నాడు. ఆమె(శశి) కూడ కదిరి గ్రామీణ ప్రాంతంలో, ఉద్యమంలో పనిచేసింది. ఒకవైపు రహస్య విప్లవపార్టీని నిర్మిస్తూనే తెలుగుదండు, రైతుకూలీదండు వంటి బహిరంగ విప్లవప్రజాసంఘాలను నిర్మించటానికి నాయకత్వం వహించాడు. ఆ ప్రాంతంలోని అర్థ భూస్వామ్య సంబంధాలను నాశనంచేస్తూ, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతి చైతన్యాన్ని రేకెత్తించటానికి కృషి జరిగింది. కొద్ది కాలంలోనే ఈకృషి ఫలించి కదిరి ప్రాంతంలో ఉద్యమం అభివృద్ధి చెందింది. అనేకమంది యువకులు పూర్తికాలం కార్యకర్తలుగా పనిచేయటానికి ముందుకొచ్చారు. ఆసమయంలోనే కదిరిలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, రైతాంగ సమస్యలను ఫోకస్ చేస్తూ రైతు కూలీదండు జరిపిన బహిరంగసభకు దాదాపు 10వేలమంది ప్రజలు హాజరయ్యారు.

అయితే ఈ పురోగమనం ఎక్కువకాలం సాగలేదు. మోహన్ నాయకత్వంలో జరిగిన అనేక పొరపాట్లు దీనికి కారణం. ముఖ్యంగా మోహన్ పనివిధానంలోని

అతివాదం, అతని దుందుడుకు తత్త్వం ఉద్యమాన్ని దెబ్బతీసాయి. అదే సమయంలో సి.ఆర్.సి. అఖిలభారత నాయకత్వంలో తలెత్తిన భిన్నాభిప్రాయాలు, చీలికలు, ముఖ్యంగా సి.ఆర్.సి.ని రద్దు చేసి ఏజాతికాజాతి పార్టీని ఏర్పరచాలనే నిర్ణయం ఆపార్టీని కోలుకోలేని దెబ్బతీసాయి. ఆంధ్రాతో సహా అన్ని రాష్ట్రాలలోను ఆ పార్టీ క్షీణించింది. ఈ నేపథ్యంలో మోహన్, పార్టీనుండి వైదొలగి సాధారణ జీవితం గడపాలనే బాధాకరమైన నిర్ణయం తీసుకున్నాడు. దీనితో మోహన్ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ముగ్గురు సభ్యుల కుటుంబం (మోహన్, శశి, చుక్క. బంధు తర్వాత వచ్చింది) గడవటమే కష్టమైంది. దీనితో జీవితంలో ఎన్నడూ ఉద్యోగం చేయాలనే ఆలోచన కూడా చేయని మోహన్ అనేక ఉద్యోగాలు చేయాల్సి వచ్చింది. అందులో ఒకటి పరిశోధక విద్యార్థులకు థీసిస్‌లు రాసిపెట్టటం. చివరకు మోహన్ 'స్వచ్ఛంద సంస్థల్లో' పనిచేయాలనే నిర్ణయానికి వచ్చాడు. అయితే కథ ఇక్కడితో ముగియలేదు.

'స్వచ్ఛంద సంస్థ'ల్లో కూడా మోహన్ తనదైన శైలిలో పనిచేసాడు. అవినీతి సంపాదనకు అనేక అవకాశాలున్నప్పటికీ, తాను జీతం మాత్రమే తీసుకునేవాడు. తిరుగుబాటు తత్త్వాన్నీ, ప్రజలకోసం తపనచెందటాన్ని, వారికోసం పనిచేయటాన్ని ఎన్నడూ వదులుకోలేదు. ఎన్.జి.వో.ల్లో అతను చేసిన ప్రాజెక్టులు కూడా గ్రామీణ రైతాంగానికీ, వ్యవసాయానికీ, పర్యావరణానికీ సంబంధించినవే. ప్రకృతి, పర్యావరణం, వ్యవసాయం–ఈ రంగాల్లో అనేక కొత్త ఆలోచనలు చేస్తూ, ప్రయోగాలు చేస్తూ వచ్చాడు. కరువు ప్రాంతాల్లో నీటిసంరక్షణకి, వ్యవసాయ పద్ధతుల్లో మార్పుల గురించీ పరిశోధనలు చేసాడు. ఈ క్రమంలోనే ప్రభుత్వాలు అమలుచేస్తున్న విధానాలని, పథకాలనీ విమర్శిస్తూ వచ్చాడు. తెలంగాణాలో కె.సి.ఆర్. ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుని తీవ్రంగా వ్యతిరేకించటమే కాక కార్యాచరణకు కూడా సిద్ధపడ్డాడు. కొద్దినెలల క్రితం ఆ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన సభలో చురుగ్గా పాల్గొన్నాడు. దేశంలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసానికి వ్యతిరేకంగా ఒక సమిష్టి కార్యాచరణకు కృషిచేస్తున్న సమయంలోనే అతను కన్నుమూసాడు.

బయటకు వెళ్ళాక కూడ విప్లవోద్యమం గురించి అతను తీవ్రంగా పట్టించుకున్నాడు. అర్ధ భూస్వామ్య అవగాహన మీద తన విమర్శను కొనసాగించాడు. దేశంలోను, అంతర్జాతీయంగాను వస్తున్న పరిణామాలన్నిటినీ, అదేవిధంగా ఆర్థిక వ్యవస్థల్లో వస్తున్న మార్పుల్నీ, సంక్షోభాల్నీ అతను నిశితంగా పరిశీలిస్తూ వచ్చాడు. తన మిత్రులతో అభిప్రాయాలు పంచుకుంటూ వచ్చాడు. నిజానికి అతను కన్నుమూసేవరకు కూడ విప్లవోద్యమ సహప్రయాణీకుడిగా కొనసాగాడు. తన తొలి యవ్వన ప్రాయంలో తానెంతో గాఢంగా హత్తుకున్న తాత్త్విక దృక్పథాన్ని అతను ఎన్నడూ విడిచిపెట్టలేదు. 3 సం॥ల క్రితం విజయవాడలో ఉత్పత్తి విధానాలమీద జరిగిన సెమినార్‌లో మాట్లాడుతూ ఉత్పత్తి విధానాలను అర్థం చేసుకోవటానికి మార్క్సిస్టు మెథడాలజీ మీద ఆధారపడాలని చెప్పాడు. అదే విజయవాడలో కామ్రేడ్ రవూఫ్ సంస్మరణ సభలో మాట్లాడుతూ, తొనొక కమ్యూనిస్టు కార్యకర్త అన్నట్లుగా రవూఫ్ పొరపాట్లను విమర్శిస్తూ మాట్లాడాడు.

మోహన్ ఒక తిరుగుబాటుదారుడు. "తిరగబడటమే న్యాయం" అన్న మావో సూక్తిని జీవితమంతా పాటించాడు. 'స్వార్థమే రివిజనిజం' అన్న శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవ నినాదాన్ని ఆవాహన చేసుకున్నాడు. వర్గశత్రువును ఎంత తీవ్రంగా ద్వేషించాలో, ప్రజలను ఎంత గాఢంగా ప్రేమించాలో స్వయంగా ఆచరించి చూపాడు. విప్లవాన్ని, సామాజిక మార్పునీ కోరుకునే వారందరికీ అతను స్ఫూర్తి. అతని అమర స్మృతికి జోహార్.

– మోహన్‌రెడ్డి మిత్రులు

ఆగస్టు 2017

మోహన్‌రెడ్డి స్మృతిలో

- సన్నీ

మోహన్ వెళ్ళిపోయాడన్న విషయం, చాలాకాలం క్రితమే, నా కొడుకు ద్వారా తెలుసుకున్నాను. జైలు అధికారుల నుండి అనుమతి తీసుకొని (జైలు నిబంధనలలో అటువంటి ఆంక్ష ఏదీ లేనప్పటికీ, సన్నిహిత కుటుంబసభ్యులకు మినహా వేరెవరికీ మే రాయకూడదని కఠినమైన నిషేధం వుండేది) శశి, చుక్క, బంధులకు ఒక లేఖ రాసి నా కొడుకుకి రాసిన ఉత్తరంతోపాటు దాన్ని పంపించాను. అతని కెప్పుడూ అది అందలేదని నాకు తర్వాత తెలిసింది.

1986లో (లేదా 1985 కావచ్చు) జె.ఎన్.యు.లో ఒక కామ్రేడ్ ద్వారా మోహన్‌తో నాకు పరిచయం కలిగింది. వెంటనే నన్ను ఆకట్టుకున్నది ఏమంటే ఎంతో విమర్శనాత్మకంగా ఆలోచించే అతని మెదడు, అతని వాదనా స్వభావం. వీటిని నేను చాలా ఇష్టపడ్డాను. మాకు ఆతిథ్యం ఇచ్చిన సుబ్రమణ్యం ఆందోళన పడేవిధంగా మేమిద్దరం గంటల తరబడి, ఒకోసారి చాలా పెద్ద గొంతుతో వాదించుకునేవాళ్ళం. మోహన్ చాలా తీవ్రంగా వాదించేవాడు, అయితే చివరకు తనకు ఆమోదమైతే అంగీకరించేవాడుకూడా. అయితే దీన్ని సాధించటం అంత తేలిక కాదు. ప్రజల మధ్య దీనికి పూర్తి భిన్నంగా వుండేవాడు. చాలా శ్రద్ధగా వినేవాడు, ఎల్లప్పుడూ వాళ్ళతో మమేకమయ్యేవాడు. ఎంతో సంక్లిష్టమైన మార్క్సిస్టు తాత్విక భావనలను, రాజకీయాలను ఛేదించి, అందరికీ తేలిగ్గా అర్థమయ్యేలా సాదా సీదా తెలుగులో చెప్పేవాడు. అతను సమర్థుడైన, ఉత్తేజపరిచే, ప్రేరణనిచ్చే వ్యక్తి. ఇంకో మోహన్ వున్నాడు, కారుణ్యమూర్తి, సంరక్షకుడు. నాకు ఆపరేషన్

జరిగాక అతనితో వున్నప్పుడు అతను, అతని కుటుంబం నన్ను చాలా శ్రద్ధగా చూసుకుంది.

ఆనాటి సి.ఆర్.సి., సి.పి.ఐ (ఎమ్.ఎల్) అభివృద్ధి చేసిన నయావలస, జాతుల విప్లవాల నమూనాకి వ్యతిరేకంగా నేను మారినందుకు, మోహన్ చాలా తీవ్రంగా విమర్శించాడు. ఆత్మహత్యా సదృశ్యమైన / వినాశకరమైన పిడివాద తిరోగమనంగా మోహన్, దీన్ని వర్ణించాడు. నేను తీసుకున్న సైద్ధాంతిక, రాజకీయ దిశను మోహన్ తప్పనిసరిగా వ్యతిరేకిస్తాడు. అయినప్పటికీ, అది బ్యారికేడ్లకు ఇటువైపున, ఎల్లప్పుడూ విప్లవం కోసం, ప్రజలతో కలిసి నిలబడిన వ్యతిరేకత . అతన్ని నేను కోల్పోయాను.

* * *

(సన్నీ, కేరళకు చెందిన మావోయిస్టు నాయకుడు. మోహన్‌రెడ్డికి స్నేహితుడు, కామ్రేడ్ మోహన్ సి.ఆర్.సి.లో పనిచేసినపుడు, సన్నీ ఆయన నాయకుడు. దాదాపు 9 ఏళ్ళక్రితం సన్నీ హైదరాబాద్‌లో గుండె ఆపరేషన్ చేయించుకున్నప్పుడు, మోహన్ ఆయనకి తన ఇంట్లో ఆశ్రయమిచ్చి శ్రద్ధగా చూసుకున్నాడు. మోహన్ రెడ్డి కన్నుమూసినపుడు సన్నీ పూనెలోని ఎరవాడ జైలులో బందీగా వున్నాడు. జూలై 23న ఆయన కండిషన్ బెయిల్ మీద విడుదలైనపుడు ఈ స్మృతి సంకలనం గురించి ఆయనకు వివరించగా, వెంటనే ఈ చిన్న రచన పంపించారు.)

సిద్ధాంతం, ఆచరణ కలగలిసిన మోహన్‌రెడ్డి

- ఎ. సుబ్రహ్మణ్యం

మోహన్‌రెడ్డిని ఒకసారి కలిసినా, మాట్లాడినా అతన్ని మర్చిపోవటం కష్టం. ఎవరయినా ఇద్దరు కలిసినప్పుడు మోహన్‌రెడ్డి పేరు ప్రస్తావన వస్తే వెంటనే వారిలో ఓ చిరునవ్వు వస్తుంది. అతన్ని మెచ్చుకుంటూ లేదా అతను చెప్పేమాటల్ని జ్ఞప్తి చేసుకుంటూ మినహా మోహన్‌రెడ్డి గురించి మరోవిధంగా ఎవరయినా మాట్లాడటం నేను ఇంతవరకు చూడలేదు. మోహన్‌రెడ్డి గురించి చెడుగా మాట్లాడినవారు నాకు తెలిసి ఎవరూలేరు. అతని సిద్ధాంతాలతో ఏకీభావం లేనివారు కూడా సిద్ధాంతాల్ని గురించి మాట్లాడుతారే కానీ ఆ సిద్ధాంతాలపట్ల మోహన్‌రెడ్డి అంకితభావం గురించి ఇంతవరకు ఎవరూ విమర్శించిన వాళ్ళు లేరు.

నాకు మోహన్‌రెడ్డితో ఉన్న సుదీర్ఘ సాన్నిహిత్యంతో అతని వ్యక్తిత్వం గురించి చెప్పమంటే, “మోహన్‌రెడ్డి లేశమంతయినా స్వార్థం లేని ఆచరణాత్మకవ్యక్తి” అని అంటాను. సిద్ధాంతాల అధ్యయనం, నూతన ఆలోచనల్ని రూపొందించటంలో మోహన్‌రెడ్డి దిట్ట. సిద్ధాంతం వేరే ఆచరణ వేరే అనే చందంలో అన్ని రాజకీయాలు నడిచే రోజుల్లో ‘సిద్ధాంతమే ఆచరణ, ఆచరణే సిద్ధాంతం’ అనే సూక్తి మూర్తీభవించిన వ్యక్తి మోహన్‌రెడ్డి. ముఖ్యంగా వ్యక్తిగత ఆచరణకొస్తే మహా మహా నాయకుల్లో కూడా వ్యక్తిగత జీవితంలో సైద్ధాంతిక ఆనవాళ్ళు కనపడవు. మోహన్‌రెడ్డి విషయంలో మాత్రం అతని నడవడిక మొత్తం మూర్తీభవించిన సిద్ధాంతమే. వేషధారణ మొదలుకొని ప్రతిచిన్న విషయంలో మావోయిస్టు అంటే మోహన్‌రెడ్డిలాగ ఉంటారు అని అనుకోవాలి. మాలపల్లి, మాదిగపల్లిలో జనం

కొంతకాలం సంబంధాల తర్వాత మోహన్‌రెడ్డిని తమ మనిషిగా సొంతం చేసుకోవటం , పూర్తిగా సమానంగా చూడటం, అరమరికలు లేకుండా మనసు పంచుకోటం నేను చూశాను దళిత ఉద్యమంలో నూతన పోకడ తేవటం మోహన్‌రెడ్డికే సాధ్యమయింది. పేరులో రెడ్డిని తొలగించటం లాంటి మొక్కుబడి, షో పనులు చేయకున్నా అతను రెడ్డి కులస్తుడని ఎవరికీ గుర్తురారు. పచ్చికులవాది కూడ మోహన్‌రెడ్డిని 'రెడ్డి' కులస్తుడని చూడటం సాధ్యంకాని స్పెషల్ క్యారక్టర్ మోహన్‌రెడ్డి.

పరిచయం : మావోయిస్టు ఆలోచనలకు ఎందర్నో పరిచయం చేసింది మోహన్‌రెడ్డే. అది జవహర్‌లాల్‌నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీలో 1979 – 80 ల కాలం. సన్నగా, కాస్త పొట్టిగా నిత్యం లుంగీతో, చేతిలో గణేష్ బీడీలతో ఉండే మోహన్‌రెడ్డి జె.ఎన్.యులో ఒక కేంద్రం లాగా ఉండేవాడు. అయస్కాంతానికి ఆకర్షించబడ్డట్లుగా అందరూ ఆయన చుట్టూ తిరిగేవారు. అలసట లేకుండా నిత్యం పెద్దగొంతుతో మార్క్సిజం, మావోయిజం, ప్రస్తుత రాజకీయాల గురించి మోహన్‌రెడ్డి చెప్తుంటే నిద్రాహారాలు గుర్తువచ్చేవికావు. దాదాపు ఓ 20 మంది ఎప్పుడూ అతను చెప్పేది చెవులు రిక్కించుకొని వినేవాళ్ళం. మోహనరావు, విద్యాసాగర్, చంద్రమౌళి, రాధాకృష్ణారెడ్డి, నాయుడు, భాగ్యారావు, లక్ష్మణరావు, ఇద్దరు బీహార్ విద్యార్థులు, ఒక బెంగాలీ విద్యార్థి, నేను ఇలా కొంతమంది ఎప్పుడూ మోహన్‌రెడ్డిని అంటిపెట్టుకొని ఉండేవాళ్ళం. అప్పట్లో జె.యన్.యూలో యస్.యఫ్.ఐ ప్రభంజనం ఉండేది. వివిధ మావోయిస్టు గ్రూపులకు చెందినవారు అందరూ కలిసి ఓ 40 మంది ఉండేవాళ్ళు. పీపుల్స్‌వార్, చంద్ర పుల్లారెడ్డి, వినోద్‌మిశ్రా, పార్టీయూనిటి, జనశక్తి ఇలా ఒక్క గ్రూపుకు చెందిన ఒకరు, ఇద్దరూ ఉండేవారు. నేను, రాధాక్రిష్ణారెడ్డి, లక్ష్మణరావు మరికొందరికి మార్క్సిజం పరిచయమే మొదటిసారి మోహన్‌రెడ్డి ద్వారానే. మోహన్‌రెడ్డి, పుల్లారెడ్డి గ్రూపు. మేమందరం మోహన్‌రెడ్డి ప్రభావానికి ఎంతగా లోనయ్యామంటే అందరం కలిసి గ్రూపు విభేధాలు పక్కనబెట్టి పి.యస్.ఎఫ్. అనే ఓ కొత్త వేదిక ఏర్పాటు చేసుకున్నాం. ఈ వేదికతో అంత బలంగా ఉండే ఎస్.ఎఫ్.ఐను ఆత్మ రక్షణలో

పడవేయ గల్గాం. సైద్ధాంతికంగా మావోయిజమే, నిజమయిన మార్క్సిజం అని అందర్నీ ప్రభావితం చేయగల్గాం. ఎన్నికల్లో కూడా పోటీ ఇవ్వగల్గాం. నిజమయిన మార్క్సిజం అంటే పి.యస్.ఎఫ్. ఆచరణే అని ఎంత వరకు విశ్వాసం పొందగల్గామంటే ఒకరిద్దరు కాంగ్రెస్‌వాళ్ళు మార్క్సిజానికి సంబంధించి, లెనిన్ గురించి సందేహాలు తెలుసుకునేందుకు మోహన్‌రెడ్డిని అడిగిన సందర్భాలున్నాయి. ఆ సందర్భాల్లో వాళ్ళు ఎస్.ఎఫ్.ఐ వారు చెప్పేది నిజం కాదు మీరు చెప్పేదే నిజం అని అభిప్రాయం చెప్పారు. సిద్ధాంతం, ఆచరణ గాఢత మోహన్‌రెడ్డిలో ఎంత ఉండేదంటే విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులవల్ల మెస్ ఛార్జీలు చెల్లించనందుకు హాస్పటిల్ గదులు తాళం వేసినపుడు వి.సి.వద్దకు వెళ్ళి నిరసన తెలియజేసే ఉద్యమం చేయటం జరిగింది. 'పేదవాళ్ళకు ఉన్నత విద్య చదువుకునే హక్కులేదు' అని పార్లమెంటు వద్దకు వెళ్తామనే నినాదం మోహన్‌రెడ్డి సూచించాడు. దాంతో విశ్వవిద్యాలయ అధికారులు దిగివచ్చి హాస్టల్ గదులు తెరిచారు. ఢిల్లీలో ట్రేడ్ యూనియన్ కార్యక్రమాల్లో కూడ మేమందరం మెహన్‌రెడ్డి నాయకత్వంలో పాల్గొన్నాం. 1980 లలో సోవియట్ యూనియన్ ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమణ చేసినపుడు సోవియట్ దౌత్య కార్యాలయం వద్ద పెద్ద నిరసనలో పాల్గొన్నాం. ఢిల్లీలో (పుల్లారెడ్డి గ్రూపు)కి చెందిన డాక్టర్ విమల్‌అటల్‌తో కలిసి మోహన్‌రెడ్డి ఈ నిరసన ఉద్యమం, ఇతర ట్రేడ్ యూనియన్ కార్యక్రమాలు చేసేవాడు. ఈ చర్చలు కార్యక్రమాలు అన్నీ పూర్వాంచల్ హాస్టల్ కేంద్రంగా జరిగేవి. పూర్వాంచల్ హాస్టల్‌ల్లో ఎక్కువమంది తెలుగు వాళ్ళం ఉండే వాళ్ళం. దాదాపు అందరూ మోహన్‌రెడ్డిని అంగీకరించే వాళ్ళే. అతను గంటల తరబడి మమ్మల్ని ఎడ్యుకేట్ చేస్తూంటే చెవులు రిక్కించుకొని వినే వాళ్ళం. మోహన్‌రెడ్డి నుంచి తెలుసుకున్న విశ్లేషణతో ఎస్.ఎఫ్.ఐ. ఇతరులను ఢీకొట్టి వాదించేవాళ్ళం. నేను, రాధాక్రిష్ణారెడ్డి, మోహన్‌రెడ్డితో ఎంతగా ప్రభావిత మయ్యామంటే మేము జె.యన్.యు. వెళ్ళటంలో మా ఉద్దేశ్యాలను వదిలేసి, మార్క్సిజంతో మమేకమయ్యాం. నేనయితే సివిల్ సర్వీసెస్ లేదా నా చదువు అయిన ఇంటర్నేషనల్‌లా సంబందించి విదేశాల్లో ఉద్యోగం సంపాయించటం అనే ఉద్దేశ్యాలతో జె.యన్.యులో చేరాను. మొదటి

సెమిస్టర్ మాత్రమే నా ఉద్దేశ్యాలకనుగుణంగా డిపార్టుమెంట్‌కు, లైబ్రరీలకు వెళ్ళాను. పరీక్షలు కూడా రాశాను. ఇక రెండో సెమిస్టర్ నుంచి డిపార్ట్‌మెంట్ మొహం చూడలేదు. రాత్రింబవళ్ళు మోహన్‌రెడ్డితో చర్చలు కార్యక్రమాలు అంతే. ఆ రోజుల్లో ఆంధ్రాలో వివిధగ్రూపులకు చెందిన మావోయిస్టు ఉద్యమాలు బాగా ఊపుగా ఉండేవి. కరీంనగర్, సిరిసిల్లా, అదిలాబాద్ రైతాంగ ఉద్యమాలు, పీపుల్స్‌వార్ వాళ్ళ సంచలన సంఘటనలు ఓ వైపు మరోవైపు కన్న బిరన్, బాలగోపాల్, వరవరరావు, గద్దర్ గార్ల ప్రభావం రాష్ట్రంలో ఊపుగా ఉన్నరోజులు అవి. ఆ నేపద్యంలో ఇక ఆంధ్ర వచ్చేసి ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనాలనే అభిప్రాయానికి వచ్చా. జె.యన్.యూలో కూడ ఫీజులు, మెస్ బిల్లులు కట్టకుండా డిపార్ట్‌మెంట్ మొహం చూడ కుండా కొనసాగటం వీలుగాని పరిస్థితులు వచ్చాయి. ఆ సమయంలో 1980 చివరి రోజుల్లో ఇలా విద్యార్థుల పేరుతో పూర్తిగా ఉద్యమాలు చేస్తున్న మా అందరిపై వేటు పడింది. అధికారులు కాస్త తీవ్ర చర్యలు తీసుకున్నారు. మోహన్‌రెడ్డి హాస్టల్ బహిష్కరణకు గురయ్యాడు. నేను, రాధాకృష్ణారెడ్డి ఆంధ్రా వచ్చేశాం. జె.యన్.యూలో ఉన్న రోజుల్లోనే, సివిల్ సర్వీసెస్‌లు, విదేశాలు కాకుండా యూనివర్సిటి ఉపాధ్యాయ వృత్తి చేపట్టి, బాలగోపాల్ వరవరరావు గార్లలాగ లీగల్ ఉద్యమాల్లో ఉండాలని మోహన్‌రెడ్డి సూచించిన విధానం మేము ఎన్నుకున్నాం. నేను నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడ్ని అయ్యాను. రాధాకృష్ణారెడ్డి, లక్ష్మణరావు ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయులయ్యారు. బహిష్కరణకు గురయిన మెహన్‌రెడ్డి కొంతకాలం, ఢిల్లీ యూనివర్సిటీలో కొంతకాలం. ఐ.ఐ.టి.లో తలదాచు కున్నాడు. 1982 వరకు ఢిల్లీలోనే ఉన్నాడు. అప్పటికే లెక్చరర్‌గా ఉన్న నేను మోహన్‌రెడ్డికి డబ్బు కాస్త పంపేవాడిని.

గుంటూరు దళిత ఉద్యమం

1984 ప్రాంతంల్లో మెహన్‌రెడ్డి గుంటూరు నాగార్జున యూనివర్సిటిలో క్యాంపస్ క్వార్టర్స్‌లో నాతో వచ్చి ఉన్నాడు. ఇక అప్పట్నించి అతని అధ్యయనం తపస్సు లాగా జరిగింది. వందల పుస్తకాలు చదవటం వాటి గురించి చర్చించటం

చేసేవాడు. యూనివర్సిటీ క్వార్టర్సు ప్రాంతం ఆరోజుల్లో ఎటు చూసినా గడ్డి, మొక్కలు, పెద్దచెట్లు, పాములు, అడవి కుందేళ్ళు, అడవి పిచుకలు, వివిధ పక్షులతో అడవిని తలపించేది. రెండు సంవత్సరాలు మేమిద్దరం ఉండేవాళ్ళం. నిదానంగా మాకు తోడుగా శ్రీవత్స, కృపాకర్, మాతో కలిశారు. మోహన్‌రెడ్డి అధ్యయనంలో పుస్తకాలు మాత్రమే కాదు. రాష్ట్రంలో ఉద్యమకారులు, పాత నాయకులు అందర్ని కలిసి వివరాలు సేకరించటం జరిగేవి. సి.వి.గారు, మొదలుకొని మండే పిచ్చయ్యగారి వరకు అందర్ని కలిసి ఇంతవరకు కమ్యూనిస్టు ఉద్యమ తీరుతెన్నుల గురించి వారి అభిప్రాయాలు, వివరాలు సేకరించాడు. కొందరు క్వార్టర్సుకు వచ్చి మాతో మాట్లాడారు.

మోహన్‌రెడ్డి కలిసిన వారిలో, భూపతి నారాయణమూర్తిగారు, గురుకుల మిత్రాగారు, సి.వి.గారు, మండే పిచ్చయ్యగారు, కె.జి.సత్యమూర్తిగారు, ఇరగనబోయిన శ్రీనివాసరావుగారు, రవూఫ్‌గారు, వేణుగారు ఇలా ఎందరో ఉన్నారు. భారతదేశంలో సామ్రాజ్య వాద కనుసన్నల్లో పెట్టుబడిదారి విధానంపై నుంచి ఎలా తీసుకురాబడుతున్నదీ మోహన్‌రెడ్డి వివరించేవాడు. ముఖ్యంగా ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలో భూస్వామ్య సంబందాల్లో మార్పు ఎలా జరుగుతున్నదీ మెహన్‌రెడ్డి విపులంగా చెప్పేవాడు. ఆ రోజుల్లో ఇంటర్నెట్ లేదు అయినా మెహన్‌రెడ్డి ప్రపంచ బ్యాంకు డాక్యుమెంట్లు కష్టపడి సేకరించి చదివేవాడు అందుకోసం హైదరాబాదు ఎన్.ఐ.ఆర్.డి. లాంటి లైబ్రరీలకు వెళ్ళినట్లు నాకు తెలుసు. ఏదయినా ఒక అంశంపై వివరాలు అవసరమైతే అందుకు కావల్సిన పుస్తకం కోసం లేదా ఎవర్నయినా కలవటం కోసం ఎక్కడికైనా వెళ్ళేవాడు. ఓ సారి పొద్దున్నే లేచి ఈ రోజు మనం వేటపాలెం లైబ్రరీకి వెళ్ళాలి అని నన్ను దాదాపు లాక్కుని వెళ్ళాడు. అక్కడో పాతపుస్తకం తీసి నాటి ఉద్యమ వివరాలు నోట్సు తయారు చేసుకుని మధ్యాహ్న భోజనం కూడ లేకుండా రాత్రి క్వార్టర్సుకు చేరుకున్నాం.

పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం ఇక్కడ జాతుల్ని ఎలా నిర్వీర్యం చేసి భారత ఉపఖండాన్ని తన మార్కెట్‌గా ఎలా మలుచుకొని ప్రజల్ని దోపిడి

చేస్తుంది అని కళ్ళకు కట్టినట్లు వివరించేవాడు.

మెహన్‌రెడ్డి చెప్పేవిషయాలు అందర్నీ ఎంతగానో ఆకట్టుకునేవి. యూనివర్సిటీ విద్యార్థులు గంటల తరబడి మోహన్‌రెడ్డి చెప్పే సైద్ధాంతిక విషయాలు వినేవారు. అందుకోసం దూరంగా ఉండే హాస్టల్స్ నుంచి అదేపనిగా క్వార్టర్సుకు వచ్చి ఉండిపోయేవారు. కనీసం ఓ 20 మంది నిత్య అభిమానులు ఉండేవారు. నేనూ పౌరహక్కుల ఉద్యమకారుడు, చంద్రశేఖర్, మోహన్‌రెడ్డి సిద్ధాంతానికి ఎంతో ఆకర్షితులయ్యాం. చంద్రశేఖర్ ప్రపంచ బ్యాంకు మనల్ని ఎలా నిర్దేశిస్తుందో మోహన్‌రెడ్డి ప్రభావంతో అధ్యయినం చేశాడు. చంద్రశేఖర్ చనిపోయేవరకు ప్రపంచ బ్యాంకు కుట్రలను అధ్యయనం చేస్తూనే ఉన్నాడు. చట్టపరంగా సుప్రీంకోర్టు తీర్పులతో సహా ఎలా ప్రపంచ బ్యాంకు అనుగుణంగా ఉంటాయో చంద్రశేఖర్ లోతుగా అధ్యయనం చేసి చాలా వ్యాసాలు రాశాడు. ఎన్.జి.ఓ.ల మీద ఓ పుస్తకం కూడ రాశాడు. సామ్రాజ్యవాదం, ప్రపంచ బ్యాంకు నిర్దేశం గురించి చంద్రశేఖర్‌ను అంతగా ప్రభావితం చేసింది మోహన్‌రెడ్డే. ఇంకో ప్రముఖ వ్యక్తి నూర్ బాషా అబ్దుల్ యూనివర్సిటి కామర్స లెక్చరర్ (ఆనాడు) అయిన బాషా ఆర్థికశాస్త్రంలో నిష్ణాతుడు. అటువంటి నిష్ణాతుడే. మోహన్‌రెడ్డికి రాజకీయ ఆర్థిక శాస్త్రంలో ఉండే పట్టుకి నివ్వెరపోయాడు. అతనూ మోహన్‌రెడ్డి నిత్య అభిమానే. అప్పట్లో ప్రపంచస్థాయి ఆర్థిక శాస్త్రవేత్తలయిన సమీర్ అమీన్, గుండర్ ఫ్రాంక్‌ల రచనలను మోహన్‌రెడ్డి కాచివడబోశాడు. సామ్రాజ్యవాదం నేతృత్వంతో భారత, ఆర్థిక వ్యవస్థ లంపెన్ బూర్జువాతో కలిసి ఎలా 'Distorted Socio-economic formation' గా తయారయిందీ గణాంకాలు వివరాలతో మోహన్‌రెడ్డి ఏకధాటిగా చెప్తూంటే అందరూ నిశ్చేష్టులై వినాల్సిందే. ఎందరో సాధారణ విద్యార్థులు మోహన్‌రెడ్డి విశ్లేషణను ఒప్పుకోవటం ఒక ఎత్తయితే మరోవైపు రాడికల్ విద్యార్థులు, ఇతర గ్రూపులవారు మోహన్‌రెడ్డి చెప్పే అంశాలకు ప్రభావితమై వారి పార్టీలలో చర్చ లేవదీశారు. దీంతో అప్పటి పీపుల్స్ వారు వాళ్ళు 'మీరు మా క్యాడర్‌ను ప్రభావితం చేయటం సరికాదు' అని మాకు సంకేతాలు పంపారు. మేధోపరమైన చర్చలు, విద్యార్థులతో చర్చలు మాత్రమే కాదు. మరోవైపు

అట్టడుగు వర్గాల, కులాల వారితో మోహన్‌రెడ్డి పూర్తిగా మమేకమయ్యేవాడు. వారికి తన సిద్ధాంతం అర్థం చేయించ గల్గేవాడు. యూనివర్సిటిలో వాచ్‌మెన్‌లు తోటీలు అందరూ మా క్వార్టర్సులో మోహన్‌రెడ్డితో నాతో గంటలు తరబడి ఉండేవారు. మోహన్‌రెడ్డితో పూర్తి స్వతంత్ర్యంగా ఉండేవారు. యాకోబు, ఏసుదాసు, సాంబయ్య, ఏసయ్య, దేవదాసు, తోటి గురవయ్య, జయిరావ్, దయానందం ఇలా ఓ 30/40 మంది ప్రతిరోజు మోహన్‌రెడ్డితో కలిసి మాట్లాడేవారు. ఈ విధంగానే వారంతా సమీకరించబడి యూనివర్సిటీ ఉద్యమ కార్యకర్తలు, నాయకులు అయ్యారు.

యూనివర్సిటి ఉద్యమం : మోహన్‌రెడ్డి సిద్దాంతం ఆరోజుల్లో "సామ్రాజ్యవాద వ్యతిరేక తెలుగు జాతి ఉద్యమం. దళితుల నాయకత్వంలో కులనిర్మూలన, తెలుగుజాతి స్వాతంత్ర్యం" అని క్లుప్తంగా చెప్పవచ్చు. యూనివర్సిటిలో 20 సంవత్సరాలుగా ఎన్.ఎమ్.ఆర్‌లు గా పనిచేస్తున్నవారికి (వీరిలో 99 శాతం దళితులే) ఉద్యోగఖాళీలు వచ్చినపుడు సీనియారిటి ప్రకారం పర్మనెంట్ ఉద్యోగం వచ్చేది. కాని 1989లో ఓ ఉద్యోగ ఖాళీ ఏర్పడినపుడు ఎన్.ఎమ్.ఆర్ సీనియారిటీని ఉల్లంఘించి లిస్టులో అడుగున ఉన్న 99వ వ్యక్తి అయిన ఓ కమ్మకులస్తురాలికి ఇచ్చారు. అప్పటికే ఎన్.ఎమ్.ఆర్‌ల యూనియన్‌కు నేను నాయకుడుగా మెహన్‌రెడ్డి తెరవెనుక అసలు నాయకుడిగా ఉన్నాం. సీనియారిటిలో ఉద్యోగం నిరాకరించబడిన వాళ్ళందరూ దళితులే. ఎక్కువ మంది నంబూరు, కాజ, కంతేరు మాలపల్లి, మాదిగపల్లికి చెందినవారే! మోహనరెడ్డి దిశానిర్దేశంతో నా నాయకత్వంలో ఎన్.ఎమ్.ఆర్ లందరూ ఉవ్వెత్తున ఉద్యమించా. వైస్‌ఛాన్సలర్‌ను రాత్రి వరకు ఘెరావ్ చేశాం. రాత్రి 9.00 గంటకు పోలీసులు ఎన్.ఎమ్.ఆర్‌లను అరెస్టు చేసి వైస్ ఛాన్సలర్‌ను బైటికి తెచ్చారు. నాపై 30 మంది దళిత ఎన్.ఎమ్.ఆర్‌లపై పెదకాకాని పోలీసుస్టేషన్లో వివిధ సెక్షన్ల క్రింద కేసు నమోదయింది. నన్ను ఉద్యోగం నుంచి సస్పెండు చేశారు. ఉద్యమం తీవ్రతరం అయింది. నేను నిరాహార దీక్షకు కూర్చున్నాను. యూనివర్సిటీ ప్రాంతం అంతా 144 సెక్షన్ విధించారు. విద్యార్థులు, ఉద్యోగులు ప్రతిరోజు ఊరేగింపులు,

నినాదాలహోరుతో యూనివర్సిటి దద్దరిల్లింది. రాష్ట్రంలో అన్నియూనివర్సిటీల్లో నిరసన బంద్‌లు జరిగాయి. మోహన్‌రెడ్డి అప్పట్లో రాసిన పంచిన ఓ పెద్ద కరపత్రం సంచలనం సృష్టించింది. అందులో దళితుల నాయకత్వంలో కుల నిర్మూలన, జాతి విముక్తి ప్రధాన అంశాలుగా ఉన్నాయి. నాటి యూనివర్సిటి దళిత ఉద్యమం రాష్ట్రం మొత్తంలో సంచలనంగా జరిగింది. కత్తి పద్మారావు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనింది. యూనివర్సిటి ముట్టడికి పిలుపునిచ్చింది. బాలగోపాల్, ప్రొ॥హరగోపాల్, కన్నబిరన్, ప్రొ॥ నర్సింహారెడ్డి కంచెఐలయ్యలాటి ప్రముఖులతో యూనివర్శిటి పాలక వర్గానికి వ్యతిరేకంగా సభలు జరిగాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మార్క్సిస్టు లెనినిస్టు దృక్పథంతో దళిత సమస్యపై జరిగిన మొదటి నాంది ఉద్యమం అది. ఈ ఉద్యమం చాలా ప్రకంపనలు సృష్టిస్తున్నపుడు, బాగా ఊపందుకున్న తర్వాత, ఆనాటి పీపుల్స్‌వార్ పార్టీ కారంచేడు మారణకాండ మూలకారకుడైన దగ్గుబాటి చెంచురామయ్యను హతమార్చింది. అంటే మోహన్‌రెడ్డి నిర్మించిన దళిత ఉద్యమం పీపుల్స్‌వార్ పార్టీని ప్రభావితం చేసిందని చెప్పవచ్చు. ఆ తర్వాత పీపుల్స్‌వార్ ఆర్.వి.ఆర్. కళాశాలలో ఒక కులోన్మాదిని కూడ హత మార్చింది. ఆవిధంగా మార్క్సిస్టు లెనినిస్టు పార్టీవాళ్ళు కులసమస్యను తమ అజెండాతో చేర్చుకోటం మోహన్‌రెడ్డి ద్వారానే జరిగిందని నా అనుభవ పూర్వక అభిప్రాయం. ఈ ఉద్యమం మొత్తం మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే జరిగింది. విద్యార్థులు, దళితులు, మార్క్సిస్టు లెనినిస్టులే గాక ఇతర వ్యక్తుల్ని, శక్తుల్ని కూడ మోహన్‌రెడ్డి తన సైద్ధాంతిక బలంతో ఈ ఉద్యమంలో భాగస్వామ్యం చేయగల్గాడు. రోమన్ కేథలిక్ ఫాదర్లుగా ఉన్న అరుల్‌రాజా, సిస్టర్లుగా ఉన్న అల్ఫోన్సా తదితరుల్ని వారి అనుబంధ సంస్థల్ని ఉద్యమంలో భాగస్వామ్యం చేయగల్గాడు. వారందరూ నిత్యం యూనివర్సిటి క్వార్టర్సులో ఉండేవారు. ఇలా అనితర సాధ్యమైన ఉప్పెనలాంటి దళిత ఉద్యమాన్ని మార్క్సిస్టు, లెనినిస్టు దృక్పథంతో తొలిసారిగా నిర్మించిన ఘనత మోహన్‌రెడ్డికే దక్కుతుంది.

ఈ ఉద్యమం 1988 /1989లతో తీవ్రంగాను, ఆతర్వాత కాస్త

మామూలుగాను దాదాపు 1992 వరకు కొనసాగింది. 1991లో చుండూరు మారణకాండ జరిగినపుడు నేను చంద్రశేఖర్ పౌరహక్కుల కార్యకర్తలుగా చురుగ్గా ఉద్యమించాం. దళిత ఉద్యమ నేపద్యంలో యూనివర్సిటి విద్యార్థులు, ఉద్యోగులు కూడా చుండూరు మారణకాండ వ్యతిరేకంగా ఉద్యమంలో పాల్గొన్నారు.

వివాహం : 1988-89 ల దళిత ఉద్యమ, నేపద్యనంలోనే నేనూ, మోహన్‌రెడ్డి కొద్ది రోజుల వ్యవధిలో దళిత కులాలకు చెందిన జాని, శశికళలను వివాహాం చేసుకున్నాం. భూపతి నారాయణ మూర్తిగారు మా వివాహాలకు సంధాన కర్త. ఆరోజుల్లో యూనివర్సిటీ క్వార్టర్సులో భూపతిగారు ఇతరుల తెలుగుజాతి విముక్తి ఆలోచన కలవారు తరచుగా కలిసి మోహనరెడ్డి నాయకత్వంలో కార్యక్రమాలు, ప్రచురణలు వేసేవారం. అలా ఓ కలయిక జరిగినపుడు ఎవరికీ ఎటువంటి సమాచారం లేకుండా సమావేశం అనంతరం నాకు, జాన్సికి వివాహం జరిపించాడు. అది జనవరి 15, 1989. ఆరోజు అమావాస్య అని తర్వాత ఎవరో అన్నారు. వివాహం జరిగిందని తెలిసి పక్కనే క్వార్టర్సులో ఉన్న బాషా రోడ్డు అవతల నున్న ఫాదర్లు అరుల్ రాజా తదితరులు వచ్చారు. యూనివర్సిటి ఎన్.ఎమ్.ఆర్‌లు వచ్చారు. ఇలా పూర్తిగా మావోయిస్టు వివాహం మోహన్‌రెడ్డి కనుకే జరిపించాడు. తర్వాత మోహన్‌రెడ్డి కూడా అలానే వివాహం చేసుకున్నాడు. నాకు జనవరిలో వివాహం మార్చిలో సస్పెన్షన్ జరిగింది. జాన్సికూడ ఉద్యమంలో భాగస్వామి అయింది.

మోహన్‌రెడ్డి సాన్నిహిత్యంలో నిత్యం ఉద్యమాలు, సైద్ధాంతిక చర్చలు, సమావేశాలు, సభలు, అధ్యయనం ఇలా సాగింది అతని జీవితం, అతని సాన్నిహిత్యం వచ్చిన వారందరూ అతనిలో కలిసి ఉద్యమ భాగస్వాములయ్యారే.

కదిరి : యూనివర్సిటి ఉద్యమం జరుగుతున్న కాలంలోనే కేరళకు చెందిన సన్నీ, మోహనరెడ్డిల మధ్య సాన్నిహిత్యం వచ్చింది. ఆ తర్వాత కదిరిలో ఉద్యమం నిర్మించేందుకు మోహన్‌రెడ్డి అక్కడికి వెళ్ళాడు. గోపి, గిరి తదితరులతో కలిసి తెలుగుజాతి విముక్తి సిద్ధాంత ప్రాతిపదికన కదిరిలో బలమైన ఉద్యమం అత్యంత

తక్కువ సమయంలో నిర్మించాడు. మోహన్‌రెడ్డిలో కాస్త అతివాద పోకడలున్నాయనే చెప్పాలి. చాలాసార్లు మితవాద రివిజనిస్టు పోకడలను తీవ్రంగా ఖండించేవాడు. చారుమజుందార్‌ను ఎక్కువసార్లు కీర్తించేవాడు. "లక్ష కరపత్రాలు పంచటం కంటే ఒక బాంబు పేల్చటం ఎంతో ఉపయోగకరం" అని చారు మజుందార్ అన్నట్లు మాతో మెచ్చుకోలుగా అనేవాడు. పొద్దున్నే టిఫెన్‌చేసి ప్రెస్సులో కరపత్రాలు ముద్రించుకుని పంచే మావోయిస్టు పార్టీలను హేళన చేసేవాడు. పీపుల్స్‌వారు వాళ్ళు చేసే కిడ్నాప్‌లను దాడులను ప్రశంసించేవాడు.

కదిరిలో సరిగ్గా ఇలాటి తీవ్రవాద దృక్పథంతోనే ఉద్యమం నిర్మించాడు. అతి త్వరలోనే అక్కడి అట్టడుగు వర్గాలను, ముస్లింలను ఆకట్టుకున్నాడు. ఓవారి బహిరంగ సభపెడితే 30,000 మంది స్వచ్ఛందగా వచ్చారు. ఉద్యమ తీవ్రతలో భాగంగా ఓ పెద్ద భూస్వామిపై దాడిచేశారు. అతను తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఇంకో హత్యకూడ జరిగింది. వెంటనే పోలీసు నిర్బంధం, మోహన్‌రెడ్డి అండర్‌గ్రౌండ్ అనటం, కార్యకర్తలు ఓ 20 మంది అరెస్టు అన్ని చకచకా జరిగిపోయాయి. కస్టడీలో వున్న కార్యకర్తలు తప్పించుకు పారిపోయే పథకం అమలు జేశాడు. మోహన్‌రెడ్డిపార్టీ లీగల్ కార్యక్రమాలు చేసే ప్రభాకరరెడ్డి భూస్వాముల చేతిలో ప్రతీకారహత్యకు గురయ్యారు. మోహన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలు కస్టడీ నుంచి తప్పించుకున్న వాళ్ళు అండర్ గ్రౌండ్ అయ్యారు. మోహన్‌రెడ్డి కోసం పోలీసుల తీవ్ర గాలింపు జరుగుతోంది. అప్పట్లో వెంటనే దొరికితే మోహన్‌రెడ్డిని ఎన్‌కౌంటర్ చేసేవాళ్ళే. ఈ బీభత్స పరిణామాలతో కార్యకర్తలు చెల్లాచెదరయ్యారు. ఉద్యమం క్షీణించింది. మోహన్‌రెడ్డి హైదరాబాదుకు తరలివెళ్ళాడు. ఈ పరిణామాలతో తీవ్ర ఉద్యమ నిర్మాణ ప్రస్తానం ముగిసింది.

హైదరాబాద్‌లో మోహన్‌రెడ్డి :

కాలక్రమేణా నేనూ, మోహనరెడ్డి దూరమయ్యాం. కదిరి ఉద్యమ సమయంలో కూడ నేను తరచు కదిరి వెళ్ళాను. భూస్వామిపై దాడి నేపద్యంలో మోహన్‌రెడ్డి పార్టీకి మద్దతుగా నిజనిర్ధారణ కమిటిగా కూడా వెళ్ళాను. కాని

హైదరాబాద్‌లో మోహన్‌రెడ్డి చాలా వరకు రాత పనుల్లో నిమగ్నమయ్యాడు. ఆతర్వాత హరిత విప్లవం వల్ల జరిగిన పర్యావరణ విధ్వంసం ఇప్పుడు రైతులు వర్షపు నీటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలి లాంటి అంశాలపై పని చేశాడు. ఈ కాలం అంతా నాకు మోహన్‌రెడ్డికి అంత సాన్నిహిత్యంలేదు. అప్పుడప్పుడు అతను రాసిన వ్యాసాలు లాంటివి ఈ మెయిల్ చేసేవాడు. కానీ ఈ కాలంలో కూడ అత్యంత నిజాయితిగా, తీవ్రస్థాయిలో మహబూబ్ నగర్, నల్గొండ హిందూపురంలలో పని చేశాడని తెలిసింది. 'వాటర్ హార్వెస్టింగ్' ప్రాజెక్టు కూడా తీవ్రంగా అమలు జేశాడని తెలిసింది.

మోహనరెడ్డి రచనలు : మోహన్‌రెడ్డి పెద్దగా రచనలు చేయలేదనే చెప్పాలి. తపస్సులాగా చదివేవాడు. నిత్యం కరపత్రాలు వగైరా రాసేవాడు కానీ ఓ క్రమ పద్ధతిలో వ్యాసాలు, పుస్తకాలు రాయలేదు. తను ప్రతిపాదించిన సిద్ధాంతంపై 20/30 పేజీల రాతప్రతిలో డాక్యుమెంట్లు రాశాడు. అవి నావద్ద ఉండేవి, ఈ వ్యాసం రాసే సందర్భంగా ఎంత వెతికినా కనపడలేదు. తన సిద్ధాంత ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌లో ఓ సభ పెట్టాం. ఆ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై ఓ చిన్న పుస్తకం రాశాడు. 'సామ్రాజ్యవాదం : భారత సామ్రాజ్యం × సామంతులు అనే ఈ 48 పేజీల పుస్తకాన్ని తెలుగు మహాసభ పేరున ప్రచురించాము. ఇదొక కాపీ, నేటికీ నాదగ్గరుంది.

ఆ ముద్రిత వ్యాసాలు, నోటు, డాక్యుమెంట్లు ఎన్నో రాశాడు. పత్తిరైతుల ఆత్మహత్యలపై ఓ వ్యాసం రాశాడు. ఆరోజుల్లో పత్తి రైతుల ఆత్మహత్ల మొదలయినా వాటికి పెద్ద వార్తా గుర్తింపుగాని, చర్చగాని జరగలదు. ఆసమయంలో ఈ ఆత్మహత్యలు ఎందుకు, ఎలా జరుగుతున్నాయో మోహన్‌రెడ్డి నాకు, నూర్‌బాషా అబ్దుల్‌కు వివరించి మమల్ని నిజ నిర్ధారణ కమిటిగా వెళ్ళి అధ్యయనం చేయమని పురికొల్పాడు. మేమందరం ఇంకొల్లు తదితర ప్రాంతాల్లో జరిగిన పత్తిరైతుల ఆత్మహత్యలపై నిజ నిర్ధారణ చేసినపుడు అక్కడి పరిస్థితులు మోహన్‌రెడ్డి చెప్పినట్లుగానే ఉండటం అతని మేధాశక్తికి మేము ఆశ్చర్యచకితులమయ్యాం.

ఆ తర్వాత మేము ఇచ్చిన నిజనిర్ధారణ రిపోర్టు రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టించింది. నాటి ముఖ్యమంత్రి కూడ స్పందించి సాయం చెయ్యాల్సివచ్చింది. ఆ విధంగా పత్తి రైతుల ఆత్మహత్యలపై చర్చకు నాంది పలికింది మోహన్‌రెడ్డే. ఈ సందర్భంగా 'మాస్‌లైన్' పత్రికకు మోహన్‌రెడ్డి ఓ అద్భుతమైన వ్యాసం రాశాడు.

మోహన్‌రెడ్డి ఎంతో రాత పనిచేసినా పుస్తక, వ్యాసరచయితగా గుర్తింపు ఆశించలేదు. అందుకనే తన పేరుతో వ్యాసాలు ప్రచురించలేదనిపిస్తుంది. తెలుగు, ఇంగ్లీషు, బాషలపై మోహన్‌రెడ్డికి చాలా పట్టు ఉంది. అతని వేషం, మాటల సరళి బీడీలు తాగుతూ చర్చలు ఇవి చూసిన వాళ్ళకు ఇతనికి ఇంగ్లీషు వచ్చా అని అనుమానం రావచ్చు. కాని మోహన్‌రెడ్డి ఇంగ్లీషు చాలా అద్భుతంగా ఉంటుంది. అలవోకగా ఏకబిగిన హైక్లాస్ ఇంగ్లీషులో అతను రాయగలడు. క్వార్టర్సులో నా స్టూడెంట్ ఒకతను ఎల్.ఎల్.ఎమ్. డిసర్టేషన్ దిద్దించుకునేందుకు వచ్చేవాడు. అతను ఏమిరాయలేక నాపై ఆధారపడేవాడు. నాకు సమయం దొరక్క అతన్ని మళ్ళీ రమ్మనేవాడ్ని. ఓ రోజు మోహన్‌రెడ్డి అతని ఎల్.ఎల్.ఎమ్. డిసర్టేషన్ ఏకబిగిన ముఖ్యభాగం అంతా రాసిపెట్టాడు. అది లేబర్‌లాకు సంబందించినది. ఆ అంశంపై తాత్విక ఆలోచన, ప్రస్తుత విధానం లాంటి అంశాలపై మోహన్‌రెడ్డి రాశాడు. మిగతా కేసులు వగైరాలు అతను రాసుకున్నాడు. అతని డిసర్టేషన్ ముందుమాట, దృక్పథం, ఆ ఇంగ్లీషు సరళిచూసి అందరూ ఆశ్చర్యపోయారు. మోహన్‌రెడ్డి ఎమ్.ఎ. ఫిలాసఫీ చేశాడు. ఆరోజుల్లో కూడ వాళ్ళ ప్రొఫెసర్ సెలవుల్లో అందరూ ఏదయినా ఓ అంశంపై అసైన్‌మెంటు రాయాలని చెప్తే దాన్ని గురించి ఆలోచిస్తూ బస్సులో కోదాడ నుండి సూర్యాపేటకు వెళ్తూ ప్రజలు, సామాజిక సంబందాల గురించి మార్పు గమనం గురించి ఆలోచించి, My Journey from Kodada to Suryapeta అనే పేరున అసైన్‌మెంట్ రాసిచ్చాడు. ఇది నాకు మోహన్‌రెడ్డే చెప్పాడు.


సంసారం, మరణం :

ఆర్థిక కష్టాలు ఎన్ని ఉన్నా ఒక్కటి కూడ అనైతిక పని చేయకుండా సంసారాన్ని, ఈడ్చుకొచ్చాడు మోహన్‌రెడ్డి. ఇద్దరు కూతుళ్ళను స్వేచ్ఛగా, స్నేహితుడిలా పెంచాడు. వారిద్దరు కూడ సొంత నిర్ణయాలతో చదువు, వివాహం చేసుకునే వెసులుబాటు కల్పించాడు.

చివరిరోజుల్లో సిగరెట్లు మానేసినా అతని శరీర ధారుఢ్యం సరిగా లేనందువల్ల గుండె జబ్బు, ఆ తర్వాత హైపర్ టెన్షన్ వ్యాధుల బారినపడి అకాల మరణం చెందాడు. ఏదయినా చకచకా ఉన్నపళంగా జరగాలని ఉద్వేగంగా పని చేసే మోహన్‌రెడ్డి మరణంలో కూడా తొందరపడి మనల్ని వదిలివెళ్ళిపోయాడు.

* * *

(ప్రొఫెసర్ ఎ. సుబ్రహ్మణ్యం, నాగార్జునా యూనివర్సిటీలోని న్యాయశాస్త్రం విభాగం అధిపతిగా పనిచేసి రిటైర్ అయ్యారు. జె.ఎన్.యు. రోజులనుండి మోహన్‌రెడ్డికి మంచిస్నేహితుడు, కామ్రేడ్.)



మోహన్‌రెడ్డితో సుబ్రహ్మణ్యం

అరుదైన నేస్తం

– అబ్దుల్ నూర్ బాషా

ముప్పయ్ ఏళ్ళ స్నేహం, సాన్నిహిత్యానికి ఇంత అర్థాంతరంగా నిండు నూరేళ్ళు నిండి పోతాయని ఊహించనే లేదు. ఔను ఇది నమ్మలేని నిజమన్న వార్త విన్నప్పుడు నా కంటె ఎక్కువగా గుండెలు బాదుకొని కన్నీటి పర్యంతమైనవారు నా కుటుంబ సభ్యులే. మా కుటుంబంలో అంతగా కలగలిసిపోయిన ఆత్మబంధువు మోహన్‌రెడ్డి. మా మదిలో చిరకాలం మధుర స్మృతుల్ని పదేపదే జ్ఞప్తికి తెచ్చే మన్మోహనుడు మోహన్‌రెడ్డి.

మనిషన్న వాడికి మనస్సనేదొకటుంటుందనీ, దానికి ఏ రంగులతేడాలూ తెలియవనే మల్లెలాంటి తెల్లని వాస్తవాన్ని తనలో ఆవిష్కరించి చూపిన అరుదైన నేస్తం మోహన్‌రెడ్డి. కులం వాసన, ఆస్తుల ఆరాధన, డాంబికాల పొగరు తెనకెపుడూ అంటకుండా బ్రతికాడతడు. పాలేరుని, పండితుని కన్నా ఎక్కువగా ఆరాధించాడు. తానే పనిమనిషై నిజమైన శ్రమ సౌందర్యాన్ని నలుగురికీ చూపించాడు.

మోహన్‌రెడ్డి అనే ఒక 'గమ్మత్తయిన' వ్యకిని నేను తొలిసారిగా చూసింది ఎపుడో 1980ల చివర్లో. నేను నాగార్జున యూనివర్శిటీ స్టాఫ్ క్వార్టర్స్‌లో కాపురముంటున్న రోజులవి. ప్రక్కనే మిత్రుడు సుబ్రమణ్యం ఉండే క్వార్టర్స్. ఉదయాన్నే సుబ్రమణ్యం టీ తాగుతూ "భాషాబాయ్. నువ్వొస్తే, నీకొక మంచి మిత్రుణ్ణి పరిచయంచేస్తా," అని కేకవేశాడు. వెళ్ళాను. పొట్టిగా, బక్కపలచగా ఉండి తన సైజుకి మించిన అరచేతుల చొక్కా వేసుకొని, పాత గళ్ళ లుంగీ కట్టుకొని ఉన్న ఆవ్యక్తి, సిరి చాపను పరుస్తూ కనిపించాడు. నెత్తిమీద వెంట్రుకల్ని సైతం

సమ్మర్ కటింగ్ చేసుకున్న ఆ వ్యక్తిని చూడగానే 'ఇతనెవరో చదువు లేనివాడనీ, అసలు మిత్రుడెవరో లోపల ఉండి ఉంటాడని అటూ ఇటూ చూస్తున్నా. ఐతే నన్ను చూచిందే తడవుగా చాప క్రింద పడేసి చిరునవ్వుతో ముందుకొచ్చి "హలో బాషాగారు నా పేరు మోహన్‌రెడ్డి" అని ఎంతో ఆప్యాయంగా కరచాలనం చేశాడు. ఆ సమయంలో అతని ముఖంలో కనిపించిన నిర్మలమైన చిరునవ్వు, అతని చక్రాల్లాంటి కళ్ళల్లో కనిపించిన ఆప్యాయతా భావం నన్ను కదిల్చివేశాయి. ఇంతలో సుబ్రమణ్యం వచ్చి మోహన్‌రెడ్డి గురించి చెప్పిన హై ప్రొఫైల్ విన్నపుడు చెప్పలేని ఆశ్చర్యం, నమ్మలేని ఆనందం కలిగాయి.

ఇద్దరం చాపమీద కూర్చున్నాం. పరిచయాలు పూర్తయ్యాయి. రాజకీయంగా మోహన్‌రెడ్డి నన్నడిగిన మొదటి ప్రశ్న. "భారతదేశంలో ప్రధాన వైరుధ్యం ఏమనుకొంటున్నారు?" అని. ఇందులో ఆలోచించడానికే ముందనుకొని, మామూలుగానే వేమన పద్యం చెప్పినంత తేలిగ్గా "భారతదేశం అర్ధవలస అర్ధభూస్వామ్య దేశం, అశేష ప్రజానీకానికి, భూస్వామ్యానికి ఉన్నదే ప్రధాన వైరుధ్యం. నూతన వ్యవసాయ విప్లవమే మన ముందున్న ఎజెండా" అన్నాను. అభినందిస్తాడని చూస్తుంటే ఆయన కొంచెంసేపు తలవంచి గంభీరంగా మౌనం వహించాడు. మనం ఈ మూస ఆలోచనల్లోంచి ఇంకా ఎపుడు బైట పడతాంసార్? అంటూ నవ్వుతూ నా వైపు చూశాడు. విస్తుపోయాను.

"భారతేదశం స్పష్టమైన నయావలస. ఇక్కడ సామ్రాజ్యవాదమే ప్రధాన వైరుధ్యం." అనే కోణంలో ఎందుకు ఆలోచించరు? అన్నాడు. వాస్తవానికి ఆ కోణంలో మున్ముందు ఆయన నాకు బోధిస్తున్న ఎన్నో మర్మాలు, లోతులు ఆసక్తి కలిగించాయి. ఇతనిలో ఇంత అధ్యయనం ఉందా? అని ఆశ్చర్యం కలిగింది. నాకు తెలిసింది మిడిమిడి జ్ఞానమేనని అర్ధం అయింది. రోజుల తరబడి మోహన్‌రెడ్డి పాఠాల ప్రభావం నాకు బాగానే ఒంటపట్టి నట్లనిపించింది. నేను ఒక 'సామ్రాజ్యవాది'గా రూపాంతరం చెందాను. మొదటిసారిగా జాతుల పోరాటాల స్వరూప స్వభావాన్ని, సామ్రాజ్యవాదాన్ని ఓడించడానికి జాతుల పోరాట ఆవశ్యకతని మోహన్‌రెడ్డి ద్వారానే విన్నాను.

మోహన్‌రెడ్డి స్ఫూర్తితో నా ఉపన్యాసాల సరళిని, వ్యాసాల సరళిని కూడా నయా వలస దిశలో మార్చుకున్నాను. రైతాంగ సంక్షోభం, ఆత్మహత్యలు, పారిశ్రామిక సంక్షోభం, నిరుద్యోగ సమస్య, విద్యారంగ సంక్షోభం, బడ్జెట్లు విదేశీ అప్పులు, వర్తకం... ఇలా ఏ సమస్యపై విశ్లేషించినా, సామ్రాజ్యవాదపు స్పష్టమైన పట్టుని హైలైట్ చేస్తూ మాట్లాడుతున్నాను.

1986లో అనుకుంటాను. 'అరుణతార' పత్రికవాళ్లు 'కరువు' పై వ్యాసం రాయమని నన్ను కోరినపుడు "కరువు – సామ్రాజ్య వాదమూ కవలపిల్లలే' అని సూటిగానే మకుటంపెట్టి రాసిన వ్యాసాన్ని 'అరుణతార' ప్రచురించింది. ఐతే వ్యాసం చివర్లో సంపాదకులు ఒక వ్యాఖ్య రాశారు. 'భారతదేశం నయావలస అంటూ రచయిత చేసిన సూత్రీకరణతో మేము ఏకీభవించడం లేదు' అని. ఐతే ఆ వ్యాసం చదివిన చాలామంది మిత్రులు మాత్రం అందులోని సూత్రీకరణలు సమంజంసంగానే కనిపిస్తున్నాయనీ, మీ వాదన బాగానే ఉందనీ చెప్పేవారు. ఐతే ఆరేడు నెలల దాకా ఆ వ్యాసం మీద ఎవరూ స్పందనగానీ, విమర్శగాని రాయలేదు. చివరికి అనూహ్యంగా కరువు – భూస్వామ్యవిధానం అంటూ బాలగోపాల్ లాంటి గొప్పమేధావి చేత సమాధానం రాయించడం చూస్తే నాకు కొంత ఆశ్చర్యం కలిగించింది. ఇదంతా ఎందుకు అంటే మోహన్‌రెడ్డి 'నయావలస' వాదం తేలిగ్గా కొట్టిపారవేయలేని పరిణామంగానూ, సీరియస్‌గానే ఆలోచింప తగిందిగాను. ఉందని చెప్పడానికే. ఇంతకీ నేను బాధపడేదేమిటంటే – ఇంత లోతుగా కొత్తకోణంలో జరుగుతున్న విశ్లేషణల్ని అటు మోహనరెడ్డి గాని, అతని మిత్రులుగాని రాతపూర్వకంగా ప్రచారంలో పెట్టలేక పోయారు. సీరియస్ చర్చలు జరిపే వాతావరణాన్ని కల్పించలేక పోయారు. దానిఫలితంగా కొందరు యం.యల్. పార్టీ మిత్రులు మోహన్‌రెడ్డిని అతని అవాగాహననీ అపహాస్యం చేస్తూకూడా మాట్లాడటం జరిగింది. ఇప్పటికైనా మోహన్‌రెడ్డి మిత్రులు సంతాప సభల్తో ముగించకుండా, మోహన్‌రెడ్డి విశ్లేషణల్ని చర్చలు, సాహిత్యం (ఏమేరకు వీలైతే ఆ మేరకు) ద్వారా ముందుకు తీసుకెళ్ళడం సముచితమని భావిస్తాను.

'భారత సామ్రాజ్యం/ సామంతులు' అనే టైటిల్‌తో ఒక చిన్న పుస్తకాన్ని

మెహన్‌రెడ్డి ప్రచురించాడు. కనీసం ఆ పుస్తకాన్ని కూడా విస్తృత శ్రేణుల్లోకి తీసికెళ్ళలేదు. ఇంకా అముద్రితంగా కొన్నిసార్లు ఆయన రాసిన సిద్ధాంత పర వ్యాసాల్ని కూడా చూచాను. ఒక వేళ అవి దొరికితే వాటినీ వెలుగులోకి తేవచ్చు. చర్చ జరగడంలో తప్పేమి లేదు. కనీసం ఆ చర్చల పేరుతో నైనా స్తబ్దత తొలగి కొంత మేధోమదనం, విశ్లేషణా వాతావరణం ఏర్పడుతుంది గదా?

ఇక మోహన్‌రెడ్డి బహిరంగసభల్లో మాట్లాడడం నేను కేవలం ఒకటి, రెండూ సందర్భాల్లో మాత్రమే చూచాను. విప్లవ పదజూలం, సాంకేతిక పదాలు ఆయన ప్రసంగాల్లో కనిపించవు. జనం భాషలో సూటిగా, సరళంగా మాట్లాడే కళ మోహన్‌రెడ్డికుంది. జనానికి కర్తవ్యబోధన, తక్షణ కార్యాచరణ చెప్పే స్పష్టమైన తీరుంది. ఐతే జనం స్థాయికి మించిన కార్యక్రమాన్ని, దూకుడుతనాన్ని ఆయన మాట్లాడేవాడు. ఆయనే హైదరాబాదులో ఏర్పాటు చేసిన ఒక సభలో నేను నా ప్రసంగంలో సున్నితంగా తన వైఖరిని, సూచనల్ని వ్యతిరేకించి మాట్లాడినపుడు భిన్నస్వరాన్ని గౌరవంగానే స్వీకరించాడు. సమావేశం ముగిశాక తిరిగి ప్రజాస్వామ్య బద్దంగా వివిధ ఆలోచనల్ని స్వీకరించాడు. అలా మోహన్‌రెడ్డితో నాకున్న అనుభవం చాలా వినూత్నమైందిగా, విలువైందిగా భావిస్తాను.

ఇక మోహనరెడ్డి కుటుంబానికీ నాకుటుంబానికీ మంచి స్నేహ సంబంధం ఉంది. ఆయన చాలాసార్లు మా ఇంటికి వచ్చేవాడు. మేము హైదరాబాదు పని ఉండి వెళ్తే ఎక్కువసార్లు నేరుగా మోహనరెడ్డి ఇంటికే వెళ్ళేవాళ్ళం. అలా వెళ్ళినపుడల్లా మెహన్‌రెడ్డి, శశికళ ఎంతో సంతోషించేవారు. మమ్మల్ని మీరు మీ బంధువుల కన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నారు అనేవాళ్ళు. మేమంతా ఇలా కలిసినపుడు ఆయనేదో పెద్ద మేధావిలాగా, విద్యావేత్తలాగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోజు పెట్టకపోగా ఎంతో సాదాసీదా పలకరింపులతో కలసి పోయేవాడు. అందుకే నాభార్య, పిల్లలు సైతం మోహన్‌రెడ్డిని వేళాకోళపు మాటలతో ఆటలు పట్టించే వాళ్ళు. జోక్‌లు వేసే వాళ్ళు. పిల్లలు ఆయనతో ఆత్మీయంగా కలిసి భోంచేసేవాళు ్ళ. ఆయన నిరాడంబరత్వం గురించి ఇంకా చెప్పాలంటే, మా క్వార్టర్స్ దగ్గర్లో ఒక గుడిసెలో నివసించే యానాది గురవయ్య, సాంబ్రాజ్యంలను పక్కన కూర్చో

బెట్టుకుని పిచ్చాపాటి కబుర్లు సలహాలూ చెప్తూ ఉండేవాడు. అది చూచిన ఇతర ఉద్యోగులు మొదట్లో ఆశ్చర్యంగా చూచేవారు. చింపిరి గుడ్డల్తోనూ, చీమిడి ముక్కుల్తోనూ ఉండేవాళ్ళ పిల్లల్ని దగ్గరకు తీసుకొని వారికి ముచ్చట్లు చెప్పడం చూస్తే ఎంత మంది కమ్యూనిస్టు ఉపన్యాసకులకి, కుల సమానత్వాన్ని ప్రభోదించే మేధావులకి ఇలాంటి జీవన విధానం సాధ్యం అనిపిస్తుంది? అంత ఉన్నతంగా రూపుదిద్దుకున్న మట్టిమనిషి. మనసున్న మనిషి మోహన్‌రెడ్డి.

మోహన్‌రెడ్డికి కులం తెలియదు. క్వార్టర్స్‌లో ఉన్నంతకాలం నిత్యం ఆయన కబుర్లు, కాఫీలు వెళ్ళబుచ్చుకున్నదంతా మాల, మాదిగ సోదరులతోనే. వారు ఒక రోజు కనిపించకపోతే వారిని గురించి పదే పదే గుర్తుచేస్తూనే ఉండేవాడు. శశికళని ఎంతో ఇష్టంగా పెళ్ళి చేసుకున్నాడు. ఎంతో గౌరవంగా ప్రేమగా చివరికంటా చూసుకున్నాడు. తన ఇద్దరు ఆడపిల్లల్ని ఎక్కడా లోటు లేకుండా పెంచాడు. పెద్ద పెద్ద స్కూళ్ళల్లో చేర్పించాడు. వారు ఇష్టపడ్డవారితో సహజీవనానికి అంగీకరించాడు. ఆయన ప్రాక్టికల్ కమ్యూనిస్టు, హ్యూమనిస్టు. ఆయన చనిపోవడానికి ముందు రెండు నెలల క్రితం మంగళగిరి మా ఇంటికొచ్చినపుడు కూడా నాకు ఆయన వేషంలోనూ భాషలోనూ తేడా కనిపించటం లేదు. నా ఊహను కొట్టివేస్తూ ఊహించ నంత దూరం వెళ్ళిపోయి, మా గుండెలకు ఇపుడు మరింత చేరువయ్యాడు మోహనరెడ్డి.

(ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌భాషా, నాగార్జునా యూనివర్సిటీలో కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పనిచేస్తున్నారు, మోహన్‌రెడ్డికి సన్నిహితమిత్రుడు)

మార్గాన్వేషణలోనే మటుమాయమాయే

- పి. సూర్యం

చైతన్యానికి పదార్థం పునాదన్నట్లు మోహన్‌రెడ్డికి భౌతిక పరిస్థితులు నూతన మానవుడిగా అవతరించడానికి తోడ్పడ్డాయి. తను జన్మించింది ఆత్మకూరు (ఎస్) గ్రామంలో. ప్రస్తుతం సూర్యాపేట జిల్లాలోనిది. గతంలో నల్లగొండ జిల్లాలో వుండేది. జిల్లాలోని అతిపెద్ద గ్రామాల్లో ఆత్మకూరు ఒకటి. ఆ ఊరుది ఒకే మాట, ఒకే బాట. అది విప్లవాల బాట. ఆనాటి తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో ఆత్మకూరు చారిత్రాత్మక పాత్రని పోషించింది. ఆ వీరోచిత పోరాటంలో వీర మరణం పొందిన గొట్టిముక్కల గోపాలరెడ్డిది ఇదే గ్రామం. 'సైసై మా గోపాల్‌రెడ్డి సైరా మా గోపాల్ రెడ్డి' అంటూ తిరునగరి రామాంజనేయులు రాసిన పాట చాలా ప్రాచుర్యం పొందింది. తెలంగాణ సాయుధ పోరాటయోధుడు కామ్రేడ్ విసవరం సత్తిరెడ్డి, సుశీలమ్మలకు ముగ్గురు కుమారులు. అందులో పెద్ద వాడే మోహన్ రెడ్డి. అందుకే మోహన్‌రెడ్డికి కమ్యూనిస్టు బుద్ధులు పుట్టుకతోనే ప్రారంభమయ్యాయి.

తెలంగాణ సాయుధ పోరాటం ముగిసిన రెండు దశాబ్దాలకు నక్సల్‌బరి రైతాంగ సాయుధ పోరాటం అంకురించింది. భారతదేశంలో అనేక ప్రాంతాల్లో విప్లవాగ్నులను రగిలించింది. మొదటగా ఆనాటి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటం ఆవిర్భవించింది. వీటి ప్రభావాలతో తెలంగాణాలో గోదావరి లోయ ప్రాంతమంతటా ప్రతిఘటనా జ్వాలలు వ్యాపించాయి. దీనిని అనుసరించింది ఆత్మకూరు. ఈ పోరాటంలో ఈ గ్రామానికి చెందిన కోడూరు చిన్న కృష్ణ ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి నాయకత్వాన

సాగుతున్న నిర్మాణంలో ఆత్మకూరు భాగమయింది. ఈ ఊరిలో మోహన్ తండ్రి సత్తిరెడ్డి, దేగల మధుసూధన్‌తోపాటు ఉద్యమానికి నాయకత్వం వహించాడు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం విరమణానంతరం జన్మించాడు మోహన్ రెడ్డి. నక్సల్బరి సాయుధ రైతాంగ పోరాటం ఆవిర్భావం నాటికి మోహన్ రెడ్డికి 13 సం॥లు. చిన్నప్పటి నుండి పుస్తకాలు చదవడం బాగా అలవాటుగా వుండేది. చాలా మంది చదువుతారు, కానీ మోహన్ రెడ్డి చదువులో ఎంతో ఏకాగ్రత వుండేది. చదివిన వాటిని విశ్లేషించుకోవడం, జీర్ణించుకోవడంలో పెద్ద దిట్ట. జ్ఞాపకశక్తి కూడా అమితంగా వుండేది. యాంత్రికంగా అనుసరించడాన్ని అసహ్యించుకొనేవాడు. అనేక మంది కమ్యూనిస్టు కుటుంబాల నుండి వచ్చినా ఇలా కాలేరు. ఇలా కావడానికి మోహన్ రెడ్డికి పై అంశాలు ముఖ్య కారణం. ప్రభావితాలు, స్వతహాగా అబ్బిన లక్షణాలు మోహన్ రెడ్డిలోని విశిష్టతలు.

మోహన్ రెడ్డి 10వ తరగతి వరకు తన ఊరిలోనే చదివాడు. అప్పుడు ఇంగ్లీషు మీడియాలు లేవు. ఇంటర్మీడియట్ సూర్యాపేటలో చదివాడు. అప్పుడే నాకు పరిచయం. ఇంటర్‌లోనే బోధించే ఉపాధ్యాయులకు ఎదురు ప్రశ్నలేసేవాడు. వాటిలోని లోపభూయిష్టాలకు హేతుబద్ధతతో వివరణ ఇచ్చేవాడు. అప్పుడే రామాయణం, భారతం ఎలా ఊహకల్పితాలో ఎదురు చెప్పేవాడు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాల్లో అశాస్త్రీయ భావాలకు సవాలయ్యాడు.

1975లో కోదాడలో బి.యస్.సి. పూర్తి చేశాడు. అప్పుడు నేను బి.ఏ. చదువుతున్నాను. నాకంటే డిగ్రీలో ఒక సం॥ సీనియర్. పీడీఎస్‌యు ఆవిర్భావానికి ముందు కోదాడలో పీఎస్‌యుని స్థానికంగా ఏర్పర్చుకున్నాం. దాని నాయకత్వంలో విద్యార్థుల అకడమిక్ సమస్యలపై పోరాడే వాళ్ళం. అంతేగాకుండా అంతర్జాతీయ, దేశీయ, వర్తమాన రాజకీయాంశాలపై చర్చలు, ఆందోళనలు సాగించేవాళ్ళం. అప్పటికే మోహన్ రెడ్డి పాటలు రాసేవాడు. సత్యసాయి బాబా దొంగ బాబాగా ఎలా అవతరించి మోసగిస్తున్నాడో రాసి పాడేవాడు. తెలుగు భాషపై కూడా పట్టు వుండేది. అనర్గళంగా ప్రసంగించేవాడు. లెక్చరర్స్‌నే ఆశ్చర్య గొల్పే విషయాలు చర్చించేవాడు.

పీఎస్‌యు 1974లో పీడీఎస్‌యు సంస్థలో భాగమయింది. మోహన్ రెడ్డి పీడీఎస్‌యు కోదాడ డివిజన్ నిర్మాణ బాధ్యతలు చేపట్టాడు. కోదాడలో అప్పటికే ఆధిపత్యంలో వున్న ఎన్ఎస్‌యు, ఏబీవీపీ పాలక విద్యార్థి సంస్థలు పీడీఎస్‌యు అభివృద్ధిని సహించలేక ఘర్షణలకు దిగాయి. వాటన్నింటినీ అధిగమించి పీడీఎస్‌యు శరవేగంగా పురోగమించింది. విద్యార్థులకు పూర్తి విశ్వాస సంస్థగా రూపొందింది. అనేక సామాజిక సమస్యలపై జరిగిన పోరాటంలో మోహన్ రెడ్డి పాత్ర వుంది. విప్లవ విద్యార్థి ఉద్యమంగా సంఘటితమయ్యాక పోలీసు నిఘా పెరిగింది. సమస్యలపై పోరాడుతూనే, పేద విద్యార్థులకు సహకారాలను కూడా అందించేవాళ్ళం. ఒక సందర్భంలో కోదాడలో నోరు లేని మూగతనికి సహకారం కోసం కాలేజీ తరగతుల్లో మీటింగ్‌లు పెట్టాము. డబ్బు సేకరించి ఇచ్చాం. అతడిని 15 రోజులు మోహన్ తన రూంలో పెట్టుకొని సహకరించాడు. సైగలతో మాట్లాడటం నేను నేర్చుకొన్నానని మోహన్ పరిహాసం చేసేవాడు. ఒక రోజు రాత్రి ఆ మూగతను కలవరిస్తూ తనలో తాను స్పష్టమైన తెలుగులో మాట్లాడుకుంటున్నాడు. అది గమనించిన మోహన్ రెడ్డి ఆశ్చర్య పోయాడు. ఆ మూగవాని వాస్తవ రూపం అర్థమయింది. అతను నటిస్తున్న మూగవాడు. అతను ఆర్థిక అవసరాల కోసం అలా నటించాడు అనుకొన్నాం. మాకు కోపం బాగా వచ్చింది. కొంత మంది కొట్టబోయారు. కానీ అతని పేదరికం అలా తనని మూగ వేషం వేయించిందని తన సహచరులకు మోహన్ నచ్చ చెప్పాడు. ప్రతి దానికి రూట్‌కాజ్ ఆలోచించడం కాస్త ఎక్కువే. కానీ చాలా కాలం తరువాత ఆ మూగతను పోలీసు ఆఫీసరుగా మాకు ఎదురయ్యాడు. అప్పటికే మోహన్ రెడ్డి వద్దకి రహస్య పార్టీ నాయకులు వస్తూ పోతుండేవారు. అబ్బో పెద్ద ప్రమాదం నుండి బయటపడ్డామనుకొన్నాం. వాస్తవంలో ఈ విషయాలలో మాకు అంత పరిపక్వత లేదు. అంతా సాఫీగా చూసుకుంటూ పోవడమే తప్ప, క్రిటికల్‌గ చూసే ధోరణి మాకు తెలియదు.

కోదాడలో 1975 జూన్ 15 నుండి 19 వరకు పీడీఎస్‌యు రాష్ట్ర స్థాయి మొదటి జనరల్ కౌన్సిల్ 250 మందితో జరిగింది. అప్పుడే మోహన్ రెడ్డి డిగ్రీ

ఫైనల్ పరీక్షలు రాశాడు. ఈ కౌన్సిల్ ఏర్పాట్లు చేసిన ముఖ్యుల్లో మోహన్ రెడ్డి ఒకరు. కౌన్సిల్ మధ్యలో ఒక రాత్రి వీరందరిని తన ఊరు తీసుకెళ్ళి సభ పెట్టించాడు. తిరుగు ప్రయాణంలో లారీ చెడి పోయింది. అప్పుడు ప్రయాణ సౌకర్యాలు కూడా తక్కువ. క్లాసు సమయం వృధా అయింది. దీనిపై చర్చ జరిగింది. ఇక్కడ 250 మందితో క్లాసు జరిగితే, అక్కడ (ఆత్మకూరు) 5 వేల మందితో సభ జరిగిందని వాదించాడు.

పీడీఎస్‌యు కౌన్సిల్ ముగిసిన 6 రోజులకే (1975 జూన్ 25 అర్థ రాత్రి) అత్యవసర పరిస్థితి విధించింది ఆనాటి కాంగ్రెసు ప్రభుత్వం. దేశంలో తన పార్టీలోని అసంతృప్తివాదులతో సహా ప్రతి పక్ష నాయకులను నిర్బంధించింది. కమ్యూనిస్టు విప్లవకారులను అనేక మందిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపింది. ఈ కౌన్సిల్‌కి ప్రధానంగా నాయకత్వం వహించిన జంపాల చంద్రశేఖర్ ప్రసాద్‌ని కాల్చి చంపింది. అనేక మందిపై వేట మొదలయింది. విద్యార్థి నాయకులను నిర్బంధించడానికి పూనుకున్నది. అందులో భాగంగా కోదాడలో విప్లవ విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న మోహన్ రెడ్డి, ప్రభాకర్, సూర్యంలను అరెస్టు చేయడానికి ఆనాటి ప్రభుత్వం పూనుకొన్నది. ముగ్గురు అజ్ఞాత వాసంలోకి వెళ్ళిపోయారు. మోహన్ రెడ్డి, నేను గ్రామాలను కేంద్రం చేసుకొని పని చేశాం.

అప్పటికి మా రాజకీయ చైతన్యం గ్రామాలను ఎంచుకొని రైతాంగ పోరాటాలను నడిపే స్థాయి కాదు. ఎమర్జన్సీ అనే భూతంచే మేం నెట్టివేయ బడినాం. అట్లానే మొండిగా కొంత కాలం వుంటే అలవడేదేమో. కానీ ఇంకా కొంత కాలం చదవాలనే ఆలోచన మోహన్ రెడ్డికి కలిగింది. దానితో రహస్య జీవితం నుండి బయటికి వచ్చాడు. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ, యంఫిల్, ఫిలాసఫీ పూర్తి చేశాడు. ఫిలాసఫీలో గోల్డ్ మెడల్ పొందాడు. తరువాత ఢిల్లీ జెఎన్‌యు వెళ్ళాడు. ఇండియా ఎకానమీపై పీహెచ్‌డీ చేస్తూ మధ్యలోనే వదిలేశాడు. ఈ అకడమిక్ పీహెచ్‌డీలు అవసరం లేదని జనంలోకి వెళ్లాడు. ఎక్కడున్నా వర్తమాన పరిస్థితులపై స్పందించేవాడు. తన ఆలోచన ప్రకారం వ్యాఖ్యానించేవాడు.

మొదటి నుండి మోహన్ రెడ్డిలో విమర్శనాత్మకత ఎక్కువ పాళ్లు వుండేది. సృజనాత్మకత పేరుతో తన స్వంత ఆలోచనా విధానాలు ప్రవేశపెట్టేవాడు. వాటితోనే తన ఆచరణని కోరుకొనే వాడు. ఏ నిర్మాణంలో వున్నా వాటి అంశాలపై తను భావించే విషయాలను చర్చించేవాడు. విమర్శించేవాడు. చాలా సందర్భాల్లో వాటినే అమలు జరపడానికి పూనుకొనేవాడు. ఇవి కొంత వివాదానికి దారి తీసేవి. క్రమ క్రమంగా తనలోని ఈ ధోరణి తన తండ్రి, తన ఊరు, తన జిల్లా, తన సహచరులమైన మేమంతా కొనసాగుతున్న కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలోని విప్లవ పార్టీ నుండి తనని తాను వేరు చేసుకోవడానికి తోడ్పడింది. ఒక సందర్భంలో ఢిల్లీలో కా॥ చంద్ర పుల్లారెడ్డి కూడా మోహన్‌తో చర్చించాడు. తను కన్విన్స్ కాలేదు. కా॥ వేణు నాయకత్వంలోని సీపీఐ (ఎం-ఎల్) పార్టీలో చేరాడు. రాయలసీమ ప్రాంతాన్ని ఎంచుకొని ఉద్యమం సాగించాడు. అది విజయం సాధించలేక పోయింది. అంతిమంగా ఆ పార్టీనే దాని నాయకత్వం రద్దు చేసుకొన్నది. తరువాత రాష్ట్రాలన్నీ జాతులుగా పేర్కొన్నారు. జాతుల విముక్తి పోరాటమే నేడు ప్రధాన కర్తవ్యంగా ఉద్యమించాడు. సామ్రాజ్యవాదానికి జాతులకూ మధ్య వైరుధ్యం ప్రధానమయిందని భావించాడు. దీనికి సాయుధ దండు లేకుండా విజయం సాధించలేమని, వాటి నిర్మాణానికి పూనుకొన్నాడు. అదీ సఫలం కాలేదు.

స్వతంత్ర సంస్థల్లో పనిచేశాడు. తానే కొన్ని సంస్థలను నిర్మాణం చేశాడు. పట్టువీడని విక్రమార్కునిలా ఒక వైఫల్యం నుండి మరో నిర్మాణానికి పునాది వేస్తుండేవాడు. ఈ క్రమంలో పక్షవాతం ఎదురయింది. తదుపరి కొంతకాలానికి కాలు విరిగి పోయింది. ఇవన్నీ తన ఉరుకులకి కొంత పగ్గాలేసినా తన ప్రయత్నాన్ని, ప్రయాణాన్ని ఆపలేదు.

అధ్యయనం, రాయడం, కార్యాచరణగా తన చివరి జీవితం కొనసాగింది. అనేక ప్రయోగాలు చేశాడు. గ్రామంలో ఆర్గానిక్ వ్యవసాయం కూడా మొదలెట్టాడు. అదీ ఫలితం ఇవ్వలేదు. వాటన్నింటిని తన ఆలోచనా విధానంలోనే ఆచరించాడు. తనకి ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురుకి పెండ్లి వయస్సు వచ్చింది. పెండ్లి ఎప్పుడు చేస్తున్నావని కుటుంబ సభ్యులు, స్నేహితులు మాట్లాడితే చిర్రుమని

లేచేవాడు. నేను పెండ్లి చేయడమేమిటి? అది నిర్ణయించుకొనే శక్తి అమ్మాయికి వుందనేవాడు. నిజంగానే కూతురు తన భాగస్వామిని నిర్ణయించుకొన్నది. ఎలాంటి తంతులేదు. వారు సహజీవనం చేస్తున్నారు. ఇందులో కూడా తన ప్రత్యేకతని చాటుకున్నాడు.

పరిస్థితులను మార్చాలనే దానిలో మోహన్‌కి ఎలాంటి సందేహం లేదు. ఎలా మార్చాలనే దానిలో దారుల కోసం తాను నిజాయితీగా కృషి చేశాడు. సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజల అభివృద్ధికి ఆటంకమయిందని దృఢమైన వైఖరి కలిగి వుండేవాడు. దోపిడీ, పీడనలు లేని, ఎలాంటి అసమానతలు లేని సమ సమాజాన్ని కాంక్షించాడు. దాన్ని సాధించే మార్గాలను అన్వేషించాడు. కొంత ఆచరించాడు. ఫలితాల నుండి వాటి వైఫల్యాలను గుర్తించాడు. ప్రత్యామ్నాయ మార్గం అన్వేషణతోనే జీవితం ముగిసింది. వాస్తవంగా మోహన్‌ది చనిపోయే వయస్సు కాదు. ఆరోగ్యం, తిండి విషయంలో మొదటి నుండి చాలా అశ్రద్ధ వుండేది. కుటుంబం, సహచరులు చెప్పినా వినే అలవాటు వుండేది కాదు. బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆరు దశాబ్దాల వయస్సులోనే తన తుది శ్వాస వదిలాడు.

మోహన్‌రెడ్డిలో అనేక ప్రత్యేక, విలక్షణ అంశాలు మెండుగా వున్నాయి. ఎన్నో ప్రయోగాలకు పూనుకొనే శక్తివంతుడు మోహన్. అసమానతలు లేని నూతన సమాజాన్ని కలలుకన్నాడు. దీనికి తను ఎప్పుడు మరో ప్రత్యామ్నాయ ఆలోచన చేయలేదు.

కోదాడలో అనేక సందర్భాల్లో మోహన్ రెడ్డి విధానాలకు, నా భావనలకు మధ్య తీవ్రంగా చర్చ జరిగేది. తిరిగి ఉద్యమ కర్తవ్యాల్లో భాగస్వామ్యమయ్యే వాళ్ళం. నా దారి మీద తనకి పూర్తి అవిశ్వాసం. నిర్ద్వందంగా చెప్పుకోవాలంటే మా దారులు వేరే. అయినా తను కాంక్షించిన దాని కోసం నిర్మోహమాటంగా, నిజాయితీగా, నిస్వార్థంగా చివరి వరకు తన ప్రయాణాన్ని సాగించాడు.

మోహన్ అనారోగ్యంగా వున్నప్పుడు ఆనాటి (1975) మిత్రులం బాబురావు, హకీం, నేను కలుద్దామనుకున్నాం. కానీ మిత్రులతో ఆ రోజు వెళ్ళడానికి నాకు వీలు కాలేదు. కనీసం తరువాత కూడా నేను వెళ్ళి కలవలేక పోయాను. ఇంత

త్వరగా శాశ్వతంగా దూరం అవుతాడని ఊహించలేదు. ఇది గుర్తుకి వచ్చినప్పుడల్లా కనీసం చివరిగా ఒకసారయిన కలవలేక పోయాననే బాధ నన్ను ఎప్పుడూ వెంటాడు తూనే వుంటుంది. నా ప్రియ మిత్రుడు మోహన్ రెడ్డికి నా వినమ్ర జోహార్లు.

– *(పి. సూర్యం, మోహన్‌రెడ్డి బాల్యమిత్రుడు, సి.పి.ఐ. (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణా రాష్ట్ర నాయకుడు సీపీఐ)*

కామ్రేడ్ మోహనరెడ్డి నిబద్ధత !

– నిఖిలేశ్వర్

ఒక ఉన్నత జీవితాశయానికి అంకితమై, రాజకీయ సామాజిక ఉద్యమాల్లో నిజాయితిగా నిమగ్నమైన వ్యక్తులు అరుదు ఈదేశంలో. అలాంటి అరుదైన వ్యక్తి మిత్రులు కా.మోహనరెడ్డి.

విద్యార్థి దశ నుండి ప్రజాపోరాటాల స్ఫూర్తి పొందినవాడు. ఆనాటి నగ్సల్బరీ–శ్రీకాకుళ విప్లవ తరానికి చెందిన యువకుడు.

మోహనరెడ్డిని మొదటిసారి నేను మా హైదరాబాద్‌లో విద్యానగర్‌కాలనీలో చూసాను. ఆ కాలనీలోని మా ఇంటికింది సింగిల్‌రూమ్ పోర్షన్‌లో దిగినవాళ్ళు మోహనరెడ్డి, వెంకటయ్య, గురువయ్య – ఈ ముగ్గురు ఉస్మానియా యూనివర్సిటి విద్యార్థులు ఆరోజుల్లో !

బక్కపలచగా పొట్టిగా ఎప్పుడూ ఆవేశంతో మాట్లాడే మోహన్‌తో మా కుటుంబానికి పరిచయంపెరిగింది. యూనివర్శిటీ క్యాంపస్‌లో పి.డి.యస్.యు, ఆర్.యస్.యు, డి.యస్.వో లాంటి విప్లవ విద్యార్థి సంఘాలు క్రియాశీలంగా వున్నరోజులవి. కా॥ జార్జిరెడ్డి నాయకత్వాన విద్యార్థిలోకం అధ్యయనం–ఆందోళన (స్టడీ అండ్ స్ట్రగుల్) మార్గాన నడిచింది. విప్లవ ఆశయంతో ఒక కొత్తతరం ఆవిర్భవించింది.

ఆ రాజకీయ ప్రభావంలో ఎదిగినవాడు మోహన్ – ముఖ్యంగా ఆయన మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేస్తూ ఈ దేశపరిస్థితుల పట్ల ఒక స్పష్టమైన అవగాహన పొందినవాడు.

మోహన్ జీవితంలో కీలకమైన దశ ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటి (జెఎన్‌యు)లో మలుపు తిరిగింది. ఆయనకన్నా ముందు అక్కడే

చదివినవాళ్లు ఏచూరి సీతారాం మొ॥ భావితరం వామపక్షనాయకులు. రాజకీయ శాస్త్రం బోధించిన ప్రొ. శేషాద్రిగారు ఆతరానికి పాఠాలు చెప్పినవాడు. ఆ సమయంలో మోహన్ తరచుగా ఆచార్య శేషాద్రితో కమ్యూనిస్టు ఉద్యమాల తీరుతెన్నులపై వాదించేవాడు. ఆయన వాదన, మొండిపట్టుదలను గమనించి శేషాద్రిగారు, మోహన్‌ను "ఈ గాలిరెడ్డి ఎప్పుడూ ఒక తుఫాను" అని చమత్కరించేవారు. పాతతరం కమ్యూనిస్టుల అనుభవాలతో స్వయంగా శేషాద్రిగారు క్రియాశీలంగా-తాత్వికంగా పరిణతి చెందిన సీనియర్ అధ్యాపకుడిగా మోహన్‌లాంటి సీనియర్ విద్యార్థులతో విభేదించేవాడు. (పొ॥ శేషాద్రిగారు పౌరహక్కులన్యాయవాది కన్నబిరన్‌కు స్వయంగా అన్నగారు)

మోహన్‌రెడ్డితో నాకున్న సాన్నిహిత్యం ఆయా దశల్లో అతని వ్యక్తిత్వాన్ని అర్థంచేసుకునే అవకాశమిచ్చింది. జె.యన్.యు విద్యార్థి దశ ముగిసిన తర్వాత మోహన్ తనదైన పద్ధతిలో విప్లవగ్రూపులలో క్రియాశీలంగా వున్నాడు. అటు ఢిల్లీ, పంజాబ్ మొదలుకొని ఇటు ఆంధ్ర, కేరళ తదితరప్రదేశాలలో ప్రజలమధ్య తిరిగి ఈదేశంలోని రాజకీయాలను నిశితంగా పరిశీలించినవాడు. ఈ రాజ్యస్వభావం గురించి ఆయన అంచనాలు భిన్నంగా వుండేవి. ఆయనతో విప్లవరాజకీయాల చర్చ ఆసక్తికరంగా సాగేది. ఒక స్పష్టమైన అవగాహనతో ఈదేశ సామాజిక ఆర్థిక వాస్తవాలను వివరించేవాడు. ఆయన కుటుంబాన్ని దగ్గరగా చూసినవాళ్ళం మేము.

మోహన్, పి.డి.ఎస్.యులో పనిచేసినా, చారుమజుందార్ సాయుధ పోరాటమార్గాన్ని సమర్థించేవాడు. అదేవిధంగా చారుమజుందార్, పుల్లారెడ్డి, నాగిరెడ్డి తదితర ఎమ్.ఎల్. నిర్మాణాల అర్ధవలస - అర్ధ భూస్వామ్య దేశమనే సాధారణ అవగాహనను తిరస్కరించి, నయావలస - జాతివిముక్తి పోరాటాల అవగాహనను రూపొందించిన వేణు నాయకత్వంలోని సి.ఆర్.సి.లో చేరి గ్రామీణ ప్రాంతాలలో ఉద్యమాన్ని నిర్మించాడు.

ఆయనలోని అశాంతి-రాజకీయ తపన చివరిదాకా కొనసాగింది. వ్యక్తిగతంగా సిగిరెట్-బీడీల నుంచి గుట్కా సేవనం దాకా ఆరోగ్యం

బలహీనపడింది. ఆశయాలకు అనుగుణంగా దళితవర్గానికి చెందిన యువతిని వివాహమాడి, ఇద్దరు అమ్మాయిలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవితం గడిపినవాడు. ఆరోగ్యం సహకరించకపోయినా తన మేధోపరమైన రచనలతో, చర్చలతో చురుగ్గా వుండేవాడు. ఈదేశంలో ఏనాటికైనా రావలసిన రైతాంగ-శ్రామిక విప్లవమే ఒక లక్ష్యంగా జీవించినవాడు.

అయితే మోహన్ అనుసరించిన మార్గం ఆయా దశల్లో మలుపులు తిరుగుతూ నిలకడలేకుండా పోయింది. భారతదేశ స్థితిగతుల అంచనాలపై ఆయన వైఖరి కొంత ట్రాట్స్కీ ఆలోచనలకు దగ్గరగా వుండేది.

ఈ దేశం ప్రజాతంత్ర విప్లవ దశను దాటిపోయిందని, ఇక్కడ బలపడుతున్న పెట్టుబడిదారివర్గాన్ని జయించాలంటే సోషలిస్టు విప్లవదశలోకి మనమంతా రావలసిందేనని మోహన్ నమ్ముతుండేవాడు. ఆయన ఆనాటికే నెలకొన్న ఆయా విప్లవగ్రూపుల (పార్టీలు)తో రాజీ పడలేకపోయాడు. అంతిమంగా యన్.జి.వో లాంటి స్వచ్ఛంద సంస్థలలో చేరి మోహన్ ఆర్థిక-శారీరక కష్టనష్టాలను భరిస్తూ ఒంటరివాడై పోయాడు. జీవితాంతం విప్లవ నిబద్ధతతో నడచినవాడు అశాంతితోనే వెళ్ళిపోయాడు.

(నిఖిలేశ్వర్ జగమెరిగిన విప్లవకవి, రచయిత)

విచారంతో రెండు మాటలు ....

– టంకశాల అశోక్

మోహనరెడ్డి ఇక లేక పోవటం ఎందుకు లోటనిపిస్తుందో చెప్తాను. ఒకటి, ఆయన సాధారణ విప్లవ మేధావి మాత్రమే కాదు, ఒక విప్లవకారుడు కూడా. రెండు, సాధారణ విప్లవవాదుల వలె ధియరీని బట్టీ పట్టి వల్లె వేయటం, పెద్దవాళ్ళు ఏం చెప్తే దానికి తల ఊపటం గాక, అన్నింటిపై నిరంతర అధ్యయనం స్వయంగా చేసే లక్షణం ఆయనకు ఉండేది. మూడు, విప్లవవాది అవుతూనే మానవతావాది, మానవ సంబంధాలు ఒక సహజమైన తత్వం అయినట్లు ప్రవర్తించేవాడు, దానికి కొనసాగింపు అన్నట్లుగా సింపుల్ మనిషి, హాస్య ప్రియత్వం కలవాడు, కపటం తెలియనివాడు. తనలో నాకు నచ్చనిది కూడా ఒకటుంది. అది, పచ్చళ్ళు ఎక్కువగా తినటం, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయటం, మితిమీరి పొగతాగటం.

వీటిలో చివరి రెండింటి గురించి ముందు మాట్లాడతాను. విప్లవ వాదులతో నాకు సుమారు యాభై సంవత్సరాల పరిచయాలున్నాయి. మెహన్‌రెడ్డితో నలభై ఏళ్ళ దాకా అనవచ్చు. ఇందులో ఢిల్లీ జెఎన్‌యు జీవితంతో సహా తగినంత కాలం సన్నిహితంగా గడిపాము. ఈ కారణాల వల్లనే ముందుగా చివరి రెండింటి గురించి రాయాలను కుంటున్నాను. ఇంత సుదీర్ఘకాలం విప్లవవాదులతో పరిచయాల తర్వాత, నాకు వారిలోని ఎక్కువమందికి విప్లవవాద తీవ్రత ఉన్నంతగా మానవ సంబంధాల కోణం లేనట్లు అర్థమైంది. విప్లవవాద తీవ్రతను తప్పుపట్టటంలేదు. కాని మానవ సంబంధాల కోణం కూడా విప్లవవాదులకు ఎంత ముఖ్యమో గుర్తించకపోవటాన్ని తప్పుపడుతున్నాను. ఈ లోపం సుతమాత్రం

లేనివాడు మోహన్‌రెడ్డి.

మానవ సంబంధాలు కేవలం చుట్టూ ఉండే మనుషులు, ఇతర విప్లవ వాదులతో నిత్య జీవితం అనే దానికి సంబంధించి మాత్రమే అనుకునే ప్రమాదం ఉంది. అది కూడా, కాని అది మాత్రమే కాదు. యథాతథంగా విప్లవవాదంతో సహా ఏ సిద్ధాంతం, ఏ వాదం, ఏ తరహా సంస్థలు, ఎటువంటి ఉద్యమాలు, చివరకు సాధారణ కార్యక్రమాలైనా ఆ సమూహం మధ్య మానవ సంబంధాలన్నవి ఒక సహజస్థితి కావాలి. అంతేకాదు. అవి అట్లా సహజంగా ఉండటం ఆయా సిద్ధాంతాలు, సంస్థలు, కార్యకలాపాలు మొదలైనవి. సవ్యంగా సాగేందుకు కూడా ఇటువంటి సంబంధాలు తప్పనిసరి. అవసరం అనటం లేదు, తప్పనిసరి అంటున్నాను. నా యాభై ఏళ్ళ పరిచయాలలో అధికులలో కనిపించిన ఈ కొరత మోహన్‌రెడ్డిలో లేదు.

ఇటువంటి సంబంధాలు అవసరం అని థియరెటికల్‌గా గుర్తించి ఆ ప్రకారం తమ ఆలోచనలను, వ్యవహరణను రూపుదిద్దుకోవటం ఒక పద్ధతి. కొందరికి అది సహజ లక్షణంగా వస్తుంది. ఇందులో సహజత్వం ఉత్తమమని వేరే చెప్పనక్కరలేదు. అది కానపుడు ఉద్దేశపూర్వకంగా కల్టివేట్ చేసుకోవటమైనా సరే. నేను ఒక దారుణ స్థితిని గమనించాను. సహజంగా మానవ సంబంధ లక్షణాలు గలవారు కూడా తమ విప్లవ తీవ్రతలో, లేదా విప్లవ తీవ్రతకు, అది అవసరమనే తప్పు అవగాహనతో, తమలోని మానవ సంబంధ లక్షణాలను కావాలని తొక్కి వేయటం. అట్లా తొక్కి వేయనివారు తగినంత విప్లవకారులు కాలేరనే యాంత్రిక అవగాహనలు.

ఇంకా పొడిగించకుండా ఒక మాట అంటాను. ఇటువంటి వైఖరులవల్ల కలిగిన నష్టాలు ఉన్నట్లు నాకు తెలుసు. 'మనుషులు – మనుషులు' అనే పార్శ్వానికి సంబంధించి మాత్రమే కాదు. 'సిద్ధాంతాలు – అవగాహనలు – ఆచరణలు – సాఫల్య వైఫల్యాలు' అనే పార్శ్వానికి సంబంధించి కూడా. ఈ లోపం మొదటి నుంచి లేనట్లయితే విప్లవోద్యమ పరిస్థితి, పురోగతి కూడా ఈ రోజున కొంతైనా

భిన్నంగా ఉండేవని అనటం అతిశయోక్తి అవుతుందోమో తెలియదు. అట్లా తోచినప్పటికీ అనాలనిపిస్తున్నది నాకు.

ఇక్కడ ఒక ఉదయం గురించి చెప్పాలి. చలసాని ప్రసాద్ చనిపోయిన కొన్నాళ్లకు సుందరయ్య విజ్ఞాన 'స్లమ్'లో విరసం వారు సంతాప సభ ఏర్పాటు చేసారు. (స్లమ్ అంటున్నది విరసం, లేదా యథాతథంగా ఆ కేంద్రం గురించి కాదని వివరణ. అయినా ఆపదం ఉపయోగించటం దేని కన్నది రాసేందుకు ఇది సందర్భం కాదు.) అటువంటి సంతాప సభలు చాలా చూసిన మీదట ఇది భిన్నంగా కన్పించింది. హాలు నిండిపోయింది. విరసం వారు, సాధారణ అభ్యుదయ వాదులు, వేర్వేరు దృక్పథాలు గల సాహితీ ప్రముఖులు పలువురు ప్రసంగించారు. వేదిక కింద, హాలు బయట కూడా మాటలు సాగాయి. విచిత్రంగా అందరూ, దాదాపు అందరూ, చలసాని విప్లవవాద కోణం గురించి కన్న చాలా ఎక్కువగా తన మానవ కోణం గురించి ప్రస్తావనలు చేస్తున్నారు. ఇది ఇటువంటి సంతాపసభలలో వినిపించటం కనీసం నాకు తెలియనిది, నేను విననిది. విప్లవవాదంలో, సంస్థలలో, వాదులలో ఈ కోణం లోపించింది సుమా అని వారంతా ఎత్తి చూపుతున్నారా అనిపించింది. ఆ భావన అందరిలో ఉన్నట్లా? అంత విస్తృతంగా ఏర్పడినట్లా? ఎప్పటి నుంచో అనుకోవాలా? వ్యక్తమయేందుకు ఒక సందర్భం కోసం, ఒక ఎక్స్‌క్యూజ్ కోసం ఎదురుచూస్తున్నట్లా? చలసాని ప్రసాద్ వంటి వ్యక్తి మృతి ఒక అయాచిత సందర్భంగా లభించినట్లా? వారి భావనలు ఎప్పటి నుంచో మౌనంగా యాచిస్తుండిన ఎక్స్‌క్యూజ్‌గా వచ్చినట్లా?

ఆ కోణంలోపించటం గురించి, ఆ కోణం అంతగా ఉన్న వ్యక్తిని ఆధారం చేసుకుని పరోక్షంగా చెప్పటంలో విమర్శలేదు. ఒక బాధ, ఒక సూచన ఉన్నట్లనిపించింది. అది అంత 'కలెక్టివ్'గా వ్యక్తం కావటం గత యాభై ఏళ్ళ కొరతను సింబాలిక్‌గా ప్రతిఫలించటం కావచ్చునా? ఆ సభలో మోహన్‌రెడ్డి ఉన్నదీ లేనిదీ గమనించలేదు. విషయం చెప్పి తనతో మాట్లాడితే ఏమనేవాడో తెలియదు. విప్లవ వాద తీవ్రతలోని యాంత్రికత. అప్రజాస్వామికత అనే చర్చలోకి పోయేవాడా? స్థూలంగా చలసాని, మోహన్‌రెడ్డి ఒకే కోవలోకి వస్తారా? మానవ

సంబంధాలు లోపించటం, తీవ్రతలోని యాంత్రికతలు, అప్రజాస్వామికతలు ప్రకోపించటం వంటివి జరిగి ఇటువంటివారు తమతో భిన్నాభిప్రాయాలు గల విప్లవకారుల ప్రాణాలు సైతం తీయగలరని ఊహిచగలమా? చలసానిని ఆరోజున, అందరు, అంతగా, ఎందుకు ప్రేమించినట్లు?

మోహన్‌రెడ్డి తనకు తెలిసిన అందరికీ ఒక విరగబడి నవ్వే మనిషిగా తెలుసు. తను తాగే బీడీని సగంలో చంద్రమౌళికో, నిషాత్ కైజర్‌కో ఇస్తుండేవాడు. క్యారమ్ బోర్డులో ఓడిపోతే " ఊ, సరేలే అన్నా!" అని చిన్న నవ్వుతో మూలిగేవాడు. ఏదో చర్చలో, "ఎహె, నీకర్థమైతలే" దని అరిచి "ముందుగాల చాయ్ దాగు" అనేవాడు. ఆ మనిషిని ప్రేమించని వాడు లేడు, గౌరవించనివాడు లేడు, కించిత్ భయపడని వాడులేడు. "బక్కోడు" "ముసలోడు" అంటూ తిట్టి నవ్వనివాడు లేడు. జోకులు వెయ్యగా వినలేదు నేను. చిన్న జోక్‌కు అయినా నవ్వకుండా ఉ ండటమూ చూడలేదు. తను పచ్చళ్ళు అంతగా తినటం మీద నా అంత తిట్టింది మరెవరూలేరు. ఒకసారి తను, గుమ్మడి (వెంకటేశ్వరరావు) మాట్లాడుకున్నారు. కేవలం పచ్చళ్ళు తెచ్చేందుకు గుమ్మడి ఢిల్లీ నుంచి విజయవాడకు పోయి కొన్ని జాడీలు రైల్లో బుక్ చేయించాడు. ఏమైందోగాని అవి ఢిల్లీకి పగిలిపోయి చేరాయి. నేను చప్పట్లు కొట్టి జోకులు వేసాను. మోహన్‌రెడ్డి ఈసారి నవ్వలేదు. విషాదంగా మొహంపెట్టి మౌనంగా ఉండిపోయాడు. పచ్చడి గ్యాంగ్ అంతా ఆ విషాదంలో పాలు పంచుకుంది. రాజు ఒక్కడు మాత్రం 'నీ యబ్బ, పోనియ్‌లే' అన్నాడు, ఊరడింపుగా.

విప్లవవాదులకు బట్టీలు, కొటేషన్లు, వితండవాదాలు ఎక్కువై అధ్యయనాలు తగ్గటం, ప్రజల మధ్య తిరిగేవారు కూడా అహంకరిస్తూ ప్రజల నుంచి ఏమీ స్వీకరించకపోవటం (అట్లా స్వీకరించాలనటమూ వారి కొటేషన్లలో ఒకటి!), సృజనాత్మకతకు అతీతులుగా మారిపోవటం వంటివి క్రమంగా ఎక్కువవుతుండిన కాలపు మనిషి మోహన్‌రెడ్డి. తను అందుకు పూర్తి విరుద్ధంగా ఉండేవాడన్నది చెప్పుకోవలసినమాట. ఆయన అధ్యయనాల సూత్రీకరణలు సరైనవా కావా, ఎందరికి ఆమోద యోగ్యం, అవి ఆచరణలో ఏమయ్యాయి అనేది కాదు ఇక్కడ ప్రశ్న. గిడస బారిపోయి ఎటూ కదలని, అక్కడే క్షీణించే ధోరణి తనది కాదన్నదే గుర్తించవలసిన విషయం. తను లేనందువల్ల కలుగుతున్న అనేక లోట్లలో ఇది ఒకటి.

(టంకశాల అశోక్ సీనియర్ జర్నలిస్ట్, జె.ఎన్.యు.లో మోహన్‌రెడ్డికి సీనియర్)

ఒక ఆదర్శాన్ని కోల్పోయాం

– సాత్యకి

ప్రపంచీకరణ క్రమంలోపెట్టుబడిదారీ వ్యవస్థసారం ఆహార్యం కొత్తకోణాలు సంతరించుకుంది. పరాయీకరణ తారాస్థాయికి చేరుకుందని చెప్పవచ్చు. దైనందిన జీవితంగానీ, సామాజిక జీవితంగానీ నిస్సిగ్గుగా నిర్భయంగా లాభనష్టాల ధర్మకాటా ప్రతి ఒక్కరికీ మెటల్ డిటెక్టర్‌గా వర్తిస్తోంది.

ఈ సందర్భంలోనే ఇటీవల అర్థాంతరంగా కన్నుమూసిన మోహన్‌రెడ్డితో బాంధవ్యాన్ని నెమరువేసుకుంటున్నాను. మానవ సంబంధాలు కొన్ని అనివార్యంగా ఏర్పడేవి. కొన్ని యాదృచ్ఛికంగా తారసిల్లేవి. దీర్ఘకాలం కొనసాగే బంధాల్ని కాలం, ఊరు, పేరులాంటి కొండగుర్తులతో స్నేహితులుగా గుర్తుంచుకుంటాం.

3,4 దశాబ్దాల క్రితం ఒక విశ్వ విద్యాలయంలో ఒక ఆదర్శానికి కట్టుబడ్డ విద్యార్థుల్లో ఒకడిగా తారసిల్లిన పరిచయం వేరే, పేరే మోహనరెడ్డి.

ఎప్పుడూ సమకాలీన రాజకీయ పరిణామాల్ని ప్రజాపోరాట దృక్పథం ద్వారా రాయడం, విశ్లేషించడం, సహచరులతో భావ జాల ప్రత్యర్థుల్ని కసిగా దూషించడం ఇదే సర్వకాల సర్వావస్థలందూ కనిపించే మోహన్‌రెడ్డి వ్యక్తిత్వం.

సమాజంలో హింసకు ప్రధానంగా జన్మస్థలం రాజ్యమే అన్న అంశాన్ని ఎప్పుడూ ప్రత్యక్షంగా, పరోక్షంగా సూచిస్తుండేవాడు. లౌక్యం, రాజీలాంటి అడ్డదారులు అతడికి వేయి యోజనల దూరంలో ఉంటాయి. విచిత్రమేమిటంటే జె.ఎన్.యు.లో మోహన్‌రెడ్డి సమకాలికులు, సమ వయస్కులు దాదాపు అందరూ ఈ రెండు దారుల్లోనే ముందుకు సాగేవారు. మోహన్‌రెడ్డికు ఆదర్శం జీవితం అయితే ఈ ఊసర వెల్లులు అదే ఆదర్శాన్ని దేవతా వస్త్రంగా వాడుకున్నారు.

ఈరోజు పైరవీకరణ పంథాలో పచ్చి వితంతువులుగా విరాజిల్లుతున్నాయి.

జె.ఎన్.యూలో ఎం.ఫిల్. పూర్తయ్యాక కొఠారీ సెంటర్ సి.ఎస్.డి.ఎస్. లో పి.హెచ్‌డి. ప్రవేశం లభించింది. పరిశోధకుడిగా ఆ కేంద్రంలో తొలిసారి మోహనర్‌రెడ్డి సెమినార్ ఇవ్వటానికి వెళ్ళినపుడు మేమందరం వెంట వెళ్ళాం. వ్యవసాయ కూలీల్ని పీడిస్తున్న భూకా మందునో, కార్మికుల్ని దోచుకుంటున్న ఫ్యాక్టరీ యజమానినో హతమార్చడానికి వెళ్ళామా అనిపించింది. Not arm-chair revolution, we want armed revolution అన్న నినాదాల పోస్టర్లతో ప్లకార్డులతో చిన్నగదిలో 30 మంది సమావేశం. మోహన్‌రెడ్డి పత్రం సమర్పించాడు. విప్లవం మూలాలు, రష్యా, చైనా పంథాల్లో తలెత్తిన విభేదాలు తారతమ్యాలు, మన దేశంలో కమ్యూనిస్టు ఉద్యమంలో వర్గాలు, సాయుధ కమ్యూనిజం అనుయాయులు. ఇలా సాగింది మోహన్‌రెడ్డి చర్చ. కొఠారి సెంటర్ పెద్దల ప్రతి స్పందన ఏమిటో ప్రత్యేకించి చెప్పక్కరల్లేదుకదా!

తదనంతరదశలో స్వచ్ఛంద సంస్థల్లో చురుకుగా కృషి చేశాడు. వాటర్ షెడ్ రంగంలో పాతుకు పోయిన వ్యవస్థలతో వాటి పద్ధతులతో విభేదించాడు. తనదైన సుస్థిర వాటర్‌షెడ్ పంథాను తన సిద్ధాంతాన్ని తన రచనల ద్వారా వ్యక్తం చేశాడు. సభల్లో సెమినార్లలో తన గొంతు బిగ్గరగా వినిపించాడు.

ప్రపంచీకరణ, పెట్టుబడి పరాయీకరణ, పర్యావరణ విధ్వంసం సృష్టికి లయ కారకులుగా మారిన ఈ రోజున పిచ్చుక మొదలుకుని పులి వరకూ అన్ని జీవరాసులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. ఊసరవెల్లులు సైతం సిగ్గుతో తలదించుకునే స్థాయిలో మో.రె అప్పటిసహచరులు ఊలజాతి అంతరించి పోకుండా ఉండడానికి ప్రధాన కారకులు.

బహుశా ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడంవల్ల అర్ధాంతరంగా వెళ్ళిపోయాడు. ధాన్యపురాశులు గోదాముల్లో కుళ్ళిపోతున్నాయి. ప్లాస్టిక్ గింజలు కలిసిన బియ్యం మార్కెట్లో అమ్ముడవు తున్నాయి. అ సంఖ్యాకంగా అజ్ఞాతంగా వేలమంది ఆకలి మరణాల పాలవుతున్నారు. దావూద్, విజయ్‌మాల్యా విదేశాల్లో విలాస వంతంగా

విరాజిల్లితున్నారు. కాల్బుర్గి, గౌరీలంకేశ్ రాజ్యాన్ని ప్రతిఘటించి నేల కొరుగుతున్నారు. రాజ్యం నేర భోజ్యం. ఈ పరిస్థితుల్లోనే ఒక ఆదర్శ కంఠం మూగ వోయింది.

ఈ సుదీర్ఘ జీవన యాత్రలో ఒక ఆదర్శాన్ని పరిచయం చేసిన జె.ఎన్.యు.కు అప్పటి దేవతా వస్త్రధారులైన ఊలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

చివరి క్షణాల్లో పక్కన లేనందుకు మోహన్‌రెడ్డికి ఆయన భార్య, కుమార్తెలకూ నా క్షమాపణలు చెబుతున్నాను.

(సావ్యకి, ప్రఖ్యాత తెలుగుకవి గుంటూరు శేషేంద్రశర్మ తనయుడు, గుంటూరు శేషేంద్రశర్మ మెమోరియల్ ట్రస్ట్ సమన్వయకర్త. జె.ఎన్.యు.లో ఎమ్.ఎ. (పొలిటికల్ సైన్స్) చేసే రోజులనుండి మోహన్‌రెడ్డితో సన్నిహిత స్నేహం.)

కడదాకా కమ్యూనిస్టుగా జీవించిన కామ్రేడ్

- ఎన్. లక్ష్మణరావు

నేను 1978లో మొదటిసారి మోహన్‌రెడ్డిని చూసాను. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జె.ఎన్.యు.), ఢిల్లీలో మేమిద్దరం ఎమ్.ఫిల్. క్లాస్‌మేట్స్‌మి. 1978 నాటి పరిచయం స్నేహంగా మారి 2017లో ఆయన కన్నుమూసేవరకు కొనసాగింది.

ఉస్మానియా యూనివర్సిటీలో మోహన్ తత్త్వశాస్త్రంలో ఎమ్.ఎ. చదివి గోల్డ్‌మెడల్ సాధించాడు. వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ రామిరెడ్డి గారు డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగమిస్తానంటే సున్నితంగా తిరస్కరించి ఢిల్లీకి వచ్చాడు. ఎమ్.ఎ.లో క్లాస్‌ఫస్ట్‌గా నిలిచిన మోహన్ గోల్డ్‌మెడల్ తీసుకుని దానిని వెంటనే 100 రూ.లకు అమ్మేసాడు. అప్పటికి కమల్‌హాసన్ నటించిన ఆకలిరాజ్యం సినిమా రాలేదు.

ఎమ్.ఫిల్ క్లాస్‌లో విద్యార్థులు ప్రతిరోజూ ఏదో ఒక అంశంపై పేపర్ సమర్పించాలి. దానిమీద చర్చ నడుస్తుంది. నాకైతే ఏమీ అర్థమయ్యేదికాదు. సెయింట్ స్టీఫెన్, లేడీ శ్రీరామ్ కాలేజీల నుండి వచ్చిన విద్యార్థులు చాలా విషయాలు లోతుగా చర్చిస్తూ వుండేవారు.

మొదట్లో మోహన్ కూడా మాలానే ఏ డిస్కషన్‌లోనూ పాల్గొనలేదు. “ఏందబ్బా వీళ్ళ భాషా అర్థంకాదు, భావమూ అర్థం కాదు” అంటుండేవాడు. కొన్ని రోజులకి వాళ్ళ ఉచ్ఛారణ అర్థంచేసుకున్నాక, వాళ్ళను ఎదురుదాడిచేయటం మొదలుపెట్టాడు. ప్రతిరోజూ మోహన్‌దే పైచేయి. 30 మంది వున్న క్లాస్‌లో సగం కంటే ఎక్కువమంది, క్రమంగా మోహన్ పక్కకు చేరి, ఆయన అభిమానులుగా మారిపోయారు.

క్లాస్‌లో ట్రీథింకర్స్‌ని, కొంతమంది ప్రొఫెసర్లను కూడా మోహన్ మావో ఆలోచనా విధానంతో ఎండగట్టేవాడు. అప్పుడే ఆఫ్ఘనిస్తాన్ మీద రష్యా దురాక్రమణ జరిగింది. మోహన్ రష్యా సోషల్ సామ్రాజ్యవాదాన్ని ఎండగట్టేవాడు. చైనాలో డెంగ్ జియావో సింగ్, మావో సోషలిస్టు మార్గం నుండి వైదొలగి, ఆధునీకరణ పేరుతో కేపిటలిజాన్ని ఎలా ప్రవేశపెడుతున్నాడో చెబుతూవుండేవాడు.

జె.ఎన్.యు.లో ఎస్.ఎఫ్.ఇ చాలా పటిష్టంగా వుండేది. ఎమ్.ఎల్. విద్యార్థి సంస్థలు – ఆర్.ఎస్.సి, పి.ఎస్.ఒ, పి.ఎస్.ఎఫ్ చిన్న, చిన్న గ్రూపులుగా వుండేవి. పి.ఎస్.ఎఫ్.ని మోహన్ ప్రారంభించగా కృష్ణారావు మొదటి సెక్రటరీగా పనిచేసాడు. ఆ తర్వాత నన్ను సెక్రటరీగా చేసాడు. జె.ఎన్.యు. లో జరిగే అన్ని సంస్థల సమావేశాలకు పి.ఎస్.ఎఫ్. ప్రతినిధులుగా కృష్ణారావు, నేను ప్రాతినిధ్యం వహించేవాళ్ళం. మోహన్ ఏ సమావేశానికి వెళ్ళడు. మమ్మల్ని మాత్రం, సబ్జెక్ట్ బాగా వివరించి పంపించేవాడు.

నేపాల్ మాజీ మావోయిస్టు నాయకుడూ, మాజీ ప్రధాని అయిన బాబూరామ్ భట్టారాయ్ జె.ఎన్.యు.లో ఆ రోజుల్లో చదువుకున్నాడు. అతనితో మోహన్ అనేక విషయాలు చర్చిస్తుండేవాడు. భట్టారాయ్ ప్రారంభించిన అఖిల భారత నేపాలీ విద్యార్థి సంఘం సమావేశాలకు మోహన్ నన్ను పంపుతుండేవాడు. ఆరోజుల్లో ఇరాన్‌లో పెద్ద ప్రజాతిరుగుబాటు జరిగింది. ఆ సందర్భంగా ఢిల్లీలో వున్న మొజాహిదీన్ ఇరానియన్ విద్యార్థులకు, మోహన్, జె.ఎన్.యు. పూర్వాంచల్ హాస్టల్‌లో వార్డెన్‌తో పోట్లాడి మరీ కొద్దిరోజులు ఆశ్రయం ఇప్పించాడు.

జె.ఎన్.యులో అనేక భావజాలాలకు ప్రాతినిధ్యం వహించే స్కాలర్లు వుండేవారు. అనేకమంది ట్రాట్స్కీయైట్లు, ఫ్రీథింకర్స్ కూడా మోహన్‌ని అభిమానించేవారు. అనార్కిస్టులు, ట్రాట్స్కీయైట్లు, లక్సెంబర్గైట్స్‌లో వున్న లోపం వాళ్ళు ఆర్గనైజేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వకపోవటమనీ, మన శత్రువు ఆర్గనైజ్డ్‌గా వుంటే మనం ఆర్గనైజేషన్ లేకుండా ఎలా ఎదుర్కొంటామనీ మోహన్ అనేవాడు.

సిద్ధాంతపరంగా మోహన్‌లో మావో ఆలోచనావిధానం కన్పించేది. అదే పనిగా పుస్తకాలు చదివేవాడుకాదు. ఏ విషయంపై పనిచేస్తున్నాడో దానికి

సంబంధించిన సాహిత్యం ఎక్కువగా చదివేవాడు. మార్క్సిస్ట్ క్లాసిక్స్ ఎప్పుడో చదివి వుంటాడు. ఎక్కువగా రాజకీయ అర్ధశాస్త్రం అధ్యయనం చేస్తూ వుండేవాడు.

జె.ఎన్.యులో ఏ సంస్థకీ చెందని ఇండివిడ్యువల్ మార్క్సిస్టులు వుండేవారు. వారిలో ఏ ఇద్దరూ ఒకే రకంగా ఆలోచించే వాళ్ళు కాదు. ఇక ట్రాట్స్కీయైట్లు పదేపదే లేవనెత్తే అంశం స్టాలినిజం. వారందరికీ మోహన్ ఇచ్చే సమాధానం సాంస్కృతిక విప్లవం.

జె.ఎన్.యు లో మోహన్ రూమ్ పూర్వాంచల్ హాస్టల్‌లో వుండేది. ఆ రూమ్‌లో ఎప్పుడూ 10మంది వుండేవారు. భాగ్యారావు, మోహన్‌రావు, కృష్ణారావు, చంద్రమౌళి, సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, విద్యాసాగర్... మొదలైన వాళ్ళు. వీళ్ళంతా రూమ్ నుంచి బయటకు వచ్చి దాబా దగ్గర టీ తాగుతూ, బీడీలు కాల్చుకుంటూ చర్చించేవాళ్ళు. కాదు, మోహన్ చెబుతూ వుంటే అందరూ శ్రోతలే.

సిద్ధాంతపరంగా మోహన్ పూర్తిగా మావోయిజాన్ని అనుసరిస్తాడు. నేటికీ ప్రపంచానికి మావోయిజమే శరణ్యమంటాడు. ప్రకృతిని నాశనం చేయకుండా, మానవ సంబంధాలు దెబ్బతినకుండా కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించటం మావోయిజం ప్రత్యేకత కదా. 1980లలో మోహన్ చెప్పినట్లుగానే, ఆధునిక చైనా నాయకత్వం, ప్రకృతిని సర్వనాశనం చేస్తూ, మళ్ళీ నిచ్చెన మెట్ల సమాజాన్ని సృష్టిస్తోంది.

ఒకసారి ఢిల్లీ యూనివర్శిటీలో ప్రొఫెసర్ రజనీ కొఠారి, ప్రొఫెసర్ ఆశిష్ నంది లాంటి దిగ్గజాలు పాల్గొన్న సెమినార్‌లో తనదైన శైలిలో, లెక్చర్‌హాల్ గోడలపై, చిన్న చిన్న అట్టలమీద పాయింట్స్ రాసి తగిలించి ఒక్కొక్క అంశాన్ని వివరిస్తుంటే (పవర్‌పాయింట్ ప్రెజంటేషన్), వాళ్ళు మోహన్‌లోని రైతాంగ మార్క్సిస్టును చూసారు.

ఢిల్లీ రావటానికి ముందే ఉస్మానియా యూనివర్సిటీలో వున్నపుడు మోహన్ అనేక ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నాడు. అప్పట్లో పి.డి.ఎస్.యు లో వుండేవాడు. రమీజాబీ మీద అత్యాచారం జరిగినపుడు, పి.డి.ఎస్.యు

విద్యార్థుల్ని ఉత్తేజపరిచి ఉద్యమింపచేసాడు. హాస్టల్ విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్స్ ఇవ్వాలని పి.డి.ఎస్.యు, సెక్రటేరియట్‌ను ముట్టడించినపుడు, మోహన్ ఆ పోరాటంలో చురుగ్గా పాల్గొన్నాడు. దీని ఫలితమే ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని యూనివర్సిటీల హాస్టల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ రావటం. ఇప్పటికీ అది కొనసాగుతోంది.

మోహన్ కోదాడలో చదువుకునే రోజుల్లోనే నాస్తికుడు. సి.వి. రాసిన 'సత్యకామ జాబాలి' చదివి ప్రభావితుడయ్యాడు. అజ్ఞానము+భయము=దేవుడు అని మోహన్ చెప్పేవాడు. కోదాడలోనే ఒకసారి గోరా మీటింగ్‌కి హాజరయ్యాడు. గోరా కులాంతర వివాహాల గురించి ప్రస్తావించగా, మోహన్, సమాజం బాగా అభివృద్ధి చెంది, పట్టణాలు పెరిగినప్పుడు ఇటువంటి వివాహాలు మన ప్రసక్తిలేకుండానే జరుగుతాయని ఇప్పటికే అలా జరుగుతున్నాయని వాదించాడట.

మోహన్ ఉస్మానియా స్నేహబృందంలో ఇంద్రారెడ్డి కూడా వున్నాడు. తర్వాతకాలంలో ఇంద్రారెడ్డి ప్రత్యేక తెలంగాణా మీద పనిచేసినపుడు మోహన్, తెలంగాణా గురవుతున్న వివక్షమీద, అణచివేత మీద అతనికి ఎంతో డేటా ఇచ్చి సహాయం చేసాడు. తర్వాతకాలంలో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రఉద్యమం ఉధృతమైన తర్వాత మోహన్ దాన్ని విశ్లేషించాడు కాని సమర్థించలేదు. తెలంగాణా ఉద్యమం వెనకబాటుతనం వల్ల రాలేదని, తెలంగాణా అభివృద్ధి చెందిన ఫలితంగా వచ్చిందని అనేవాడు. అభివృద్ధి చెందిన ఫలితంగా వివిధ కులాలలోని శిష్టవర్గాలు (ఎలైట్) తమ అధికారం కోసం ఉద్యమం చేసారని వివరించేవాడు.

ఢిల్లీ నుండి తిరిగివచ్చాక మోహన్, సుబ్రహ్మణ్యంతో కలిసి కొన్నాళ్ళు వున్నాడు. ఆ సమయంలోనే నాగార్జునా యూనివర్సిటీలో పెద్ద దళిత ఉద్యమాన్ని నిర్మించాడు. అదే సమయంలో కృష్ణా, గోదావరి జిల్లాలలో విస్తృతంగా తిరిగి వ్యవసాయ సంబంధాల్ని, దళిత వ్యవసాయ కూలీల స్థితిగతుల్ని అధ్యయనం చేసాడు. అప్పటికే పెట్టుబడిదారీ సంబంధాలు పెరుగుతున్నాయన్న మోహన్ థీసిస్ ఈ అధ్యయనం వలన మరింత బలపడింది. తర్వాత కదిరి వెళ్ళి అక్కడ పార్టీకి నాయకత్వం వహించి ఉద్యమాన్ని నిర్మించాడు.

తన సహవాసి శశికళ, మోహన్‌లా మేధావికాదు. ఆమె తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దళిత మహిళ. ఒకసారి చుక్క (పెద్దకూతురు) "ఇంత మేధావి అయిన నువ్వు, అమ్మలాంటి సామాన్యురాలిని ఎలా ఎంచుకున్నావు" అని అడిగిందట. అలా అని శశికళను మోహన్ ఎన్నడూ చిన్న చూపు చూడలేదు. అంతేకాదు, చాలా సైద్ధాంతిక విషయాలు ఆమె స్థాయిలోనే చర్చించేవాడు.

వాటర్ సైన్స్ :

మోహన్ వాటర్ సైన్స్ పేరుతో కొత్త అవగాహనను రూపొందించాడు. వర్షాభావ పరిస్థితులను అధిగమించాలంటే హరితవనాలు, హరితహారాలు పెద్ద ఉపయోగంలేదని, అడవుల్ని పెంచటమే మార్గమని చెప్పాడు. పర్వతాల చుట్టూ దట్టమైన అడవుల్ని పెంచితే వర్షాలు సక్రమంగా కురుస్తాయనేవాడు. అతి తక్కువ వర్షపాతం వున్న ప్రదేశాల్లో కూడా వాటర్‌షెడ్ కార్యక్రమం ద్వారా పంటలు పండించవచ్చని ప్రచారంచేసాడు. దాన్ని ఆచరణలో నిరూపించాడు కూడా. మహబూబ్ నగర్ జిల్లా వంగూరులో ప్రయోగాత్మకంగా ఒక ప్రాజెక్ట్‌ను అమలుచేసాడు. వర్షపునీరుని వడిసి పట్టుకోవటానికి సాగుభూమిలో పంటకుంటలు తవ్వించాడు. భూమిచేత నీరు తాపించు అనే నినాదాన్ని రూపొందించాడు.

మోహన్ మేధావులలో మేధావి, సామాన్యులలో అతి సామాన్యుడు. అతి సామాన్యమైన, సాదాసీదా జీవితాన్ని గడిపాడు. జె.ఎన్.యు.లో చదువుకునే రోజుల్లో కూడా లుంగీకట్టుకుని, ఇస్త్రీలేని ముతక, వదులైన చొక్కా ధరించి, భుజంపై ఒక టవల్ వేసుకుని ఎక్కడికైనా వెళ్ళేవాడు. సాధారణంగా కమ్యూనిస్టుల మీద జనం చేసే ఏ విమర్శకూ మోహన్ దొరకడు.

చనిపోయేవరకు కమ్యూనిస్టుగానే బ్రతుకుతానని మోహన్ నాతో అనేవాడు. అదేవిధంగా నిజమైన కమ్యూనిస్టుగా బతికాడు. వినిమయవాదాన్ని ఎన్నడూ దగ్గరకు రానివ్వలేదు. తాను నమ్మిన విలువల్ని జీవితాంతం ఆచరించాడు.

మోహన్ ఎవరితో మాట్లాడిన విప్లవ ఉద్వేగం కనిపిస్తూ వుండేది. నిరంతరం చల్లారని అగ్ని కణంలాగా వుండేవాడు. ఆయనలేని లోటు తీరనిది.

(లక్ష్మణరావు, జె.ఎన్.యు రోజులనుండి, మోహన్ చనిపోయేవరకు సన్నిహితంగా మెలిగిన మిత్రుడు. వివిధ కళాశాలల్లో రాజనీతి శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేసి, ప్రిన్సిపల్‌గా పదవీవిరమణ చేసారు.)

మార్గదర్శకుడు మోహన్‌రెడ్డి

- దేగల జనార్దన్

ఆచరణాత్మక మార్క్సిస్ట్ విశ్వవరం మోహన్‌రెడ్డి కేవలం సిద్ధాంతాన్ని వల్లెవేయడం కాదు, ఆ సిద్ధాంతాన్ని జీవితాంతం ఆచరించిన పరిపూర్ణ మార్క్సిస్ట్ మోహన్‌రెడ్డి. చాలా మంది మార్క్సిస్ట్‌లను అగ్రశ్రేణి నాయకులను నేను దగ్గరి నుండి చూశాను. వారి అందరిలో మోహన్‌రెడ్డి మాత్రమే నాకు ఆచరణాత్మక మార్క్సిస్ట్‌గా దర్శనమిచ్చారు. ఆయనతో సాంగత్యం ఎంతో ఉన్నతమని నేను ఎప్పుడూ గర్వపడతాను. మోహన్‌రెడ్డి మా గ్రామంవాడు. ఆయన తండ్రి విశ్వవరం సత్తిరెడ్డి, తల్లి సుశీలమ్మ మా నాయన దేగల మధుసూదన్, మా అమ్మ లక్ష్మమ్మ ఈ రెండు కుటుంబాలు కొన్నేళ్లుగా ఒక కుటుంబంలాగా ఉండేవి. అందుకే మా కుటుంబంలో ఇలాంటి మేధావి ఉన్నాడని నాకు అన్పించేది. ఆత్మకూర్(ఎస్) ఆ రోజుల్లో పంచాయితీ సమితి కేంద్రంగా ఉండేది. అక్కడ హైస్కూల్‌లో హెచ్‌ఎస్‌ఎస్‌సీ వరకు చదువుకునే అవకాశం ఉండేది. పీయూసీ కోసం దగ్గరలో ఉన్న పట్టణాలకు వెళ్లవలసివచ్చేది. అందుకే ఆత్మకూర్(ఎస్) చైతన్యవంతంగా ఉండేది. మోహన్‌రెడ్డి పాఠశాల స్థాయిలోనే అత్యంత ప్రతిభశాలిగా ఉండేవాడు. తరగతి గదిలో ఎప్పుడూ ఆయనే మొదటి ర్యాంకర్. అలాగే సాంస్కృతిక, రాజకీయ, క్రీడలు అన్నింటా ప్రతిభను చూపించేవారు. పాఠశాల జనరల్‌బాడీ ఎన్నికల్లో ఆయన పాత్ర ఘనంగా ఉంటుండేది. ఆత్మకూర్ గ్రామం అప్పటి సూర్యాపేట తాలూకాలో అతి పెద్ద గ్రామంగా ఉండేది. రాజకీయాలకు కూడా ప్రధాన కేంద్రంగా ఉండేది. తెలంగాణ రైతాంగ సాయుదపోరాటంలో ఆ గ్రామం నుండి దాదాపు ఎనిమిది మంది అమరులైయ్యారు. ఆ తర్వాత గ్రామంలో కాంగ్రెస్,

కమ్యూనిస్ట్ పార్టీలు ఉండేవి. ఈ రెండింటి మధ్య తీవ్రమైన పోటీ ఉండేది. నిత్యం రాజకీయాలపైన చర్చ జరిగేది. అప్పుడు మా ఇళ్లు, సత్తిరెడ్డి ఇళ్లు ఈ రెండు రాజకీయాలకు వేదికగా ఉండేది. అందువల్ల రాజకీయాలు వారసత్వంగానే మోహన్‌రెడ్డికి అబ్బాయి. దాదాపు నాకు కూడా. ఈ వైరుధ్యాలు, తగాదాలు, దాడులు, ప్రతిఘటన, ప్రజా సమస్యలు ఇవి నిత్య కృత్యం కావడం వల్ల తప్పనిసరిగా సిద్ధాంత అవగాహన వైపు వెళ్లడం జరిగింది. అలా మార్క్సిజాన్ని అధ్యయనం చేయడానికి అనువైన పరిస్థితులు మోహన్‌కు కల్గినాయి.

మోహన్ పరిశీలన, భాష, అధ్యయనం వీటన్నింటి వల్ల ఆయన పట్ల నాకు అపారమైన గౌరవం ఉండేది. ఆ స్థాయిలోనే తనకు తెలిసిన విషయాలను గొప్పగా చెప్పగలిగేవాడు. ఆయన మాట్లాడుతుంటే వినాలన్పించేది. అలా ఒక రకంగా సోదరభావం, గురు భావం రెండూ ఉండేవి. 1970లో మేము సూర్యాపేటకు రావాల్సి వచ్చింది. అదే సంవత్సరం మోహన్‌రెడ్డి కూడా ఇంటర్మీడియట్ చదువుకోసం సూర్యాపేటకు వచ్చారు. అది మొదటి ఇంటర్ బ్యాచ్. మా ఇంటికి దగ్గరలో ఒక గదిలో మరి కొంత మంది మిత్రులు కలిసి ఉండేవారు. నేను తరుచూ ఆయనను కలుసుకునేవాణ్ని. అప్పటి మద్రాస్ లాడ్జ్ ఎదురుగా ఈ గది ఉండేది. దాదాపు ఊరి బయట. ఆయన ఇంటర్‌లో బైపిసి తీసుకున్నాడు. ఆయన డాక్టర్ కోర్స్ కోసం చదువుతున్నాడని అనుకునేవాళ్లు. కారణాలు తెలియవు కానీ ఎంబీబీఎస్ సీటు రాలేదు. అందుకే ఆయన డిగ్రీని కోదాడ కెఆర్ఆర్ కళాశాలలో చేశారు. అక్కడ సైన్స్ సెక్రటరీగా గెలిచాడు. బలమైన ప్రజాస్వామిక విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాడు. కేవలం పట్టణంలో విద్యార్థులను సమీకరించడమే కాక విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సమాజంలో భాగమని వాళ్లను కూడా ప్రగతిశీల భావాలవైపు నడిపించాలని భావించి ఆయన కోదాడ పరిసరాలలో ఉన్న అన్ని గ్రామాలకు వెళ్లి విప్లవ ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నాడు. ఆయన సృజనాత్మకతకు ఈ సంఘటన ఒక ఉదాహరణ. అప్పట్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టణాల్లో గదులు కిరాయికి తీసుకుని కిరోసిన్ స్టౌ తో వంటలు వండుకునేవారు. కిరోసిన్ విద్యార్థులకు లభించేది కాదు. ఎందుకంటే

వారి గ్రామంలో కిరోసిన్ అవసరం లేదు. కానీ చదివే చోట కావాలి. ఈ విద్యార్థులందర్ని ఈ అంశంపై మోహన్ సమీకరించాడు. అందర్ని ఈ విషయమై అధికారులను నిలదీద్దామని అందులో భాగంగా అప్పటి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిద్దామని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు తరలి రావడం కార్యాలయాన్ని ముట్టడించడం జరిగింది. న్యాయమైన డిమాండ్ కాబట్టి ప్రతి విద్యార్థికి ఒక కార్డును మంజూరు చేసి కిరోసిన్ ఇప్పించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇలా నిరంతరం సమస్యలపైన సమాయత్తం చేయడం విద్యార్థులకు పోరాటాలు ఎలా ఫలితాలు ఇస్తాయో ఈ సంఘటన ద్వారా రుజువుపరిచారు. అలా బీఎస్సీ పూర్తి అయిన తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎ తత్వశాస్త్రంలో చేరాడు. అందులో గోల్డ్ మెడల్ సాధించడం అరుదైన రికార్డు. ఆయన రోజులో 20 గంటలు చదివేవాడు. చదవడమే కార్యక్రమంగా ఉండేది. ఆ తర్వాత ఎల్ఎల్బిలో ఎంఫిల్లో ఉస్మానియాలోనే చేరి వదిలేశాడు. ఈలోగా ప్రతిష్ఠాత్మకమైన జవహర్లాల్ నెహ్రూ యూనివర్శిటీ ఢిల్లీలో సీటు దొరికింది. అది మామూలు విజయం కాదు. మామూలు విద్యార్థులకైతే ఇక జీవితంలో సెటిల్ అయ్యిపోవచ్చు అనుకునేంత పెద్ద చదువు. కానీ మోహన్ ఢిల్లీకి వెళ్లి ఢిల్లీ మోహన్రెడ్డిగా స్థిరపడ్డాడు. ఆయన అక్కడ చదవలేదు. విద్యార్థి ఉద్యమ నిర్మాణాన్ని చేశాడు. ప్రగతిశీల విద్యార్థి సంఘాన్ని ఏర్పాటుచేసి ఢిల్లీలోనే జెఎన్యులో పెద్ద నాయకుడిగా విద్యార్థుల మనసులో స్థానం సంపాదించుకున్నాడు. ఢిల్లీలోని ఆయన గది నిత్యం విద్యార్థులతో కోలాహలంగా ఉండేదట. ఎవ్వరికి ఏ సమస్య వచ్చిన ఆయనను అడిగేవారట. అలా 1985 వరకు ఢిల్లీలోనే ఉన్నాడు. మొదట పీడీఎస్యూ నాయకుడిగా ఉన్న ఆ తర్వాతకాలంలో తన రాజకీయ దృక్పథాలను మార్చుకుంటూ వెళ్లాడు. ఢిల్లీలో పలువురు మార్క్సిస్ట్ మేథావుల సాంగత్యం ఏర్పడింది. అక్కడే భారతదేశంలో విప్లవోద్యమ నిర్మాణం అది ఎదగకపోవడానికి కారణం అనే అంశంపై చర్చించే అవకాశాలు వచ్చాయి. ఆ రకంగా భారత విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకపోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన మనసు కేంద్రీకరించారు.

1970లో చారుమజుందార్ నాయకత్వంలో రూపొందిన 70 ప్రోగ్రామ్‌లో అశేష ప్రజానీకానికి, భూస్వామ్య వర్గానికి మధ్య ప్రధాన వైరుధ్యం ఉందని చెప్పడం జరిగింది. కానీ 1985 నాటికి ఆ పరిస్థితులు తలకిందులైయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల ప్రాబల్యం తగ్గింది. వ్యవసాయంలో పెట్టుబడి పెరిగింది. పంటలను మార్కెట్ ఆధారంగా రైతులు పండించడం ప్రారంభమైంది. సాంప్రదాయకమైన చెల్లాచెదురైన ఉత్పత్తి జరగడం లేదు. రైతు తన సరుకుల్ని అమ్ముకోవడం, తనకు కావాల్సినవి కొనుక్కోవడం ప్రారంభమైంది. అంటే వ్యవసాయం పూర్తిగా మార్కెట్ పరిధిలోకి వెళ్లిపోయింది. విపరీతంగా ఎరువుల వాడకం, క్రిమిసంహారక మందుల వాడకం, వ్యవసాయంలో ట్రాక్టర్ల వాడకం, ఇతర పరికరాల వాడకం పెరిగిపోయింది. అందువల్ల భూస్వామ్య సమాజాలు తమ రూపాన్ని మార్చుకుంటున్న దశలో వైరుద్యాలు కూడా మారిపోతాయి. ప్రపంచ ప్రజల ప్రధాన శత్రువు సామ్రాజ్యవాదం అని ఎలాగైతే అనుకున్నామో భారతదేశంలోనూ సామ్రాజ్యవాద వ్యతిరేక జాతుల పోరాటాలు రావాలనే నూతన సిద్ధాంతాన్ని ఆయన ప్రతిపాదించాడు. మోహన్‌తోపాటు అప్పటి సి.ఆర్.పి. కేంద్ర కార్యదర్శి వేణు ఇలాంటి సిద్ధాంతాన్ని చర్చకు లేవదీశారు. ఆ సందర్భంలో హైదరాబాద్‌లో నేను, మోహన్ కలిసి ఉన్నాము. తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులపైన ఆధారాలతో సహా వివరించాలని అధ్యయనం చేయడం జరిగింది. ఆ సందర్భంగా డేటా న్యూస్ ఫీచర్ అనే ఒక సంస్థ ప్రచురించినటువంటి సంకలనాలను తీసుకుని వచ్చి అధ్యయనం చేసి వ్యవసాయరంగంలో వచ్చిన మార్పులను వివరిస్తూ ఒక డాక్యుమెంట్‌ను, వ్యాసాలను తయారుచేయడం జరిగింది. భారత విప్లవోద్యమానికి ఇప్పుడున్న సిద్ధాంతం అర్ధవలస–అర్ధ భూస్వామ్య విధానం అమలులో ఉందని చెప్పుకుంది. కానీ ఆచరణలో ముందుకు వెళ్లడంలేదు. కాబట్టి విప్లవమే ప్రధానం అనుకునేవాళ్లు ఆలోచించాలని ముఖ్యంగా మావోయిస్ట్‌లు ఆలోచించి పోరాటాన్ని పునఃప్రారంభించాలని ఆయన కోరుకునేవారు. ఈ సిద్ధాంతాన్ని అమలులో పెట్టాలని తెలుగు దండు పేరుతో అనంతపురం జిల్లాలో నమూనాగా ఒక

ప్రయత్నం జరిగింది. అది ఫలితాలను ఇవ్వలేదు. ఇంకా అధ్యయనం చేయాలని ఆయన భావించారు. ఏదైనా సరే పీడిత ప్రజానీకానికి భూస్వాముల పీడన లేదు. మరేదో ప్రత్యామ్నాయమైతే కావాలని ఆయన భావించేవాడు. ఎంత కఠినమైన విషయాలనైనా తేలికగా చెప్పడం మోహన్‌కే సాధ్యం. ఆయన గుంటూరు కేంద్రంగా దళిత ఉద్యమాన్ని నిర్మించినప్పుడు ఆయన రాసిన కరపత్రాలు ఎంతో చైతన్యవంతంగా ఉండేవి. పార్టీ పిలుపును ఆచరించి అక్కడికక్కడే కులాంతర వివాహం చేసుకున్నారు. తన జీవితంలో సొంత ఆస్తిని సంపాదించలేదు. సంపాదించాలని కూడా అనుకోలేదు. తన మేథస్సును, ప్రతిభను, విజ్ఞానాన్ని, సమయాన్ని సమాజం కోసం వెచ్చించారు. ఆయన వ్యక్తిగత జీవితం అని పిలుచుకునే అది వ్యక్తిగతంగా ఉండేదికాదు. ఆయన ఇల్లు ఒక సోషలిస్ట్ శిబిరంలాగా అన్పించేది. ఎప్పుడూ ఎవ్వరో ఒకరు వస్తూ పోతుండేవారు. ఆయన అందర్నీ ఆదరించేవాడు. ఉద్యోగం చేసినా ఆయన ఉద్యమం చేసినట్లుగా ఉండేది. తాను పనిచేస్తున్న సంస్థలో నీటిపై మొదట అధ్యయనం ప్రారంభించారు. భూమిపైన ప్రవహించాల్సిన వాగులు, వంకలు ఎందుకు కనపడడంలేదు, చెలిమ నీరు తాగి బతికే రైతాంగం వందల అడుగుల లోతు వెళ్లి నీరు ఎందుకు తెచ్చుకోవాల్సి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండాల్సిన హరితవనాలు ఎందుకు మాయం అయ్యియి... ఇలాంటి ప్రశ్నలన్నింటికి సమాధానాలు వెతికేవాడు. కేవలం హరితవిప్లవం చేసిన దుర్మార్గం వల్లే సమాజమంతా ఎడారీకరణ పాలయ్యిందని ఆయన చెప్పేవాడు. 200 సంవత్సరాల వర్షపాతంపై అధ్యయనం జరిపాడు. అందుకే జల సంరక్షణ జరగాలని, వ్యవసాయంలో పెట్టుబడులు నశించాలని, సహజంగా పంటలను పండించాలని రైతులు తమ భూముల్లో పడ్డ వర్షాన్ని తామే రక్షించుకోవాలని తద్వారా భూగర్భ జల మట్టం కాపాడబడుతుందని ఒక ప్రాజెక్ట్‌ను తీసుకుని నల్లగొండ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లాలో కొన్ని గ్రామాలలో ఆయన పనిచేశారు. అక్కడి పత్రికలు ఈ ప్రాజెక్టుపైన వార్తలు కూడా రాశాయి. కానీ చెప్పవల్సినంత చెప్పలేదు. ఇలా ఆయన వ్యక్తిగత జీవితం అనేది లేకుండా తన జీవితమే ప్రజల కోసం అన్నట్లుగా గడిచింది.

మోహన్ ఈ అంశంపైన ఎన్నో వ్యాసాలురాసాడు. ఎన్నో పరిశోధనలు జరిపాడు. వ్యక్తిగత జీవితం ఆదర్శంగా ఉండేది. తన జీవితంలో రెండు చొక్కాలు, రెండు లుంగీలు తప్ప మరేదీ తన సంచీలో ఉండేవి కాదు. ఎక్కడికి వెళ్లినా ఆఖరుకు విదేశాలకు వెళ్లినా ఆయన లుంగీ, చొక్కాపైనే వెళ్లేవాడు. నిరాడంబరత ఆయనకు ఆభరణంగా ఉండేది. అద్భుతమైన ఆంగ్ల భాష నైపుణ్యం, అత్యంత లోతైన విశ్లేషణ, సరళంగా చెప్పగలగడం ఇవన్నీ మోహన్ గొప్పతనం. ఆయన కుటుంబ వ్యవస్థను ప్రజాస్వామికంగా చూసేవాడు. తన పిల్లల్ని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాడు. వారి పెళ్లిళ్ల విషయంలోనూ పూర్తి స్వేచ్ఛను ఇచ్చాడు. వివాహం అనే తంతును వ్యతిరేకించేవాడు. ఇరువురు సహజీవనం చేస్తేనే నిజమైన మిత్రులుగా ఉంటారని ఇప్పటి వరకు అస్తిత్వంలో ఉన్న వైవాహిక వ్యవస్థలో బానిస, యజమాని సంబంధాలు ఉన్నాయని వాటిని తిరస్కరించాలని అంటూ తన పిల్లల పెళ్లిళ్లు చేయడానికి నిరాకరించాడు. ఇలా ఆస్తి లేకుండా, అనుబంధాలు లేకుండా, ఆకాంక్షలు లేకుండా గడిపి ఆచరణాత్మక మార్క్సిస్ట్‌గా ఎందరికో మోహన్‌రెడ్డి నమూనాగా నిలిచారు.

మోహన్‌కు చాలామంది మిత్రులు ఉండేవారు. వారంతా పెద్దపెద్ద పదవులలో కూడా ఉండేవారు. తరుచూ అలాంటి స్థాయి ఉన్నవారు కూడా మోహన్‌తో మాట్లాడాలని ఆర్థిక, రాజకీయ, సామాజిక విషయాలు చర్చించాలని వాటికి పరిష్కారాన్ని కూడా మోహన్ ద్వారా తెలుసుకోవాలని తాపత్రయ పడేవారు. ఆయనతో మాట్లాడితే ఓ ధైర్యం వచ్చేది. మార్గం దొరికేది. అలా ఓ విశేషమైన వ్యక్తిత్వం మోహన్‌రెడ్డిది. రోగాలపాలైన వారిని ఆసుపత్రులకు తీసుకపోవడం, వారికి ధైర్యాన్నివ్వడం, డాక్టర్లను స్థితిగతులపైన విచారణ చేయడం, తగు జాగ్రత్తలు చెప్పడం జరిగేది. అలా మోహన్ ఎందరికో ఆప్తులుగా కనపడేవారు. పైరవీలు చేయడం, పనులు చేయడం ఆయన దగ్గర నడిచేది కాదు. సాధారణంగా తన పరిచయాలను ఉమ్మడి అవసరాల కోసం వినియోగించేవాడే తప్ప తన వ్యక్తిగత అవసరాల కోసం, లేదా తనకు సంబంధించిన వారి అవసరాల కోసం వాడుకునేవారు కాదు.

మోహన్‌రెడ్డి ప్రతి విషయాన్ని ప్రజల నుండి నేర్చుకోవాలి అని బోధించేవాడు. మావో చైనా విప్లవోద్యమ నాయకుడు. ఆయన "నేను షాకై నుండి నేర్చుకున్నాను" అని అనేవాడు. ఈ షాకై చైనాలో ఒక కమ్మరి. చైనా ఉద్యమానికి ఆయన ఇచ్చిన సలహా ఎంతో ఉపయోగపడిందని మావో చెప్పేవాడని పుస్తకాల్లో చదువుకన్నా ప్రజలతో మమేకం కావడమే అన్ని సమస్యలకు పరిష్కారంగా ఉంటుందని మావోనే ఉదాహరణగా చెప్పేవాడు. తల వెంట్రుకలంతా మంది పీహెచ్‌డీలు చేశారు. కానీ 12వ తరగతి బోటాబోటి మార్కులతో పాసైన మావో ప్రపంచానికి తెలుసు. అందుకే చదువుకన్నా ప్రజల కోసం ఏం చేశామనేది ప్రామాణికంగా ఉండాలని బోధించేవాడు. ఇలా ఎన్నో విశిష్టతలు కలిగిన మోహన్‌రెడ్డి తప్పనిసరిగ భారత మార్క్సిస్ట్- లెనిస్ట్ ఉద్యమంలో ఆయన చరిత్రను రాయవల్సిందే. భవిష్యత్‌లో ఆయన చూపించిన మార్గం ఆచరించాల్సిందే. ఆనాడు మోహన్‌రెడ్డి నూతన ఉద్యమ మార్గదర్శకుడిగా నిలబడతాడు. అలాంటి మహా నాయకుడిని విప్లవోద్యమ చరిత్రలో పదిల పరుద్దాం. ఆయన మార్గాన్ని ఆయన ఆలోచనను ఈ సమాజ మార్పుకు ఉపయోగిద్దాం. మోహన్‌కు జోహార్లు పలుకుదాం.

....

(డేగల జనార్ధన్ సీనియర్ జర్నలిస్టు, మోహన్‌రెడ్డి సహచరుడు)

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటయోధుడు

– యాదగిరిరెడ్డి

విశ్వవరం మోహన్‌రెడ్డి గొప్ప మేధావి, దార్శనికుడు. మట్టి మనుషుల్ని ఔపోసన పట్టిన గొప్ప తత్త్వవేత్త. నిజాం వ్యతిరేక తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం ఉధృతంగా జరిగిన నల్గొండ జిల్లాలోని పెద్దగ్రామం ఆత్మకూరు ఆయన స్వంతవూరు. మోహన్ తండ్రి సత్తిరెడ్డి ఆ ప్రాంతంలో పేరు పొందిన కమ్యూనిస్టు నాయకుడు. నక్సల్బరీ ప్రభావంతో సత్తిరెడ్డి కమ్యూనిస్టు విప్లవకారుల పక్షం వహించాడు. మోహన్‌రెడ్డి ఆ విప్లవవారసత్వాన్ని స్వీకరించి చిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చాడు.

కోదాడలో డిగ్రీ చదువుతూ మోహన్ విద్యార్థుల సమస్యలమీద పోరాటాలు నడుపుతూనే, చుట్టుపక్కల గ్రామాల్లో విప్లవ రాజకీయ ప్రచారం చేసేవాడు. అతని వాగ్ధాటి తోటి విద్యార్థులను మంత్రముగ్ధులను చేసేది. ఆ సమయంలోనే సి.వి. రాసిన సత్యకామ జాబాలి మోహన్ చదివాడు. ఆ పుస్తకం మోహన్ మీద చాలా ప్రభావం వేసింది.

మోహన్ కోదాడలో చదువుకునే సమయంలోనే ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించింది. వివిధ పాలక పక్షాల నాయకుల్ని సైతం వదిలిపెట్టని రోజులవి. పాశవిక దమకాండలో ఎంతోమంది విప్లవకారుల్ని వధించటం జరిగింది. తన సహచర విద్యార్థి నాయకులైన జంపాల లాంటి వారిని కాల్చివేయటంతో మోహన్ కొంతకాలం అజ్ఞాతవాసంలో గడిపాడు.

ఆ తర్వాత రోజుల్లో ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్.ఎ. (ఫిలాసఫీ) చదివాడు. చాలీచాలని మెస్ ఛార్జీలు పెంచాలని విద్యార్థులు ఆందోళన చేసి, సెక్రటేరియట్‌ను ముట్టడించారు. అప్పుడు జరిగిన లాఠీఛార్జీలో మోహన్ చెయ్యి

విరిగింది. ఇంత అణచివేతలో కూడ ఎమ్.ఎ. (ఫిలాసఫీ)లో గోల్డ్‌మెడల్ కొట్టి మేధావి అనిపించుకున్నాడు. ఆ సమయంలోనే, గ్రామంలో పుట్టి గ్రామాలతో అనునిత్యం సంబంధం కలిగిన వ్యక్తిగా గ్రామీణ సంబంధాలలో వస్తున్న మార్పుల్ని అర్థం చేసుకుని, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు కాలం చెల్లిందని ప్రకటించి, పుల్లారెడ్డి పార్టీ లైనులో విభేదించాడు.

మరింత అధ్యయనం కోసం మోహన్, దేశ రాజధాని అయిన ఢిల్లీ చేరి, జె.ఎన్.యు. లో ఫిలాసఫీ స్కాలర్‌గా చేరాడు. దేశ విదేశాలలో జరుగుతున్న విప్లవాలపై అధ్యయనం చేస్తూ, కె. వేణు నాయకత్వాన పనిచేస్తున్న సి.ఆర్.సి., సిపిఐ(ఎమ్.ఎల్) ఢిల్లీ యూనిట్‌తో సంబంధాలు పెట్టుకున్నాడు. వారి పత్రిక 'మాస్‌లైన్' చదువుతూ, తన అభిప్రాయాలకు అనుకూలమైన పార్టీ అయినందున కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాడు. అప్పటికే ఆంధ్రాలో సి.ఆర్.సి. నాయకత్వాన ఒక యూనిట్ పనిచేస్తోంది. ఆ యూనిట్‌కు నాయకత్వం వహిస్తున్న నన్ను 1985 ఆగస్టు 12న పోలీసులు అరెస్టుచేయటంతో, యూనిట్ ఇన్‌ఛార్జీగా కేరళకు చెందిన కామ్రేడ్ సన్నీ పనిచేస్తున్నాడు. మోహన్ ఆంధ్రాలో పనిచేయటం కోసం ఢిల్లీ నుండి తిరిగివచ్చాడు, సన్నీతో కలిసి పనిచేసాడు.

సి.ఆర్.సి. నిర్మాణం బలంగా వున్న రాయలసీమ జిల్లా అయిన అనంతపూర్ జిల్లాలోని కదిరి ప్రాంతంలో మోహన్ పని ప్రారంభించాడు. 1987లో నేను విడుదలై మోహన్‌తో కలిసి పనిచేసాను. రాయలసీమ కరువుపై అధ్యయనం చేస్తూ, రైతాంగ సమస్యలపై బలమైన ఉద్యమాన్ని నిర్మించాం.

సి.ఆర్.సి. భారత ఉపఖండంలో మార్పులను, వాటి తీరుతెన్నులను అధ్యయనం చేసి, దళారీ బూర్జువా వర్గం, సామ్రాజ్యవాదంతో కుమ్మక్కై అన్ని జాతులను కొల్లగొడుతుందని, దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గ నాయకత్వంలో జాతుల పోరాటాలను నిర్మించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే కదిరి ప్రాంతంలో 'తెలుగుదండు' అనే పోరాట సంఘాన్ని ఏర్పరిచి, దాని నాయకత్వంలో జాతిని నిర్వీర్యం చేస్తున్న సారాయికి వ్యతిరేకంగా ఉద్యమం నడపటం జరిగింది. అదేవిధంగా కరువు సమస్యను అధ్యయనం చేసి, వర్షపునీటిని నిల్వచేసేందుకు

చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తూ, అడవులను పరిరక్షిస్తూ, వలసబోయిన వర్షాలను వాతావరణ సమతుల్యంతో పునరాగమనం చేయించాలని ప్రచారం చేయటం జరిగింది. అదేవిధంగా 1991లో భారతఉపఖండంలో సమాఖ్య తరహా రాజ్యాంగానికి రూపకల్పన చేయాలని డిమాండ్ చేస్తూ సెమినార్ నిర్వహించటం జరిగింది.

ఈక్రమంలోనే ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయే విధానం గురించి నిర్మాణంలో భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. అతి త్వరలోనే జాతివిముక్తి జరగాలనే మోహన్ వైఖరితో మిగిలిన కామ్రేడ్స్ ఏకీభవించలేదు. దీనితో మోహన్ నిరాశకు గురై ఉద్యమం నుంచి బైటికి పోయి స్వచ్ఛంద సంస్థలతో పనిచేయటం జరిగింది.

గత కొద్ది సంవత్సరాలుగా మోహన్ కరువు, పర్యావరణం, సేంద్రియ వ్యవసాయం గురించి అధ్యయనం చేస్తూ కొత్త అవగాహనను రూపొందించుకుంటూ వచ్చాడు. చిన్న, సన్నకారు రైతులు తక్కువనీటితో ఎక్కువ పంట ఎలా తీయాలో చెబుతూ, భూగర్భ జలాలపరిరక్షణకై కందకాలు తవ్వుతూ భూమికి నీళ్ళు తాపాలి అనే నానుడిని ప్రచారం చేస్తూ అకాల మరణం చెందాడు.

ఆ కామ్రేడ్ తన జీవితకాలమంతా పేదప్రజల బాగోగులపై అధ్యయనం చేస్తూ, ఆచరిస్తూ, విద్యార్థి దశ నుండి కన్నుమూసేవరకు ఒక శాస్త్రీయ పద్ధతిలో జాతి పునర్నిర్మాణానికి అంకితమై పోరాడిన గొప్ప శ్రామిక వర్గ మేధావి. ఆయన ఆశయాలను తుదకంటా కొనసాగించడానికి సమాయత్తం కావటమే ఆ కామ్రేడ్‌కి మనమిచ్చే నివాళి.

(యాదగిరిరెడ్డి, మోహన్‌రెడ్డి స్నేహితుడు, కామ్రేడ్. 20 సం॥ల పాటు సి.పి.ఐ. (ఎమ్.ఎల్)కు చెందిన వివిధ నిర్మాణాలలో పనిచేసాడు.)

మోహనా! మోహనా! నువ్వే మా విశ్వవరం

- విద్యాసాగర్ అంగళకుర్తి

మోహనా! మోహనా!
నీ ఉనికే మా విశ్వవరం
వివక్షా పీడిత దేశ విముక్తి పథ నిర్ధేశంలో నీదో విలక్షణస్వరం

నింగీ నేలా గాలీ నీరూ అందరివీ అని వాదించే వాడివి
నీళ్ళకు గమనం, గమ్యం నేల సౌభాగ్యం కోసమేనని నిరంతరంగా శోధించిన వాడివి

ఎంత మోహనమైనదైనా ఏదో రోజున మాయమవుతుందని ఎంత తెలిసినా
ఇంత తొందరగానా?

తలుపు తోసుకొని వచ్చే చిన్న నాటి నేస్తంలా
ఎప్పుడూ ఎక్కడ్నుంచో హఠాత్తుగా ఊడిపడే నీ పిలుపు
మళ్ళీ హఠాత్తుగా ఎప్పుడో వినిపిస్తుందని ఎంత నమ్మకం నాకు

దొరతనమంతా తేరగా నీ వడిలో వాలే దోరవయసులో
ప్రజాపంథా తత్వాన్ని తలకెత్తుకున్నావు
సుదూర సుందర స్వప్నాల సవ్వడి అన్వేషణలో
జేయన్యూ ప్రాంగణ విన్యాసంలో
నువ్వెంత సునాయాసంగా అమరిపోయావో

ఎలా కలిశామో అప్రస్తుతం మోహనా
ఎలా ఉన్నామని తలుచుకుంటే
నీ సమక్షంలో ఎంత మోహనమైనవి ఆ రోజులు

ఉచ్ఛైస్వరమేదైనా ఉంటే అది నీదే మోహనా
ఉరుముల్లాంటి మాటల కదన రంగం నుంచి మరలి
చిరుజల్లులాంటి నీ చిరునవ్వుతో
మిత్ర వైరుధ్యాన్నెంత మోహనంగా కళ్ళకు కట్టేవాడివి.

గాలికి నీమీదెంత ప్రేమలేక పోతే
నిన్ను నిటారుగా ఉంచడానికి అహర్నిశలు తనెందుకు కష్టపడేది?

ఇంత హఠాత్తుగా గాలికి సెలవని వెళ్ళిపోయావా?

నిరంతరంగా ఆలోచించే నువ్వు
నిమ్మళంగా ఓ చోట ఉండని నువ్వు
నిసర్గ సౌందర్యం నలుదెసలా పరచుకోవాలనీ
నీళ్ళ సౌభాగ్యంతో తెలంగాణమంతా నిండి పోవాలనీ
ఎంత మందిని నువ్వు కలిశావో
నీళ్ళకూ, నీకూ ఉన్న బంధంతో
ఎంత అనర్గళంగా
వాళ్ళందరితో వాదించావో నా కెప్పటికీ గుర్తే మోహనా!

ఆ బక్కపలచని దేహంతో
అంతులేని ఆలోచనలను ఎంత అలవోకగా మోశావో
నీ ఆయసాన్నెవ్వరికీ పంచని నువ్వు
అలుపన్నదే ఎరగని నిరంతర మేధా యోధుడి
వనిపించుకున్నావు

గాలిలో తేలిపోయే రేకల బీజంలా
యిప్పటికీ ఎక్కడో నీ ఆలోచనా బీజాలను
మోసుకొని అలా ఎగిరి పోతున్నావనే అనిపిస్తోంది.

అందంలాల నొదులు కోవడానికి ఎంత సులభంగా సిద్ధపడ్డావు
అసమానతల పట్ల నీ అసహనం మాటల్లో తప్ప
ఎక్కడా తూలని నీ ప్రవర్తనతో ఎంత కాలమలా సాగిపోయావో!

కల్మషమెరగని ఆలోచనలకు నెలవైన నీ మనసు
నువ్వెవ్వరినీ అడగకుండానే
అందర్నీ నీ వద్దకు చేర్చింది.

ఎక్కడున్నావిప్పుడు?

ఆకాశ మేఘాలతో తేలిపోతూ
ఆలోచనలకు ఆకల్మష రూపంగా ఉన్నావా?
ప్రతి నీటి బొట్టు నీలిమలో నువ్వే కనిపిస్తావు నేస్తం.
పచ్చనాకు ఎక్కడ చూసినా నీ నవ్వే కనిపిస్తుంది.
మండే జ్వాలనెప్పుడు చూసినా నీ మాటే వినిపిస్తుంది.
నిర్మలంగా పరుచుకునే గడ్డి పరకల పచ్చతివాసి మిసమిసలో
నేలతల్లికి నిశ్శబ్ద ఆభరణంగా ఉన్నావా?
గల గలమని కదిలే రెమ్మల సందడిలో

నీ ఊపిరి సరిగమలను వింటూనే ఉంటాను.

నువ్వెక్కడికని పోతావు మోహనా?
నలుగురు కలిసి నలుగురికోసం పనికొచ్చే ప్రతిపనిలో నువ్వున్నావు.
ఆలోచనల నిర్మలత్వంలో నువ్వున్నావు
ఉరిమినా కురిసే జల్లులా మాటల నుంచి చిరునవ్వుకు మారే నీ నిష్కల్మష
వర్తనమెప్పటికీ చిరంజీవి మోహనా!

మోహనా! మోహనా!
నీ ఉనికే మా విశ్వవరం
వివక్షా పీడిత దేశ విముక్తి పథ నిర్దేశంలో నీదో విలక్షణ స్వరం!

(ఎ. విద్యాసాగర్, జె.ఎన్.యు. రోజులనుండి మోహన్‌రెడ్డి స్నేహితుడు. రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారి, తెలుగుకవి.)

మోహన్‌రెడ్డి యాదిలో.....

– డా. కె. సుధాకర్‌రెడ్డి

అది 1969–70 సంవత్సరం. మావూరు అప్పటి నల్లగొండ జిల్లా సూర్యాపేట తాలుకా లోని కొత్తగూడెం. నేను మా ప్రక్క గ్రామమైన తుంగతుర్తి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివా. మేము అప్పట్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్ష రాయాలంటే సూర్యాపేటకు వెళ్ళాల్సిందే. అలాగే మోహన్‌రెడ్డి తన స్వగ్రామమైన ఆత్మకూరులోనే పదవ తరగతి చదివి పబ్లిక్ పరీక్షకు సూర్యాపేటకు వచ్చాడు. ఒకప్పుడు ఆయన ఊరు సమితి హెడ్ క్వార్టర్‌గా వుండేది. అప్పట్లో ఉన్నత పాఠశాలలు కేవలం రెవెన్యూ ఫిర్కాలోనే వుండేవి. తెలుగుదేశం ప్రభుత్వం అప్పటి రెవెన్యూ ఫిర్కాలనే మండల కేంద్రాలుగా ఏర్పాటు చేసింది.

అప్పట్లో జిల్లాలో కేవలం నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయగా. అందులో ఒకటి సూర్యాపేట. అందులో ఆయన నేను, కూడా చేరాం. ఇద్దరం బై.పి.సి. తీసుకొని వేర్వేరు సెక్షన్లలో వుండేవారం. నా గ్రామం, మోహనరెడ్డి గ్రామం కమ్యూనిస్టు ఉద్యమ కేంద్రాలుగా వుండేవి. అప్పట్లో ఎమ్.పి, ఎమ్.ఎల్.ఎ.లుగా పనిచేసిన భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి, మల్లు స్వరాజ్యంలు మా గ్రామస్తులే కావటం, అప్పటికే మెహన్‌రెడ్డి తండ్రి కమ్యూనిస్టు గ్రామ సర్పంచ్‌గా పనిచేయటంతో మాకు కమ్యూనిస్టు వాసనలు ఉండేవి. కొత్తగా ఏర్పడ్డ జూనియర్ కాలేజిలో సౌకర్యాలు లేమి ఉండటంతో నా రూంమేట్స్ గోవర్దన్‌రెడ్డి. నేను, మోహన్‌రెడ్డి ఇంకా కొంతమందిమి ఎస్.ఎఫ్.ఐ. పేరుతో ఒక కరపత్రం తీసి సమస్యలను విద్యార్థుల దృష్టికి తేవడం జరిగింది. అంతేకాకుండా మేమంతా డాక్టర్లం కావాలనే లక్ష్యంలో కష్టపడి చదవడం. తెలివైన విద్యార్థులుగా మోహన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలను గుర్తించడంతో కాలేజి మొత్తంలోఒక ఆకర్షణ మా ఎడల వుండేది.

మోహన్‌రెడ్డి ఆహార్యం ఆరోజుల్లో పైజామా, హాఫ్ ఓపెన్‌షర్టులో, స్లిప్పర్లలో కాలేజి మొత్తంలో ఆకర్షించేవాడు.

ఆరోజుల్లోనే ఆయన నమ్మిన విషయాలను కుండబద్దలు కొట్టినట్లుగా గట్టిగా మాట్లాడేతత్వం ఆయన సొంతం. కాలేజి మొత్తంలో ఆయనకి ఒక తెలివైన విద్యార్థిగా గుర్తింపు ఉండేది. అతను ఎమ్.బి.బి.ఎస్‌ను టార్గెట్ చేసుకొని రెండుసార్లు ప్రయత్నించిన దొరక్కపోవటంతో బి.యస్సీ.లో కోదాడలో చేరాడు. మేము హైద్రాబాదులో బి.ఎస్సీలో చేరాము. కాని నా రూంమేట్‌కు ఎమ్.బి.బి.ఎస్ దొరకటం గాంధీలో జాయిన్ కావటం యదృచ్ఛికం. అయినా మేమంతా అప్పట్లో వామపక్ష విద్యార్థి ఉద్యమం ఉధృతంగా వుండటం పి.డి.ఎస్.యు. లో పనిచేయటంతో సంబంధాలు కొనసాగుతుండేవి. అతను బి.యస్సీ. చదువుతూనే ఫైనలియర్‌లో తన మేనమామ కూతురుని మేడే నాడు ఆ కాలేజి ప్రిన్సిపాల్ నాగయ్యగారి ఆధ్వర్యంలో పెళ్ళి చేసుకోవటం నాకు గుర్తు. ఆయన పంపిన పెళ్ళి కార్డు నా వద్ద చాలా కాలం వుండేది. ఆ తర్వాత ఉస్మానియాలో మొదట లాలో తర్వాత ఎమ్.ఎ. ఫిలాసఫీలో చేరి గోల్డ్‌మెడల్ సాధించటం, అది అమ్ముకొని రైలు ఛార్జీలకు ఖర్చుపెట్టి ఢిల్లీలోని జె.ఎన్.యు.లో చేరటం ఆ తర్వాత వామపక్ష ఉద్యమంలో చేరటం తెలుసు. ఒక పదేళ్ళు మా మధ్య సంబంధాలు లేకుండా పోయాయి.

ఆయన ఉద్యమం నుంచి బయటకు వచ్చి మొదట రాజేంద్రనగర్‌లో ఆ తర్వాత శంకరమఠంలో ఉన్నప్పటి నుంచి చనిపోయే వరకు తరచు కలుసుకొనేవాళ్ళం. మా జూనియర్ కాలేజి మిత్రులం తరచు మాట్లాడుకోవటం జరుగుతుండేది. ఆయనకు ఆస్తిపాస్తులు మొదట్లో పిత్రార్జితం పై తన హక్కుగా రావల్సిన సందర్భంలో చర్చించటం. ఆ తర్వాత తన వాటాను తమ్మునికి విక్రయించి కొంత మొత్తాన్ని తన బంధువుకి చ్చి కుటుంబపోషణకై వాడుకోవటం తెలుసు.

తర్వాత ఆయన మకాం మా ఇంటికి నాలుగిళ్ళవతల మార్చటం నిత్యం

కల్సుకొని సామాజిక సమస్యలు, రాజకీయాలు మాట్లాడుకోవటం తరచూ జరుగుతుండేది. నిత్యం ఆయన ఇల్లు పాత ఉద్యమ మిత్రులతో ఎప్పుడు కళకళలాడుతుండేది. ఎవరికి కావల్సింది వారు ఒండుకోవటం, తినటం, చర్చించటం రివాజు. అతను మిత ఆహారి. తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుండేవాడు. తన తమ్ముని పిల్లలను కూడా తన వద్దే వుంచుకొని ఐ.ఐ.ఎమ్., ఎన్.ఐ.టి.లలో సీటు వచ్చేలా వాళ్ళను ఉత్తేజం చేయటం నాకు తెలుసు. కాని ఆయనకు కుటుంబ పోషణ కష్టంగా వున్నప్పుడు ఆర్థిక వెసులుబాటుకు మిత్రుల సహాయం తీసుకుంటుండేవాడు. కాని తన చేయి తిప్పుకోగానే బాకీ తీర్చేసే నిజాయితి పరుడు. తను ప్రకృతి వైద్యంపై నమ్మకంతో తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసాడు. స్టంటు వేసుకున్న మందులు వాడేవాడు కాదు. చివరి దశలో తనే ఒక ఎన్‌జిఓను ఏర్పాటుచేసి మహబూబ్‌నగర్‌లో కార్యక్షేత్రాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు. చివర్లో ప్రభుత్వ గ్రాంటు ఆలస్యం కావటంతో అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొనేవాడు. తాను తరచు సెక్రటేరియట్‌కు వచ్చి సి.యమ్.ఓ. కార్యాలయంలో సంప్రదించినా సమస్య పరిష్కారం కాలేదు.

తను నమ్మిన విషయాన్ని కుండబద్దలు కొట్టడం, ప్రాణస్నేహితుడై తన నమ్మకాలను ఎక్కడా తాకట్టు పెట్టకుండా రాజీ లేకుండా చివరి వరకు జీవించాడు. కుటుంబ సమస్యలు ఆర్థిక సమస్యలు ఎదురైన నిబ్బరం కోల్పోకుండా తన దైన మార్గంలో పయనిస్తూ అర్థాంతరంగా 63 ఏళ్ళ వయస్సులో ప్రాణాలు కోల్పోవటం బాధాకరం. నేను ఒక మంచి మిత్రుడిని కోల్పోయాను. తన మరణానికి ముందే ఫోన్‌చేసి మన ఇంటర్‌లో మిత్రులమంతా కలుద్దామని చెప్పి, తాను మామధ్య లేకుండా పోయినందుకు బాధపడుతూ ఏమిత్రులమైతే కలుద్ధామన్నాడో వారంతా కలిసి ఆయనకు ఘనంగా నివాళులర్పించడం గత స్మృతులను నెమరువేసుకోని అతని యాదికి గుర్తుచేసుకున్నాం.

* * *

(డా. సుధాకరరెడ్డి, మోహన్‌రెడ్డి బాల్యస్నేహితుడు, క్లాస్‌మేట్. తెలంగాణాలో రాష్ట్రప్రభుత్వఉన్నత అధికారి.

సునిశిత మేధావి మోహనరెడ్డి

– కాంతి

కమ్యూనిస్టులకి విప్లవం లక్ష్యం కాదు, ఆదర్శం అసలే కాదు, మహా అయితే లక్ష్య సాధనలో ఒక శక్తివంతమైన పనిముట్టు. తరువాతి కాలంలో ఆ పనిముట్టు అడ్డం తిరిగి అసలు లక్ష్యానికి భిన్నంగా పెట్టుబడిదారీ విధానాన్ని కొత్తసీసాలో పాతసారాలా పునరుద్ధరించదు అన్న గ్యారంటీ కూడా రష్యా, చైనా విప్లవ అనుభవాల తరువాత లేదు. విప్లవం అనేది నిరంతరాయ ప్రక్రియగా కొనసాగాల్సిన అవసరాన్ని కూడా ఈ అనుభవం తెలియ జేసింది.

గ్లోబల్ కేపిటలిజం (సామ్రాజ్యవాద రూపలో ఉన్న కేపిటలిజం ఆధునిక దశలో జాతి పరిమితులను ఛేదించుకొని ఈ రకంగా రూపాంతరం చెందిందన్నది నాకు కనిపిస్తున్న దృశ్యం) సృష్టిస్తున్న విధ్వంసానికి అంతూ లేదు, పొందూ లేదు. కనిపించని ఈ అదృశ్య శక్తి అడుతున్న జగన్నాటకంలో పడి విలవిలలాడుతున్న వివిధ జాతుల ప్రజలకి విప్లవం అనివార్యం కావచ్చుకాని దాన్ని నివారించటంలో కేపిటలిజం సమర్ధవంతమైన కొత్త కొత్త ఎత్తుగడలను ఎంచుకుంటున్నది అన్నది కూడా నిజం.

కేపిటలిజం సృష్టిస్తున్న విధ్వంసాన్ని తమ మనుగడ కోసం ఎదిరిస్తున్న సమస్త పోరాటాలు, పోరాట రూపాలు ఆహ్వానించ దగ్గవే. రైతులు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, పర్యావరణవాదులు వివిధ రూపాల్లో సాగిస్తున్న పోరాటాలు ఎంత పరిమితుల్లోనైనా గ్లోబల్ కేపిటలిజాన్ని ఎదిరిస్తున్నాయి. నిజానికి ప్రస్తుతం ఈ పోరాటాలే కేపిటలిజానికి బలమైన సవాల్‌ని విసురుతున్నాయి.

ఈ నేపథ్యంలో వ్యవసాయంలో గ్లోబల్ కేపిటల్ అనుసరిస్తున్న దోపిడీ

విధానాలకు, పర్యావరణ విధ్వంసానికి వ్యతిరేకంగా రైతులకు పర్యావరణానికి ఉపయోగపడే దేశీయ సాంకేతికతని అభివృద్ధిచేసి, ప్రచారం చేసి, అమలు చేయటానికి పూనుకున్న మోహన్‌రెడ్డి లాంటి వారి కృషి కూడా తీసి వేయదగ్గది కాదు ఏదో ఒక స్థాయిలో గ్లోబల్ కేపిటల్‌ని ఎదరిస్తున్న కృషే అది.

మోహన్‌రెడ్డితో నా పరిచయం ఎలా, ఎప్పుడు జరిగిందో నాకు గుర్తు లేదు. కాని, తరువాత కాలంలో అది దాదాపు నిరంతరాయంగా కొనసాగింది. 'ఎదురీత' పత్రిక టీమ్‌లో భాగంగా ఉన్న నేను మోహన్, శశిలు విజయవాడలో గిరిపురం ఏరియాలో ఒక చిన్న గదిలో ఉండేటప్పుడు తరచూ కలుసుకునేవాడిని. 'ఎదురీత' కోసం తను రాసిన వ్యాసాలను కలెక్ట్ చేసుకోవాడానికో లేదా త్వరగా రాయమని అభ్యర్థించటానికో మా కలయిక జరిగేది. కలిసిన ప్రతిసారీ భోజనం చేయందే వెళ్ళనిచ్చే వాళ్ళుకాదు మోహన్, శశి వారు పెట్టే ఆవకాయ, భోజనం నాకైతే అమృతంలాగే అనిపించేది.

అద్భుతమైన శైలితో సునిశితంగా, గాఢమైన పరిశీలనతో, పదునైన విశ్లేషణతో మోహన్‌రెడ్డి రాసే వ్యాసాలకు ఎదురీత పాఠకుల నుండి మంచి స్పందన వుండేది. అటువంటి వ్యాసాలను తరచూ ప్రచురించమనే డిమాండ్ కూడా వుండేది. నేనైతే ఆర్థిక రంగంపై మోహన్ రాసే ఎదురీత వ్యాసాల కోసం చకోర పక్షిలా ఎదురు చూసేవాడిని. మనల్ని ఇట్టే ఆకట్టుకునే మోహన్‌శైలి చాలా అరుదు. సునిశితమైన మేధస్సు, సునిశితమైన శైలి అతనిది.

మోహన్ చాలా కాలం వృత్తి విప్లవకారుడిగా పనిచేశాక ప్రవృత్తి, ఏమైనా జీవనం కోసం ఏదో ఒక పని చేయాల్సిన పరిస్థితి వచ్చింది. విప్లవ స్వాప్ని కతలో మునిగి తేలిన మోహన్ తాను చేసే పనిని ఎంచుకోవటంలోనూ ఆ పని చేసే పద్ధతిలోనూ అంతే స్వాప్నికతని ప్రదర్శించాడు.

నిజాయితీ, చిత్తశుద్ధి, నిర్మోహమాటం, ముక్కుసూటితనం, మనుషులని అమితంగా అభిమానించే తత్వం ఇతన్ని తెలంగాన గ్రామీణ రైతుబిడ్డ లక్షణాలవ్వవచ్చుగాని వాటిని పట్టణ జీవితంలోనూ వదలకుండా మోహన్

నెట్టుకొచ్చాడు. ఎన్ని ఇబ్బందులెదురయినా ఈ లక్షణాలని వదలకపోవటం ఆశ్చర్యమే.

దోపిడీ, పీడనలు సార్వజనీనమైనప్పటికీ ఆ కారణంగా ఉద్భవించే దుర్భరత నుండి కుటుంబసభ్యులను కవచంలా కాపాడాల్సిన బాధ్యత కుటుంబ పెద్ద నెత్తిన పెడుతుంది పిత్రుస్వామ్యం. దీని గురించిన ఎరుకతోనో లేక ఎరుక లేకనో తల్లిదండ్రులందరూ చేసేది ఈ నిరంతర పోరాటమే. ప్రత్యేకించి మధ్యతరగతి తల్లిదండ్రులు, ఎవరైతే తమ శక్తియుకులన్నింటినీ ఈ పనికోసం వెచ్చించి తపన పడుతూ పనిచేస్తారో వారు ఈ 'బాధ్యత' ని మెరుగ్గా చేయగలుగుతారు, సరిగ్గా ఈ కారణంగానే పిల్లలు వారు తమ శక్తియుక్తులన్నిటినీ తమ కోసమే వినియోగించాలని కాన్షియస్‌గానో, అన్‌కాన్షియస్‌గానో కోరుకుంటారు. ఇక్కడొచ్చే చిక్కేమిటంటే సామాజిక స్పృహ ఉన్న తల్లితండ్రులో లేక తల్లో/తండ్రో తమ శక్తి సామర్థ్యాలన్నింటినీ కేవలం ఈ ఒక్కపనికోసం మాత్రమే వెచ్చించడానికి విముఖతని సహజంగానే ప్రదర్శిస్తారు. మెజారిటీ సమయాన్నో లేక కనీసం కొంత సమయాన్నో ఉద్యమ అవసరాలకో, సామాజికంగా ఉపయోగపడే కార్యక్రమాలలో వినియోగించే ప్రయత్నం చేస్తారు.

కేవలం కుటుంబానికే పరిమితమవ్వడంలో సంకుచితత్వాన్ని చూస్తారు. సరిగ్గా ఈ కారణం రీత్యానే పిల్లల నుండి తగినంత నిరసనని / విముఖతని ఎదుర్కొంటారు. బహుశా మోహన్ దీనికి అతీతుడేం కాకపోవచ్చు. అని మోహన్ మాటలద్వారా నాకు అనిపించేది, (ఈ విషయంలో పిల్లలదీ తప్పుకాకపోవచ్చు. దుర్భరమైన బతుకుల నుండి తమకున్న అంతంత మాత్రపు రక్షణ కూడా తమకు దక్కకుండా పోతుందని వారు భావించడాన్ని ఎవరైనా ఎలా తప్పుపడతారు?)

ఈ రకమైన పరిస్థితి బహుశా ఉద్యమాల కోసం పూర్తిగా / పాక్షికంగా పనిచేసే మిత్రులందరికీ సార్వజనీనమైనది కావచ్చు. (కొన్ని కుటుంబాలు దీనికి మినహాయింపుగాను ఉండవచ్చు). వినిమయ సంస్కృతి పునాదులపై వీరు చేస్తున్న దాడికి బదులుగా చిద్విలాసంగా అది తీర్చుకునే కక్ష కాబోలు ఈ పరిస్థితి.

స్త్రీ, పురుష సంబంధాలలో, పిల్లలతో తన సంబంధంలో మోహన్ ప్రజాస్వామికంగానే వ్యవహరించాడు. పితృస్వామిక ఆధారిటీ నుండి అదిరించి, బెదిరించి 'విప్లవకరంగా' ఉంచే ప్రయత్నం నుండి చాలా దూరంగా ఉంటూనే పిల్లలతో ప్రజాస్వామిక వాతావరణంలో చర్చించే ప్రయత్నం చేస్తూ ఉండేవాడు. చుక్కని, బంధుని చూసినప్పుడూ వారితో మాట్లాడినప్పుడు ఆ ప్రయత్న ఫలితం మనకి కనిపిస్తూనే ఉంటుంది.

మోహన్ రాజకీయ జీవితం గురించి తమకు పూర్తిగా తెలియదని తెలిసిందీ బహుశా తక్కువేనని అతని మరణం తర్వాత మోహన్ మిత్రులు జరిపిన సభ ద్వారా వివిధ సందర్భాలలో ఆ మిత్రులతో జరిగిన ఇంటరాక్షన్ ద్వారా మోహన్ రాజకీయ జీవితానికి సంబంధించిన యాక్టివ్ పార్శ్వాన్ని తాము కనుగొన్నా మని చుక్క, బంధులు అభిప్రాయ పడటం ద్వారా మిత్రులుగా మేం చేసిన మోహన్ సంస్మరణ వృధా అయితే కాలేదని అనిపించింది. మేం అచ్చు వేసే ఈ పుస్తకం దానికి మరింత దోహదం చేస్తుందని ఆశిస్తున్నాం.

బ్రాహ్మణీయ ఫాసిస్టు శక్తులు రెండోసారి కూడా అధికారంలోకి వచ్చినప్పుడు మోహన్ మరలా గుర్తుకు వచ్చాడు. నేనైతే అన్ని వర్గాలపై అత్యంత విస్తృతంగా మోడీ ప్రభుత్వం అమలు చేసిన అణచివేత వలన రెండవసారి అది అధికారం చేపట్టగలగడం సాధ్యంకాదు అని నమ్మాను. కాని మోహన్ గతంలో "Modi is going to be here for the second term too" అన్నటే మోడీ తిరిగి వచ్చాడు. ఏ ప్రమాణాల నుండి విశ్లేషించి ఈ నిర్ణయానికి మోహన్ వచ్చాడో స్పష్టంగా తెలియనప్పటికీ ఈ సునిశితదృష్టి మోహన్‌కి మాత్రమే సాధ్యమనిపించింది. అలాంటి మిత్రుడు మన మధ్యలేనందుకు కలవరమోతుంది.

(కాంతి, విప్లవ కమ్యూనిస్టు ఉద్యమంలో 15 ఏళ్ళు పనిచేసాడు. 'ఏదురీత' మాసపత్రికను వెలువరించిన బృందంలో సభ్యుడు.)

మోహన్‌రెడ్డి ..... పక్కాలోకల్

– డి. రాధాకృష్ణమూర్తి

ఆ మధ్య ఉస్మానియా యూనివర్సిటిలో, తెలంగాణ జలవనరుల మీద ఒక చర్చా కార్యక్రమం జరుపుతూ, నన్నుకూడా వస్తావా అని అడిగాడు మోహనరెడ్డి. నేను వేరే పనిలో ఉన్నాను రాలేనుగాని, దీనిమీద ఆసక్తి అన్న ఇద్దరు హైదరాబాద్ మిత్రుల్ని పంపిస్తానని చెప్పాను. ఆ మిత్రులకు కూడా తెలియజెప్పాను. వాళ్ళు వెంటనే నన్నడిగింది ఏమంటే ఎక్కడికి వెళ్ళాలి, మోహన్‌రెడ్డి అనే ఆయన్ను గుర్తుపట్టడం ఎలా అని అడిగారు. అప్పుడు నేను వారికి చెప్పిన సమాధానం ఏమంటే, మీరు ఫలానా బిల్డింగ్ దగ్గరకెళ్ళి ఆ చుట్టు పక్కల చెట్ల క్రింద పక్కా పల్లెటూరి ఆహార్యంలో ఓ లుంగీ కట్టి, ఆ చెట్ల క్రింద ఎవరైతే మిత్రులతో చర్చలు జరుపుతూ వుంటాడో ఆయనే మెహనరెడ్డి అని చెప్పాను. ఆ ఆనవాళ్ళతో వారు కరెక్టుగా ఆయన ముందుకే వెళ్ళి పరిచయం చేసుకోగలిగారు. అలా మోహనరెడ్డి ఎక్కడున్నా పక్కా లోకల్ ముద్రతో లోకల్ భాష (బూతులు కూడా కలిపి) మాట్లాడుతూ, నవ్వే కళ్ళు బోల్డ్‌గా గుక్కపట్టి నవ్వే నవ్వు మొదలైన సంకేతాలు మనకు మోహనరెడ్డి బాహ్యరూపాన్ని పట్టిస్తాయి.

ఇక భావజాలపరంగా చూసుకుంటే అప్పటికే జె.ఎన్.యు. నుంచి వచ్చి నాగార్జునా యూనివర్సిటీలో సుబ్రహ్మణ్యం ఇంట్లో పరిచయమైన మెహనరెడ్డి అప్పుడప్పుడు చర్చించే, తెలుగు జాతి విముక్తి పోరాటం వంటి భావజాల ఆలోచనలను పెద్దగా అందుకునే వయసూ కాదు, అనుభవమూ లేదు నాకు. అయితే అతను ప్రకటించే కార్యాచరణ ప్లానుల గురించి ఒకింత ఆశ్చర్యంగాను, మరొకింత అనుమానంగాను వింటూ వుండేవాడ్ని. ఎందుకంటే అవన్నీ చాలా

రొమాంటిక్‌గా, ఉద్వేగభరితంగా ఉండేవి. ఇవన్నీ ఆచరణ సాధ్యమేనా అనిపిస్తుండేది నా బోటి వాండ్లకు.

మోహన్‌రెడ్డిలో కనిపించే మరికొన్ని విషయాలేమంటే, ఎప్పుడూ సీరియస్‌గా ఆలోచిస్తూ (నేలను చూస్తూ వుండడం) మనం చెప్పే చాలా విషయాల్ని లైట్‌గా తీసుకోవడం తన దగ్గరకు వచ్చిన వారిని అనుమానించకుండా నమ్మడం.

తరువాత మోహనరెడ్డి, సుబ్రహమణ్యంల వివాహం తరువాత మోహనరెడ్డి దంపతులు అనంతపురం జిల్లాలో ఏవో ఉద్యమాలు నడపడం, తరువాత వాటిని విరమించి హైదరాబాదుకు చేరడం, అక్కడ ఎన్.జి.వోలతో కలసి పనిచేయడం ఇవన్నీ మా పరోక్షంలో వేగంగా జరిగిన పరిణామాలు.

అయితే తను ఎన్.జి.వోలతో కలసి పనిచేస్తున్నాడని తెలిసినపుడు కూడా నేను పెద్దగా ఏమీ ఆశ్చర్యపోలేదు. ఎందుచేతనంటే అంతకు ముందటి అతని రొమాంటిక్ ఎడ్జ్‌కి ఇది కాంపన్సేషన్ అనిపించింది. అయితే మోహనరెడ్డి అక్కడ కూడా తనదైన ముద్రను వేశాడనే విన్నాను. ఆ పనిలోకూడా అతను తనకు ప్రత్యేకంగా ఆసక్తి గల వాస్తవ గ్రౌండ్ రియాలిటికే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చి డేటాను సేకరించేవాడని విన్నాను.

ఇక చివరిగా లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్‌గా మేము 2013లో విజయవాడలో ఉత్పత్తి విధానం మీద రెండు రోజులు డిబేటు జరిపాము. మోహనరెడ్డిని కావాలనే నేను దానికి పిలవలేదు. అయితే ఆ మీటింగ్‌కి కొద్ది రోజుల ముందు నాకు ఫోను చేసి తనదే అయిన ప్రత్యేక నవ్వుతో ఏం రాధా? నేను లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో (ఉమ్మడి ఏ.పి.లో) ఉత్పత్తి విధానం మీద డిబేటా? అని అడిగాడు. మోహన్ నీ పట్ల నాకు భయం ఉంది; అక్కడ అందర్ని తిడుతూ నేటివ్ భాషలో మాట్లాడతావేమో, మీటింగ్ సాఫీగా జరగదేమోనని భయపడ్డానని నిర్మోహమాటంగా చెప్పాను. అలా జరగదులే నేను కూడా వస్తానని చెప్పి వచ్చి రెండు రోజులూ శ్రద్ధగా పాల్గొని చివరిరోజు తన అభిప్రాయాన్ని కూడా సభికులతో

పంచుకున్నాడు. ఆ విధంగా చాలాకాలం తర్వాత రెండు రోజులపాటు కలసి ఉన్నాము.

అందరికి మల్లేనే నాకు కూడా మోహనరెడ్డి హఠాన్మరణం ఆశ్చర్యాన్ని, బాధను కలిగించింది. అయితే అతని జ్ఞాపకాలు కూడా సజీవంగా ఉండేవే.

చివరిగా మోహనరెడ్డి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలుపు కుంటున్నాను.

మోహన్‌రెడ్డి స్మారక ఉపన్యాసాలు జరపడమేకాక, అతని పేర ఓ ప్రత్యేక సంచిక తెచ్చే ప్రయత్నం చేస్తున్న మిత్రులకు అభినందనలు.

(డి.రాధాకృష్ణమూర్తి గుంటూరు నుండి పనిచేసే లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ వ్యవస్థాపకుడు, మోహనరెడ్డి స్నేహితుడు.)

సామాజికోత్తముడు

- వెంకట్‌రెడ్డి

విస్సవరపు వీరుడా
విరామమెరుగని యోధుడా
రాజ్యంతో రాజీపడక
విప్లవంతో వియ్యమందాలని
అలుపెరుగని పోరాటాలను
ఆజన్మాంతం ఆచరించావు

కులజాడ్యం మతమౌఢ్యం
మానవత్వానికి మైలపుమరకలని
మాలమ్మాయిని మనువాడినావు
మానవాళికిది మార్గమన్నావు

అంతర్జాతీయ విప్లవాలకు
ఆలవాలమైన ఆత్మకూరులో
మధుసూదన మార్గమెంచుకుని
మొదటిస్థానంలో నిలిచిన
మోహనరెడ్డీ ఇవే మా
విప్లవ జోహార్లు

పోరాటాల పురిటిగడ్డ సూర్యాపేట తాలూకా ఆత్మకూరు వాసి విస్సవరపు మోహనరెడ్డి, సామాజిక విప్లవాల విధాతగా వినతికెక్కిన మహామనీషి అని

చెప్పవచ్చును. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలను నిర్మించాడు. విద్యార్థిగా వున్నప్పుడే కోదాడ కళాశాలలో విద్యార్థులను సమీకరించి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడాడు. నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎన్.ఎమ్.ఆర్. కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయించటానికి పెద్ద పోరాటాన్నే నడిపాడు. రాయలసీమలో వ్యాపారస్తుల తప్పుడు తూకాలతో మోసపోతున్న ప్రజలను కూడగట్టి 'తెలుగు దండు' పేరుతో పోరాటం చేయించి, ప్రభుత్వం కళ్ళు తెరిపించి ప్రజలకు న్యాయం చేయించాడు.

అదేవిధంగా నాగార్జున సాగర్‌లో అణువిద్యుత్ కేంద్రాన్ని స్థాపించాలనుకున్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని నల్లగొండ జిల్లా ప్రజలచేత పోరాటం చేయించాడు. అనేకమంది మేధావులు, ప్రజా సంఘాలు కూడా అణువిద్యుత్ కేంద్ర ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఉద్యమించారు. మోమన్ అన్న నాయకత్వంలో జరిగిన పోరాటంలో నేను కూడా పాల్గొన్నాను. ఈ పోరాటాన్ని నిర్మించేందుకు అన్న రాయలసీమ నుండి నల్గగొండకు వచ్చి నెలలపాటు వున్నాడు. ఈ పోరాటం ఫలితంగా ప్రభుత్వం ఆ ప్రతిపాదనను విరమించుకోవటంలో ప్రజలు విజయం సాధించారు.

సామాజికంగా గొప్ప ఉత్తమమైన ఆలోచనలు కలిగిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్ళటానికి మనవంతుగా ప్రయత్నించాలని కోరుతూ వారికివే నా జోహార్లు.

(వెంకట్‌రెడ్డి ఆనాటి సి.ఆర్.సి; సి.పి.ఐ. (ఎమ్-ఎల్) సానుభూతిపరుడు, మోహన్‌రెడ్డి అభిమాని)

గురువు, మార్గదర్శకుడు, స్నేహితుడు

-శ్రేణి

మోహన్‌రెడ్డి అంకుల్‌తో నా పరిచయం మా నాన్నగారి ద్వారా ఏర్పడింది. మొట్టమొదట ఆయన్ను నేను 7వ తరగతిలో ఉన్నప్పుడు కలిసాను. అప్పుడు ఆయన నన్ను ఒక ప్రశ్న అడిగారు, "నువ్వు ఎవరు" అని, అందరిలాగానే నాపేరు శ్రేణి. నేను యాదగిరిరెడ్డిగారి కూతుర్ని, నేను మనిషిని అంటూ సమాధానం ఇచ్చాను. ఆయన నేను చెప్పినవేవి అసలైన సమాధానాలుగా భావించలేదు. తిరిగి ఇలా చెప్పారు. నువ్వు ఎవరు అనేది నీపేరుతో, మీ నాన్నగారి పేరుతో లేక నువ్వు చదివే చదువుతోనే గుర్తించబడవు నువ్వు సమాజం కోసం చేసే పనులవల్ల నువ్వు గుర్తించబడతావు, పుట్టిన తరువాత పదిమంది నిన్ను గుర్తుంచుకునేలా ఏదైనా గొప్పగా చేయాలి అని చెప్పారు. మా నాన్నగారి తరువాత జీవితం గురించి నాతో మాట్లాడిన వ్యక్తి ఆయనే. ఆయన చెప్పిన విషయాన్ని నేను ఎప్పటికీ మర్చిపోను.

నా పై చదువుల కోసం మేము హైదరాబాదు వచ్చాం. ఆ తరువాత ఆయన చాలాసార్లు మా నివాసానికి వచ్చారు. వచ్చిన ప్రతిసారి ఆయన నాతో ఒక విషయం గురించి ఎక్కువ మాట్లాడేవారు. "ఈ సమాజంలో స్త్రీలు ఎలాంటి అన్యాయాలకు గురవుతున్నారు. ఎటువంటి ఆరాచకాలను భరిస్తున్నారు. మగ దురహంకార సమాజంలో వాళ్ళచేతుల్లో బలి పశువులుగా ఎలా మారుతున్నారు, వాటిని ఎదుర్కోడానికి ఒక స్త్రీగా, ఎంతటివారినైనా ఎదురుకోగలిగే సత్తా ఉండాలని, ఎంతటి పనినైనా సాధించగలగాలని, ఒకరిమీద ఆధారపడకుండా తన కాళ్ళమీద తాను నిల్చోవాలని, అందుకు ప్రతి ఒక్కరూ, చదువుకోవాలని,

ఉన్నత శిఖరాలను చేరుకోవాలని పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ఎదగాలని చెప్పేవారు. వచ్చిన ప్రతిసారి ఆయన స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించేవారు. స్త్రీలు ఉన్నతమైన చదువులు చదవాలి అని చెప్పేవారు. స్త్రీల పట్ల ఆయన ఎంతో బాధ్యతగా, గౌరవంగా ప్రవర్తించేవారు.

ఆయన ఎక్కువగా మాట్లాడే అంశం 'కులనిర్మూలన'. ఆయన ఒక విషయం చెప్పేవారు. వ్యక్తి చేసిన పనులవల్ల అతని ఔన్నత్యం తెలుస్తుంది. కానీ, అతను పుట్టిన కులం వల్ల కాదు అని. కులమత భేదాలు ఉండకూడదని, అందరూ కలసిమెలసి ఉండాలి, ప్రతి వ్యక్తిని గౌరవించాలి అని చెప్పేవారు. కులాంతర వివాహాలు చేసుకోవడంలో తప్పులేదని, స్త్రీలకు తమకు నచ్చిన భాగస్వామిని ఎంచుకొనే స్వాతంత్ర్యం ఉండాలని, స్త్రీ స్వేచ్ఛగా జీవించాలని, ఎట్టి పరిస్థితుల్లో తన స్వాతంత్ర్యాన్ని కోల్పోకూడదని ఖచ్చితంగా చెప్పేవారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లల్ని ఈ భావాలతో పెంచాలనేవారు.

మోహన్‌రెడ్డి అంకుల్ నాస్తికులు. ఆయన ఒక మాట ఎప్పుడూ చెప్పేవారు. జనం, మనం అనుభవించే ప్రతి కర్మ మనం పూర్వజన్మలో చేసిన పాపాలవల్ల అని, అన్నీ దేవుడే శాసిస్తాడు అంటుంటారు. అది ఎంతమాత్రం నిజం కాదని పూర్వజన్మలు, కర్మలు లేవని మనం అనుభవిస్తున్న కష్టసుఖాలన్నిటికి కారణం ఈ సమాజం, సమాజంలో ఒకరైన మనం, మనం చేసే పనులవలనే అని బలంగా చెప్పేవారు. ఆయన, జీవితం గురించి నేర్పిన పాఠాలు ఇవి.

అయితే ఆయన నాతో సరదాగా కూడా మాట్లాడేవారండోచ్. ఆయన ఉదయాన్నే ఒక పెద్ద కప్పు టీ తాగుతారు అని మా నాన్నగారు చెప్పారు. ఒకసారి ఆయన మా ఇంటికి వచ్చినప్పుడు టీ చేసి ఇచ్చాను. అది ఆయనకు నచ్చలేదు. మరుసటిరోజు ఉదయం అదే పద్ధతిలో టీ చేస్తుండగా వంటగదిలోకి వచ్చి ఏంటి? టీ పెట్టమంటే వంట వండుతున్నావ్ అని వ్యంగ్యంగా అన్నారు. (టీలో అల్లం దంచి వేస్తున్నారని వంట అన్నారు.) తరువాత ఆయన టీ చేసే పద్ధతి చెప్పి ఆయనకు నచ్చినట్టు చేయించుకొని తాగారు. ఉదయాన్నే ఆ టీ

తాగుతూ నాతో అనేక విషయాలు ఒక గంటసేపు చర్చించేవారు. చదువు గురించి, సమాజం గురించి తన పిల్లల గురించి, ముఖ్యంగా బంధు చేసే సరదా పనుల గురించి ఎక్కువ చెప్పేవారు.

ఆయన ఒక పుస్తకాల పురుగు. కలిసిన ప్రతిసారి నన్ను ఏ పుస్తకం చదివావు, ఇది చదివావా, అది చదివావా అని అడిగేవారు. నేను లేదు అని చెప్పేదాన్ని. దానికి బదులుగా ఆయన ఒక మాట అన్నారు.! నన్ను ఎవరైనా మూర్ఖుడు ఎవరూ అని అడిగితే "కన్యాశ్కులం" చదివాడా అని అడుగుతాను. చదవలేదు అంటే మూర్ఖుడు అంటాను, అని గట్టిగా నవ్వారు. ఆ మాట విని మరుసటి రోజే ఆ పుస్తకం కొని చదవడం మొదలు పెట్టాను. అలానే Rich Dad & Poor Dad పుస్తకాన్ని కూడా చదవమని చెప్పారు.

ఆయన కన్యాశుల్కం, గురజాడ రాసిన చాలా గొప్పరచన అని ఆపుస్తకం వ్రాసింది 1892లో అయినా ఇప్పుడు వ్రాసినట్టే ఉంటుంది అనేవారు. అంటే బ్రాహ్మణులు ఆ కాలంలోనే ఎంతో ముందుకొచ్చారని అనేవారు. ఆ నాటకంలో ఒక వాక్యం, "వెంకు పంతులుగారి కోడలికి లవ్ లెటర్ ఇచ్చినందుకు కనిపెట్టి ఎప్పుడో ఒకప్పుడు దేహశుద్ధి చేస్తారు" చెప్పి చాలా గట్టిగా నవ్వారు. ఆ పుస్తకంలోని భావజాలం, దాని ప్రత్యేకత గురించి వివరించారు.

ఒకరోజు మా ఇంట్లో ఆవకాయ పచ్చడి చూసారట. మరుసటి రోజు భిక్షాందేహి   అంటూ ఇంటికి వచ్చారు. నాకేమి అర్థం కాలేదు. తరువాత చెప్పారు పచ్చడి చూడగానే మా నాయనమ్మ గుర్తుకొచ్చింది, నాకు పచ్చడి తినాలనుంది, అందుకే భిక్షాందేహి అంటున్నాను అన్నారు. నేను నవ్వుతూ జాడీ నుంచి పచ్చడి తీసి ఇచ్చాను. అదే నేను ఆయన్ను ఆఖరిసారి చూడటం.

2017 ఆగస్టు మొదటి వారంలో ఆయన మూడురోజులు మా ఇంటికి వచ్చారు. 3వ రోజు ఆయనతో ఆరోగ్యం గురించి చర్చ వచ్చింది. అప్పుడు నేను ఆరోగ్యం జాగ్రత్త అని చెప్పాను. దానికి ఆయన "నాకు చావు అంటే భయం లేదు, అయినా నేను 5 సంవత్సరాలు బ్రతుకుతాను, నాకేమికాదు. ఒకవేళ

ఇప్పుడు నాకు చావు వచ్చినా వెళ్ళడానికి నేను సిద్ధమే" అన్నారు. అలా అన్న మరుసటి వారంలోనే ఆయన తిరిగిరాని లోకాలకు వెళ్ళడం చాలా బాధాకరమైన విషయం. ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినందుకు బాధగా ఉన్నా ఆయన చూపించిన మార్గాన్ని ఎల్లప్పుడూ అనుసరిస్తూ, నేను సాధించిన ప్రతి గెలుపులో ఆయన్ని తలచుకుంటూనే ఉంటాను.

ఒక గురువుగా, ఒక మార్గదర్శకుడిగా, ఒక స్నేహితుడిగా, ఒక తండ్రిగా నాకు ఎన్నో విషయాలు తెలియచేశారు. ప్రతి తల్లిదండ్రులకు ఇలాంటి ఆలోచనలుంటే తమ పిల్లలు సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదుగుతారు. ఇటువంటి గొప్ప వ్యక్తితో పరిచయం ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నాను. అందుకు కారణమైన మా నాన్న యాదగిరిరెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

"You can live once, but if you do it right, one is enough"

(శ్రేణి, మోహన్‌రెడ్డి స్నేహితుడు యాదగిరిరెడ్డి కూతురు, సి.ఎ. చదువుతోంది.)

నాన్న

- చుక్క

నాన్న గురించి చెప్పాలని, లేదా రాయాలని అనుకున్నప్పుడు ఎన్నో జ్ఞాపకాలు మనసునిండా ముసురుతున్నాయి. కానీ నన్ను పెంచిన తీరు గురించి రాస్తే, నాతో ఉన్న అనుబంధం గురించి రాస్తే బాగుంటుంది ఇక్కడ.

నాన్న పార్టీలో ఉన్నప్పుడు నేను పుట్టాను, చివరాఖరి రోజుల్లో. మొదట్లో అమ్మమ్మ వాళ్ళింట పెరిగాను. ఊహ తెలిసినప్పటి నుంచి నాన్న ఏదో ఒకటి నాకు నేర్పడంలో నిమగ్నమైపోయాడని మాత్రం గుర్తుంది. అక్షరమాలలు నేర్పడం దగ్గర్నుంచి సైన్సు పాఠాల వరకూ ఆయనదొక వినూత్నశైలి. ఇక్కడ కొన్ని ఉదాహరణలు చెబుతాను. 'Germination of a Seed' (గింజ మొలకెత్తడం) అనే పాఠం నాకు వివరిస్తున్నప్పుడు ఇంకా బాగా అర్థం అవ్వాలని, శెనగ విత్తనాలను నానబెట్టి, ఒక చిన్న కుండీలో వాటిని నాటి, రోజూ అవి కొద్ది కొద్దిగా పెరుగుతూ ఉంటే, నాచేత నీళ్ళు పోయించేవారు. మొక్కల దగ్గర్నుంచి ప్రతి జీవికి కూడా మట్టి నుండి ఆహారం తయారవుతుందని, అందుకే ఈ భూమిని జాగ్రత్తగా కాపాడాలని, అది ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన ఆ సందర్భంగా వివరించారు. 'Germination of a Seed' అనే అంశం ఎంత దూరం వెళ్ళి ఎన్ని విషయాలని నాకు నేర్పిందో చూడండి. అలాగే చింత పిక్కలు, రాళ్ళతో కూడికలు, తీసివేతలు, ఇలా ఎన్నో అంశాలు నేర్పించారు. చాలా సులభంగా అర్థమయ్యేవి మరుపునకు రాని విధానాలివి.

నేను ఒకటవ తరగతి చదువుతున్నప్పుడు ఒకసారి నన్ను కోఠి (హైదరాబాద్)లోని బుక్‌షాప్స్‌కి తీసుకెళ్ళారు. అక్కడ ఒకటే చోట అన్ని పుస్తకాల

షాపులుండటం నన్ను చాలా ఆశ్చర్యానికి గురిచేసింది. ఆయన అక్కడ నాకు సి.పి బ్రౌన్ డిక్షనరీ కొన్నారు. అప్పుడప్పుడే పదాలు, వాటి వాడకం నేర్చుకుంటున్నాను.

తెలుగు, ఇంగ్లీష్ అనర్గళంగా నాకు రావాలని, డిక్షనరీ ఎలా వాడాలో ఆరోజు నేర్పించారు. పుస్తకం చదువుతున్నప్పుడు ఏదైనా పదానికి అర్థం తెలియకపోతే ఇందులో చూసి తెలుసుకొని గుర్తుంచుకుంటే పదసంపద పెరుగుతుందని చెప్పారు. ఇంగ్లీష్, తెలుగు భాషలపట్ల ఆయనకి అమితమైన ప్రేమ ఉండేది. 'Moving Dictionary' అని ఆయన్ని మేము అంటుండేవాళ్ళం. 'Concept is the body and language is the dress', అని తరచుగా చెప్తుండేవారు. Concept ఎంత బాగా అర్థమైనా, దాన్ని మనం Present చేసే విధానం బాగాలేకపోతే అదంతా వృధా అయిపోతుందని, దానికి భాష చాలా ముఖ్యమని దాని భావం. అలాగే పత్రికల్లో చిన్న చిన్న కథలు నాచేత రాయించడం, అందులో ఉన్నవి నాకిచ్చి చదవమనడం చేసేవారు. అలాగ వార్తాపత్రికల పఠనం అలవాటుచేసారు. 'The Hindu' మాత్రం క్రమం తప్పకుండా వచ్చేది ఇంటికి. అలాగే ఒక తెలుగుపత్రిక, మరో బిజినెస్ పేపర్ కూడా వచ్చేది. వీటితో పాటు ఎన్నో మాగజైన్స్ కూడా. పర్యావరణానికి సంబంధించిన 'Down to Earth' అనే మేగజైన్ ఒకసారి నాచేతికిస్తూ, మనిషి తన స్వార్థం కోసం భూమిని, పర్యావరణాన్ని, సమస్త జంతుజాలాన్ని ఎలా నాశనం చేస్తున్నాడో ఇందులో ఉంది. చదివి నీ అభిప్రాయాన్ని చెప్పు" అన్నారు. అలాగే "Economic and Political Weekly'. వ్యాపార వర్గాలు, ప్రభుత్వం, పెట్టుబడిదారి వ్యవస్థ కలిసిపోయి వాళ్ళకి తగినట్లుగా ప్రభుత్వపాలన, చట్టాల రూపకల్పన ఎలా జరుగుతుందో, చాలామంది రచయితలు ఆ వీక్లీలో రాస్తారు. అలాగే ఫెమినిజమ్ గురించి, స్త్రీల హక్కుల గురించి ఎన్నో అంశాల గురించి నేను అందులోనే నేర్చుకున్నాను. ఈ వీక్లీలో చాలా అంశాలు నాకు వివరంగా చెప్తుండేవారాయన.

ఇంకొక చిన్న విషయం ప్రస్తావించాలి చరిత్ర అంటే చాలా ఇష్టం నాకు. పాఠ్య పుస్తకాల్లో రాజుల గురించి, వారి యుద్ధాల గురించి చిన్నప్పుడు చదివి, వారు చాలా గొప్పవారు అనుకునేదాన్ని. అదే విషయం నేను నాన్నతో అన్నప్పుడు

ఆయన పెద్దగా నవ్వి, అస్సలు కాదు, వీరు పీడించే వర్గానికి చెందిన వారు అని అన్నారు. నాకు అర్థం కాలేదు. వెంటనే మధురై తీసుకెళ్ళారు నన్ను. సరదాగా వెళ్తున్నాం అనుకున్నాను. అప్పటికి నేను నాలుగో తరగతి మాత్రమే. అక్కడ మీనాక్షి గుడికి వెళ్ళాం. చాలా పెద్ద గుడి . ఎటువైపు నుంచి చూసినా ఒకేలాగా కట్టినటువంటింది. అందులో మొత్తం నన్ను తిప్పి, గర్భగుడికి మాత్రం తీసుకెళ్ళలేదు. బయటకు వచ్చాక నీ అభిప్రాయమేంటి అని అడిగారు. నేను చాలా ఆనందంగా 'ఇంత పెద్ద బిల్డింగు కట్టారంటే ఎంత గొప్ప కదా' అన్నాను. పైగా 'చాలా అందంగా కట్టారు, చాలా తెలివిగా కట్టారు' అని అన్నాను. ఆయన మాత్రం బయట శిలాఫలకాల మీద ఆ రాజుపేరు, ఇతర వివరాలు చూపించారు. అప్పుడు చెప్పారు అసలు విషయం. రాజులు, రాజ్యంలో ఉండే ప్రజల్ని పన్నుల రూపంలో పీక్కుతిని ఇలాంటి అందమైన గుడులు, గృహాలు నిర్మించుకున్నారని. దైవం అబద్ధమని, సైన్సు తెలియని రోజుల్లో, ప్రకృతికి సంబంధించిన విచిత్రాలు అర్థంకాక, దేవుడని వాటికి వివరణ ఇచ్చుకున్నారని చెప్పారు. ఈ విషయాలన్ని మనసులో బలంగా నాటుకుపోయాయి.

చలం సాహిత్యం నుంచి రష్యా విప్లవం వరకూ, వ్యవసాయం నుంచి ఆర్థిక ప్రగతి వరకూ ఎన్నో వైవిధ్యమైన అంశాలు చాలా విపులీకరించి చెప్తుండేవారు. రాజకీయ విశ్లేషణ ఆయన చాలా బాగా చేసేవారు. తరచుగా ఇంట్లో ఆయన స్నేహితులతో నెరపిన సంభాషణలు వింటుండేవాళ్ళం.

స్త్రీ – పురుష సంబంధాల గురించి, స్త్రీల స్వాతంత్ర్యం గురించి నాన్నకు విస్పష్టమైన అభిప్రాయాలు వున్నాయి. ఈనాటి వివాహ వ్యవస్థను ఆయన తిరస్కరించారు. నచ్చిన వ్యక్తితో కలిసి బతకమని మాకు చెప్పారు. ఆ వ్యక్తితో సరిపడకపోతే, విడిపోయి మరోవ్యక్తిని ఎంచుకోమని చెప్పేవారు. స్త్రీలు ఆర్థికంగా స్వతంత్రంగా వుండాలని, భర్తమీద ఆధారపడటం అంటే చనిపోయినట్లేనని ఆయన అనేవారు. గుర్తుచేసుకొనేకొద్దీ ఎన్నెన్నో జ్ఞాపకాలు ఎంత చదివినా తరగని పుస్తకంలా. నాకు ఇంకా నెలల వయసున్నప్పుడే ఆయన రాసిన ఉత్తరం రూపంలో నాకు నేర్పించిన అనేకానేక విషయాల్లో, నా ఆలోచనల్లో, ఆయన వలన నేను చదివిన పుస్తకాల రూపంలో, కన్యాశుల్కం పుస్తకం రూపంలో ఇలా ఎన్నెన్నో

రూపాల్లో ఆయన సజీవమై ఉన్నారు.

ప్రపంచాన్ని చదవటం నేర్పించిన మనిషి ఆయన నా దృష్టిలో.

* * *

(చుక్క, మోహన్‌రెడ్డి పెద్దకూతురు. సి.ఎ. చదివి, ఒక చిన్నతరహా పరిశ్రమస్థాపించి, నడుపుతోంది.)



నాన్నతో చుక్క

మా నాన్న

– బంధు

నేను 1996లో పుట్టాను. అప్పటికే నాన్న, అమ్మ పార్టీ నుండి బయటకు వచ్చి హైదరాబాద్‌లో వుంటున్నారు. చుక్క నాకన్నా ఆరేడేళ్ళు పెద్దది. తను పార్టీలో వుండగానే పుట్టింది. బహుశా నేను చిన్నదాన్ని కావటం వల్లనేమో నాన్న చాలా గారాబం చేసేవాడు.

నాన్న నన్నెప్పుడూ అమ్మా అని పిలిచేవాడు. నాతో చిన్న పిల్లాడిలా వుండేవాడు నాన్న. తనమీద కమాండ్ కమాండ్ చేస్తున్న గొంతుతో ఎప్పుడూ మాట్లాడేదాన్ని. నాన్న దాన్ని చాలా ఎంజాయ్ చేసేవాడు.

చిన్నపిల్లగా వున్నప్పుడు నాన్నను నేనెప్పుడూ తోక(టైల్) అని పిలిచేదాన్ని. "డాడీ పడుకుందాం" అనేది ప్రతిరాత్రీ నేననే సాధారణ డైలాగ్. దీన్నెప్పుడూ నాన్న ఎగతాళి చేసేవాడు.

నా చిన్నతనం నుండి ప్రతిరాత్రి, మేం రాజకీయాలు, ఆర్థికశాస్త్రం, వ్యక్తిగత విషయాలు.... ఇంకా ఎన్నో మాట్లాడుకుంటూ వున్నప్పుడు నేను, నాన్న కాళ్ళు వత్తుతూ వుండేదాన్ని. ఇది రొటీన్‌గా జరుగుతూ వుండేది.

నేనెప్పుడూ బల్లులు అసహ్యంగా వున్నాయని తిడుతూ వుండేదాన్ని. నాన్నెప్పుడూ నా గురించి అవి కూడా అలాగే ఆలోచిస్తూ వుంటాయని అంటుండేవాడు. ప్రతి ప్రాణికీ జీవించే హక్కు సమానంగా వుందని, మరోప్రాణిని అసహ్యించుకునే హక్కు ఎవరికీ లేదని నాన్న చెప్పేవాడు.

మొక్కలంటే నాన్నకు చాలాప్రేమ. కృష్ణమోహన్* అంకుల్‌పేరు, ఒక మొక్కకు పెట్టాడు నాన్న. ఆమొక్క చాలా బాగా పెరిగేటట్లు ఆయన అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. అయితే కృష్ణమోహన్ అంకుల్ చనిపోయినరోజే ఆ మొక్క కూడా చనిపోయింది.

ఇంగ్లీష్‌తోపాటు తెలుగుకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని నాన్న అనేవాడు. ప్రతి వ్యక్తీ తన స్వంత అనుభవాల నుండి నేర్చుకోవాలని చెప్పేవాడు.

ప్రతి వ్యక్తికీ, ఆడా/మగా, తన జీవితంలో భాగస్వామని ఎంచుకునే స్వేచ్ఛ వుండాలని నాన్న ఎల్లప్పుడూ చెప్పేవాడు. పెళ్ళితంతునీ, ఫంక్షన్లనీ వ్యతిరేకించేవాడు. కలిసి జీవించలేని పరిస్థితి వస్తే, ఆ బంధాన్ని తెంచుకోవాలని, ఆ సందర్భంలో సమాజం నుండి వచ్చే వత్తిడులకి లొంగకూడదని చెప్పేవాడు.

ప్రతి రాత్రి నాన్న ముందే పడుకుని, తెల్లారగట్ల 4 గంటలకల్లా నిద్రలేచేవాడు. అప్పుడు కంప్యూటర్ ముందు కూర్చుని పని ప్రారంభించేవాడు. ఒక సెకను కూడా ఆయన వృధా చేయటం నేనెప్పుడూ చూడలేదు. అన్ని ఆరోగ్య సమస్యలున్నా ఆయన దగ్గర టన్నుల కొద్దీ శక్తి వుండేది.

నాన్న ఎప్పుడూ నా కోసం వార్తాపత్రికల్లో క్లిప్పింగ్స్ కట్‌చేసి భద్రపరచేవాడు. వార్తలు పట్టించుకొని వాళ్ళని ఫూల్స్ అనేవాడు. ఒకరోజు ఎన్.డిటి.వి.లో బర్ఖాదత్‌ను చూపించి నువ్వు కూడా జర్నలిస్టు కావాలని, అలా గొప్పగా ఎదగాలని చెప్పాడు. నాన్న చెప్పాడని కాదు కాని, రోజూ ఎన్.డి.టి.వి.లో బర్ఖాదత్ ను చూసి, జర్నలిజం చదవాలని అనుకున్నాను. ఎమ్.ఎ. (జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్స్) పూర్తిచేసాను.

You should shine bright in life. మీరు బలంగా వుండాలి నేను లేకపోయినా అనేవాడు. ఆయన నన్ను ఒక స్వతంత్ర మహిళగా పెంచాడు. నన్ను, నా స్వంత నిర్ణయాలు తీసుకొనిచ్చాడు. ఆయన వున్నప్పుడు విషయాలన్నీ స్పష్టంగా వుండేవి.

* * *

** కృష్ణమోహన్, మోహన్‌రెడ్డికి మంచిస్నేహితుడు, కామ్రేడ్. బ్యాంక్ ఉద్యోగం చేస్తూ ఆ రోజుల్లో సి.ఆర్.సి, సిపిఐ (ఎమ్.ఎల్) కార్యక్రమాలకు మద్దతిచ్చేవాడు.*

(బంధు, మోహన్‌రెడ్డి చిన్న కూతురు. ఎమ్.ఎ. (జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్స్) చదువుకుంది. మోహన్ కన్నుమూసాక ROSES స్వచ్ఛంద సంస్థ సెక్రటరీగా పనిచేస్తూ మహబూబ్‌నగర్‌జిల్లా వంగూరులోని వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ బాధ్యతలు నిర్వహిస్తోంది.)

నిరాడంబర మేధావి మోహన్

- శశికళ

తూర్పుగోదావరి జిల్లాలోని కోనసీమలో టేకిశెట్టిపాలెం మా ఊరు. మధ్యతరగతి దళిత కుటుంబం మాది. కమ్యూనిస్టు నేపథ్యం వుంది. మా నాన్న కమ్యూనిస్టు పార్టీలో పనిచేసాడు. మోహన్‌తో నా పెళ్ళి 1989లో జరిగింది. సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, మా కుటుంబానికి సన్నిహితుడైన భూపతినారాయణమూర్తిగారి ఆధ్వర్యంలో మల్కిపురంలో దండలపెళ్ళి జరిగింది. మోహన్ పెళ్ళితంతు లేకుండా కలిసి బతుకుదామని అన్నాడు. కాని మా వాళు ్ళ దండలు మార్చుకుంటే బావుంటుందన్నారు.

మోహన్ చాలా నిరాడంబరమైన వ్యక్తి. కుల, మతాలకు అతీతమైన వ్యక్తిత్వం తనది. మా పెళ్ళికి కొద్ది నెలల ముందు మాత్రమే మాకు పరిచయం విజయవాడ లయోలా కాలేజీలో పనిచేసే మా పిన్ని రుక్మిణి ద్వారా పెళ్ళి ప్రతిపాదన వచ్చింది. రుక్మిణికి మోహన్‌తోను, సుబ్రమణ్యంతోను బాగా పరిచయం. మాది కూడా కమ్యూనిస్టు కుటుంబం కావటంతో, మోహన్ పార్టీలో పనిచేస్తున్నాడని తెలిసి నేను పెళ్ళికి అంగీకరించాను.

పెళ్ళి ప్రతిపాదన చేసాక మోహన్, నన్ను కోరుకొండ వచ్చి కలిసాడు. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో మానాన్న టీచర్‌గా పనిచేసేవాడు. కోరుకొండ నుండి మోహన్, నన్ను విజయనగరంలో గురజాడ ఇంటికి తీసుకెళ్ళాడు. గురజాడ ఇంటిని మ్యూజియంగా మార్చారు. ఇల్లు, లైబ్రరీ, ఆయన వాడిన వస్తువులు అన్నీ చూసాము. మోహన్‌కి గురజాడ అంటే చాలా ఇష్టం. కన్యాశుల్కం ఎన్నిసార్లు చదివాడొలెక్కలేదు. ఒక వందసార్లు చదివి వుండవచ్చు. ఆ నాటకంలో ప్రతి పాత్ర, ప్రతి డైలాగ్ తనకు నాలుకపైనే వుండేవి. ఆ కాలంలో నాటుకుపోయిన

ఆచార వ్యవహారాలను వెలికితీసి, గొప్ప పాత్రలని గురజాడ సృష్టించాడని చెప్పేవాడు.

మొదటిసారి కలుసుకుని మాట్లాడుకున్నాక, మోహన్, ఇద్దరం కొంతకాలం ఒకరినొకరం అర్థం చేసుకున్నాక కలిసి వుందామని అన్నాడు. తిరిగి వెళ్ళాక వరసగా కార్డుమీద వుత్తరాలు రాసి పంపేవాడు. ఆ ఉత్తరాలు చూసి మా వాళు ్ళ నన్ను ఆటపట్టించేవాళ్ళు.

పెళ్ళి తర్వాత నేను మోహన్‌తో కలిసి రాయలసీమ వెళ్ళి ఉద్యమంలో పనిచేసాను. మోహన్ మనస్ఫూర్తిగా, అలుపెరగని మరమనిషిలా ఉద్యమంకోసం పనిచేయటం తెలుసు. హృదయపు లోతుల్లోనించి పేదరికాన్ని రూపుమాపాలని, విప్లవం తేవాలని దృఢ నిశ్చయంతో పనిచేసాడు. నాకు పరిచయమైన కొద్దికాలంలోనే తన పార్టీ జీవితం గురించి అర్థమైంది. కదిరిలో సారాకు వ్యతిరేకంగా ఉద్యమం చేసాం. ఆడవాళ్ళ అగచాట్లు, ఒక పూట తింటే, ఒక పూట లేక, మగవాళ్ళ కూలి మొత్తం సారాకు, గుడుంబాకు బలైపోవటం, ఇవన్ని సారా ఉద్యమానికి దారితీసాయి.

కదిరి ఉద్యమం వూపు అందుకుంటున్న క్రమంలో బాగా అరెస్టులు జరిగాయి. దాన్తో కామ్రేడ్స్ భయపడి ఉద్యమం నిదానంగా చేయాలనే నిర్ణయానికి వచ్చారు. అది మోహన్‌కు రుచించలేదు. కర్రవిరగదు, పాముచావదు అనే చందాన వుంటుందని అన్నాడు. ఆ సమయంలో తను ఆలోచనలతో గడిపిన రాత్రులెన్నో. అప్పటి డాక్యుమెంట్లు తయారుచేయటానికి బాగా రాయవలసివచ్చి తన కుడిభుజం బాగా నొప్పికి గురైంది. చివరికి ఆయన రాయలసీమ ప్రయాణం వెనక్కి తిరిగింది. మామూలు జీవనంలోకి రావటానికి చాలా సంవత్సరాలు పట్టింది.

మోహన్‌కి ఎన్నో పాతజ్ఞాపకాలు, ఎప్పుడూ వాళ్ళ తాతగారి గురించి ప్రస్తావించేవాడు. గురజాడ కన్యాశుల్కం గురించి ఎప్పుడూ మాట్లాడేవాడు. వ్యవసాయరంగంలో కొత్తతరహా, పాతదనం రెంటినీ బాగా స్టడీ చేసేవాడు. మొక్కలను పసిపాపాల్లాగ కాపాడేవాడు. ఒక మొక్కకు తన స్నేహితుడైన కృష్ణమోహన్ పేరు పెట్టుకున్నాడు. దాన్ని ఎంతో సున్నితంగా చూసుకునేవాడు.

తొందరపాటుతో కొన్ని నిర్ణయాలు తీసుకున్నా, కుటుంబంలో చిన్న కలహాలు వచ్చినా, తన అమాయకత్వమే పైచేయిగా నేను తీసుకునేదాన్ని. నాకు ఒకసారి ఆరోగ్యం బాగాలేకపోతే ఒక నెల అంతా, కొబ్బరినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చాడు. ఆ ఆప్యాయతను మర్చిపోలేను.

ఎక్కువ కాలం తన ఆలోచనలు రాజకీయ జీవితంపైనే వుండేవి. మిగిలిన విషయాలు అన్నిటికీ తన జీవితంలో అతి తక్కువ కాలం మాత్రమే వెచ్చించేవాడు. స్నేహితులతో చర్చలు, వాదోపవాదాలు, కరపత్రాలు రాయటం చేసేవాడు.

పిల్లలకు ఎప్పుడూ ధైర్యంగా, వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడాలని చెప్పేవాడు. ఎప్పుడూ వాళ్ళతో ప్రపంచ విషయాలు చర్చిస్తూ వుండేవాడు. అవన్నీ నేను వింటూ వుండేదాన్ని. ఇన్ని రకాల మేథోపరమైన విషయాలు ఎలా తెలుసని ఆశ్చర్యపోయేదాన్ని.

ఆ మేథోపరమైన చర్చలు ఆగిపోయిన నాడు నాకు అంతా నిశ్శబ్దంలా అనిపించింది.

(మోహన్‌రెడ్డితో జీవితాన్ని, ఉద్యమాన్ని పంచుకున్న సహచరి శశికళ)



మోహన్‌తో శశి


అందరివాడివి

– శశికళ

ఒక అగ్నిపర్వతం బ్రద్దలైంది.
ఆ లావాలో గడ్డ కట్టిన చిరుగడ్డినినేను
ఒక భయంకరమైన అల
ఆకాశాన్ని తాకి క్రింద నేలను ముద్దాడింది
కణ కణలాడే సూరీడు
ఈ రోజు ఎందుకో వెల వెలబోయాడు
స్తంభించిన ప్రకృతిలా,
మూగబోయిన వీణలా
చెలిమి కరువైన గువ్వ జంటలా
ప్రకృతి ఒడిలో ఒక పరుగులా
అలసి, సొలసిన గానం
కొమ్మ, రెమ్మ, మాను, మాకు
చెలియలి గట్టును తాకిన
గడ్డిపరక – ఆ నేస్తానికి
ప్రాణాలే
గలగల పారే సెలయేరు
కమ్మని పాటల కోయిలమ్మ
పచ్చ పచ్చని పైరు తల్లి
చిటపటలాడే వానతల్లి

ప్రకృతి, పాటలో ఒక గాయకుడివి.
నిరుపేద చెమటలో
ఒక జీవానివి –
సూర్య తేజకాంతిలో
కనిపించే బింబానివి
అందరివాడివి.

(మోహన్‌రెడ్డితో జీవితాన్ని, ఉద్యమాన్ని పంచుకున్న సహచరి శశికళ)



నాన్నతో బంధు

ఇది మోహన్‌రెడ్డి కథ. విశ్వవరం మోహనరెడ్డి మిత్రులు తమ జ్ఞాపకాలతో చెప్పిన జీవితకథ. 1954-2017 మధ్యకాలంలో తెలుగుసమాజంలో జీవించిన మోహన్‌రెడ్డి ఎవరు? ప్రజామేధావా? పర్యావరణవేత్తా? రాజకీయ అర్ధశాస్త్రవేత్తా? కమ్యూనిస్టు విప్లవకారుడా? బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆ అసాధారణ మేధావిలో ఇవన్నీ ఉన్నాయి.

మోహన్ తెలుగునాట విప్లవ విద్యార్థి ాద్యమవైతాళికులలో ఒకడు. రాష్ట్ర వ్యాపిత విప్లవ విద్యార్థి సంఘాలేవీ ఏర్పడకముందే కోదాడ కళాశాలలో చదువుకుంటూ తన మిత్రులతో కలిసి పి.ఎస్.యు. ని ఏర్పాటుచేసి విప్లవవిద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాడు.

భారత ఉపఖండం ఒక నయా వలస అని, సామ్రాజ్యవాదానికీ, వివిధ జాతులకు మధ్యవున్న వైరుధ్యమే ఇక్కడ ప్రధాన వైరుధ్యమని సూత్రీకరించాడు. సామ్రాజ్యవాద వ్యతిరేక కులనిర్మూలనా జాతి విముక్తి పోరాటాన్ని కార్మికవర్గం నాయకత్వంలో నిర్మించాలని ప్రతిపాదించాడు.

విప్లవం ప్రజల జన్మహక్కని చాటాడు. స్త్రీలకు తమ శరీరాలపై సార్వభౌమాధికార హక్కు వుందని, అది అనుల్లంఘనీయమని చెప్పాడు. మగపెత్తనంపై దాడిచేస్తూ స్త్రీవిముక్తి ఉద్యమాన్ని నిర్మించాలని పేర్కొన్నాడు.

హరిత విప్లవం ఫలితంగా దేశం ఎడారీకరణకు గురైందని, వర్షాలు అడవులకు వలసపోయాయని, రైతుల ఆత్మహత్యలన్నీ 'క్లైమేట్ ఛేంజ్ డెత్' లేనని సూత్రీకరించాడు. హరితహారాల వలన ఉపయోగంవుండదని, కొండలచుట్టూ దట్టమైన అడవులను పెంచితే వర్షాలు తిరిగివస్తాయని చెప్పాడు. భూమికి నీటిని తాపించు అనే నినాదాన్ని తీసుకువచ్చాడు.

ప్రకటించుకున్న ప్రాపంచిక దృక్పధానికి, జీవిస్తున్న తీరుకీ మధ్య అతి తక్కువ వైరుధ్యం సాధించిన అతి కొద్దిమంది కమ్యూనిస్టులలో మోహన్ ఒక్కడు.

భవిష్యత్తు అతన్ని ధృవీకరిస్తుంది. చరిత్రలో అతని స్థానాన్ని పదిలం చేస్తుంది.

మోహన్‌రెడ్డి మిత్రులు